ఆంధ్రప్రదేశ్ శాసనసభ కార్యకలాపాలు

# ANDHRA PRADESH
# LEGISLATIVE ASSEMBLY DEBATES

అధికార నివేదిక

## OFFICIAL REPORT

మంగళవారము, మార్చి 7, 2006

12 వ శా.స. VI స. వాల్యూం -- III నంబరు --3

శక సంవత్సరము - 1927, ఫాల్గుణం - 16

## TUESDAY, THE 7th MARCH, 2006

12 L.A. VI S. VOL-- III No. - 3

16 - Phalgun , 1927 - S.E.

#


శాసనసభ సచివాలయము

పబ్లిక్ గార్డెన్స్

హైదరాబాదు - 500 004.

LEGISLATURE SECRETARIAT
PUBLIC GARDENS
HYDERABAD
500 004.

# ఆంధ్రప్రదేశ్ శాసనసభ

## ప్రధాన అధికారులు

| | | |
|---|---|---|
| సభాపతి | : | శ్రీ కె. ఆర్. సురేష్‌రెడ్డి |
| అధ్యక్షుల పేర్ల పట్టిక | : | శ్రీ యు . పురుషోత్తమ రెడ్డి<br>శ్రీ బి. వేదవ్యాస్<br>డా.(శ్రీమతి) కుతూహలమ్మ<br>శ్రీ నాదెండ్ల మనోహర్<br>శ్రీ డి. నరేంద్ర కుమార్<br>శ్రీ ఎ. గోవింద నాయక్ |
| కార్యదర్శి | : | శ్రీ కె. తుల్జానంద్ సింగ్ |
| ఉప కార్యదర్శులు | : | శ్రీ ఎస్. వెంకటేష్<br>శ్రీ ఎస్. రాజ సదారామ్<br>శ్రీ యు. జగదీశ్వర్<br>శ్రీ ఎన్. అంజయ్య |
| సహాయ కార్యదర్శులు | : | శ్రీ డి.శివరావు<br>శ్రీ ఎం. పాండురంగాచార్య<br>శ్రీ ఎం.వి.వి.సత్యానందం<br>శ్రీ పి. సీతారాములు<br>శ్రీ కె.ఎ.నర్సింహరాజు<br>శ్రీ డి. నర్సింహులు<br>శ్రీ పి. సత్యనారాయణ<br>శ్రీ కె. తులసీరాం<br>శ్రీ డి. సత్యనారాయణ<br>శ్రీ ఎ. రామిరెడ్డి |
| చీఫ్ రిపోర్టర్ | : | శ్రీమతి వి. గిరిజా సుందరి |

--------

ఆంధ్రప్రదేశ్ శాసనసభ చర్చలు
అధికార నివేదిక

( పన్నెండవ శాసనసభ)
( ఆరవ సమావేశము : పదిహేనవరోజు )
మంగళవారము, మార్చి **7, 2006**
సభ ఉ. గం. **8.30** లకు ప్రారంభమైనది
( గౌ. సభాపతి అధ్యక్ష స్థానములో వున్నారు )

----------

## విషయ సూచిక

1. సభా కార్యక్రమము

   వాయిదా తీర్మానముల గురించి

2. నక్షత్రపు గుర్తుగల ప్రశ్నలు – వాగ్రూప సమాధానములు

3. స్వల్పవ్యవధి ప్రశ్నలు

4. జీరో అవర్

5. సభా సమక్షంలో ఉంచిన పత్రములు

6. 2006–2007సంవత్సరానికి వార్షిక ఆదాయ – వ్యయ పట్టిక (బడ్జెటు) పై

   గ్రాంట్ల కొరకు అభ్యర్థన – నాల్గవరోజు

   అభ్యర్థన నెం. **XXIV (24)** - అల్ప సంఖ్యాక వర్గాలు

   అభ్యర్థన నెం. **XXV (25)** - మహిళా, శిశు సంక్షేమం, వికలాంగుల సంక్షేమం

   అభ్యర్థన నెం. **XVIII (18)** - గృహ నిర్మాణం

   అభ్యర్థన నెం. **XXI (21)** - సాంఘిక సంక్షేమం

   అభ్యర్థన నెం. **XXII (22)** - గిరిజన సంక్షేమం

   అభ్యర్థన నెం. **XXIII (23)** - వెనుకబడిన తరగతుల సంక్షేమం

   (ప్రతిపాదించబడినవి)

7. సభా కార్యక్రమము

8. 2006–2007సంవత్సరానికి వార్షిక ఆదాయ – వ్యయ పట్టిక (బడ్జెటు) పై చర్చ

   గ్రాంట్ల కొరకు అభ్యర్థన – నాల్గవరోజు

   అభ్యర్థన నెం. **XXXIII (33)** - పెద్దతరహా, మధ్య తరహా నీటిపారుదల

   అభ్యర్థన నెం. **XXXIV (34)** - అడవులు,పర్యావరణం శాస్త్ర సాంకేతిక విజ్ఞానం, చిన్న తరహా నీటిపారుదల

   అభ్యర్థన నెం. **XXXV (35)** - సమాచారం, పౌర సంబంధాలు, ఇంధనం, బొగ్గు గనులు

   అభ్యర్థన నెం. **XI (11)** - రోడ్లు, భవనాలు, ఓడరేవులు (కొనసాగింపు)

------------------

## సభా కార్యక్రమము

### వాయిదా తీర్మానముల గురించి

MR. SPEAKER : Adjournment Motions have been received today.

1. Adjournment Motion given notice of by Sri G. Kishan Reddy Garu regarding measures to be taken to arrest rampant corruption in the implementation of various developmental programmes is disallowed.
2. The other Adjournment Motion given notice of by Sri Komireddi Ramlu Garu regarding immediate allotment of house sites to MLAs and EX-MLAs. is also disallowed.

Question No.5393, Minister for Major Irrigation.

(INTERRUPTIONS FROM SRI G. KISHAN REDDY)

MR. SPEAKER : We will finalize it. I will examine that request and finalize it. Now, on question 5393, Minister for Major Irrigation.

శ్రీ జి. కిషన్‌రెడ్డి (హిమాయత్‌నగర్): సార్, నేను వాయిదా తీర్మానం ఇచ్చాను. ఈ రోజు రాష్ట్రంలోని అన్ని విభాగాల్లో అవినీతి పెరిగిపోయింది. భూముల కుంభకోణాలు గాని, సాగునీటి ప్రాజెక్టుల్లో అవినీతి గాని ఈ విధంగా అనేక విషయాల్లో అవినీతి విపరీతంగా పెరిగిపోయింది. కాబట్టి ఈ విషయాల గురించి చర్చించవలసిన అవసరం ఉంది.

మిస్టర్ స్పీకర్ : దీనిపైన, we will finalise.

శ్రీ జి. కిషన్ రెడ్డి: పార్టీలతో సంబంధం లేకుండా వ్యవస్థలోనే అవినీతి పెరిగిపోయింది. ప్రభుత్వంలో ఉన్న వారే చెపుతున్నారు. మీరు కూడా చెప్పారు. కాబట్టి అవినీతి అంశం మీద చర్చ జరగాలి.

Mr.Speaker : We will examine it. Yes, question No. 5393

## నక్షత్రపు గుర్తుగల ప్రశ్నలు – వాగ్రూప సమాధానములు

### చిన్నతరహా నీటి పారుదల శాఖలో ఖాళీగా ఉన్న పదవుల భర్తీ

ప్రశ్న నెం. 131(5393)

సర్వశ్రీ ఎ.గోవింద నాయక్ (ఖానాపూర్),టి. హరీష్‌రావు (సిద్ధిపేట), శ్రీమతి ఎం.పద్మా దేవేందర్ రెడ్డి (రామాయంపేట), ఎస్.బాపురావు (బోథ్), ఇ.రాజేందర్ (కమలాపూర్), కె.లింగయ్య (నేరేళ్ల)- భారీ, మధ్య తరహా నీటిపారుదల శాఖ మంత్రి దయచేసి ఈ క్రింది విషయములు తెలిపెదరాః

(అ)చిన్న తరహా నీటి పారుదల శాఖలోని ఇంజనీరింగు విభాగంలో వివిధ స్థాయిలలో మంజూరైన ఉద్యోగుల సంఖ్య ఎంత?

(ఆ) ప్రస్తుతం పని చేస్తున్న ఉద్యోగుల సంఖ్య ఎంత? ఖాళీగా ఉన్న పదవుల సంఖ్య ఎంత?

(ఇ)ఆ పదవులను భర్తీ చేసేందుకు ప్రభుత్వం తీసుకున్న చర్యలేవి?

(ఈ)అయితే ఖాళీలను భర్తీ చేయడానికి ఎంత కాలం పడుతుంది?

**భారీ మధ్య తరహా నీటిపారుదల శాఖ మంత్రి (శ్రీ పొన్నాల లక్ష్మయ్య):**

(అ)సాగునీటి శాఖలోని ఇంజనీరింగు సిబ్బంది విషయానికి సంబంధించి మంజూరైన మొత్తం సిబ్బంది సంఖ్య 7791. ఇందులో చిన్నతరహా/మధ్యతరహా సాగునీటి శాఖ మొత్తం సిబ్బంది సంఖ్య 940.

(ఆ) 702 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. 238 పదవులు ఖాళీగా ఉన్నాయి.

(ఇ)మొత్తం సాగునీటి శాఖ కోసం ఎపిపిఎస్‌సి ద్వారా ప్రభుత్వం 545 అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ల పదవులను భర్తీ చేసింది. చిన్న తరహా సాగునీటి విభాగంలో పనిచేయడానికి పదవీ విరమణ చేసిన 200 మంది ఎ.ఇ.లు/ఎఇఇలు/డిఇఇలను హైరు కు తీసుకోవాలని ప్రభుత్వం ఉద్దేశిస్తున్నది.

(ఈ) హైరుకు తీసుకునే ప్రక్రియను చేపట్టి, త్వరలోనే పూర్తి చేయడమవుతుంది.

శ్రీ ఇ. రాజేందర్ : అధ్యక్షా, ఈవేళ ప్రభుత్వం సాగునీటి రంగానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని చెప్పుకుంటున్నది. అయితే తెలంగాణ ప్రాంతంలో గాని, ఉత్తరాంధ్ర, రాయలసీమలో గాని భారీ ప్రాజెక్టులు లేనప్పుడు, స్వాతంత్ర్యంకు ముందు నుండి కూడా దాదాపు లక్ష చెరువులు ఆంధ్ర రాష్ట్రంలో ఉండి, 36 లక్షల ఎకరాలను సస్యశ్యామలం చేసిన ఘనత ఉంది. 1950లో తెలంగాణ ప్రాంతంలో 11 లక్షల హెక్టార్లను సాగులోనికి తీసుకుని వచ్చిన ఘనత కూడా మైనర్ ఇరిగేషన్ రంగానికి ఉంది. కాని ఈనాడు 5,42,620 హెక్టార్లకు ఆయకట్టు తగ్గిపోయిన చరిత్రను మనం చూస్తున్నాం. సాగునీటి రంగంలో అత్యధిక కీలక పాత్ర వహిస్తున్న ఈ మైనర్ ఇరిగేషన్ రంగాన్ని చాలా తక్కువ చూపు చేస్తున్నాం కాబట్టే రోజు రోజుకి తాగు,సాగునీటి వనరులు మరీ ముఖ్యంగా తెలంగాణ ప్రాంతంలో తగ్గిపోతున్నాయి. అయితే భారీ మొత్తంలో సాగునీటి రంగానికి నిధులు కేటాయిస్తున్నప్పటికీ మనకు తగినంత స్టాఫ్ లేకపోవడం వల్ల కేటాయించిన నిధుల్ని కూడా సద్వినియోగం చేసుకోలేకపోతున్నాము. 2004-05లో గాని, 2005-06లో గాని కేటాయించిన డబ్బులు, ఖర్చు పెట్టిన డబ్బుల శాతాన్ని చూస్తే ఈరోజున ఆ డిపార్టుమెంట్ ఎంత దరిద్రంగా ఉందో తెలుస్తుంది. అంతకు ముందు డిపార్టుమెంట్‌లో పనులు లేక వేరే డిపార్టుమెంట్లకు వారిని డైవర్టు చేసిన చరిత్ర ఉంది. మా పార్టీ ఒక్కటే డిమాండ్ చేస్తోంది--ఇరిగేషన్ డిపార్టుమెంట్‌లో అనేక పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అదే విధంగా ప్రమోషన్లో, రిక్రూట్‌మెంట్లో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగస్థులకు అన్యాయం జరుగుతోంది. 86 మంది ఎస్.ఇ.ల్లో 13 మంది ఎస్సీలు, ఆరుగురు ఎస్టీలు ఉండాలి. అయితే రోస్టర్ ప్రకారం నియమించడం కాని, ప్రమోషన్లు ఇవ్వడం కాని జరగడం లేదు. అదే విధంగా 481 మంది ఇ.ఇ.లకు గాను, 73 మంది ఎస్సీలు, 45 ఎస్టీలు ఉండాలి.

అర్హత గల 36 మంది ఎస్సీలు ఉన్నప్పటికీ ఇంతవరకు వారిని అపాయింట్ చేయలేదు. అదే విధంగా ఎస్టీలు నల్గురు మాత్రమే ఉన్నారు. 1560 మంది డిఇఇలు ఉండగా, అందులో 234 ఎస్సీలు, 94 ఎస్టీలు ఉండాలి. కాని 110 మంది ఎస్సీలు, 30 మంది ఎస్టీలు మాత్రమే ఉన్నారు. ఎస్సీ, ఎస్టీలకు అన్యాయం జరగకుండా చూడాలి. అధ్యక్షా, మీకు తెలుసు తెలంగాణ ప్రాంతంలో చెరువుల గురించి. ఈ చెరువులు కేవలం ఇరిగేషన్‌కే కాకుండా గొర్రె కాపర్లకు గాని, కుల వృత్తులు చేసుకునే వారికి గాని ఉపయోగపడేవి. అయితే ఈనాడు చెరువులన్నీ పూడికతో నిండి ఉపయోగపడకుండా ఉన్నాయి. అంతేకాకుండా, ఒక్కొక్క చెరువు తెగిపోయే పరిస్థితులు ఉన్నాయి. కాబట్టి బండ్స్‌ను స్ట్రెంథన్ చేయాలి. పూడిక తీయాలి. పూడిక తీసి ఛానల్స్‌ను ఉపయోగించుకోవలసిన అవసరం ఉంది. మొత్తం బడ్జెట్‌లో మైనర్ ఇరిగేషన్‌కు 36 శాతం కేటాయించిన నిధులు సద్వినియోగం కావాలంటే, స్టాఫ్‌ను కూడా తప్పకుండా పెంచాలి. ఆ విధంగా చేస్తే తప్ప ప్రాజెక్టులు అమల్లోకి రావు. మరీ ముఖ్యంగా తెలంగాణ, ఉత్తరాంధ్ర ప్రాంతాలకు అన్యాయం జరిగింది. కాబట్టి యుద్ధ ప్రాతిపదిక మీద ఈ ఖాళీ పోస్టులన్నింటిని భర్తీ చేసి ఈ రంగాన్ని ఆదుకోవలసిందిగా కోరుతున్నాను.

శ్రీ పి. జనార్ధన రెడ్డి (ఖైరతాబాద్) : అధ్యక్షా, ఏ డిపార్టుమెంట్‌లో అయినా ఉద్యోగస్థులు ఒక మెషినరీలాగా పనిచేస్తారు. ఫైల్స్ మూవ్ కావాలన్నా, పనులు జరగాలన్నా, ఏ విధంగా అయితే రా మెటీరియల్ వచ్చిన తరవాత ఇండస్ట్రీలో కార్మికులు ఉంటే ప్రొడక్షన్ బయటకు వస్తుందో, అదే విధంగా ప్రభుత్వ సిబ్బంది కూడా. ఇరిగేషన్ రంగానికి ఈ సంవత్సరం బడ్జెట్‌లో 51 శాతం అంటే సుమారు 11 వేల కోట్ల రూ.లను పెట్టడం జరిగింది. ఇంత డబ్బు ఖర్చు పెడుతున్నప్పుడు, వాటిని అమలు చేయడానికి సిబ్బంది కూడా అంతే అవసరం. మంత్రిగారే సమాధానంలో చెప్పారు--7791 పోస్టులు మంజూరు అయ్యాయని, అందులో మైనర్ ఇరిగేషన్ కింద 940 పోస్టులని. అయితే ఇందులో 702 మంది ఉద్యోగులు పని చేస్తుండగా, 238 పోస్టులు ఖాళీగా ఉన్నాయని కూడా చెప్పారు. మరి ఇంత తక్కువ సిబ్బంది సరిపోతుందా అని మీ ద్వారా మనవి చేస్తున్నాను. గతంలో బడ్జెట్ కేటాయింపులు తక్కువుగా ఉండి, సిబ్బంది ఎక్కువుగా ఉండేవారు. అయితే గత

పది సంవత్సరాలుగా అంటే ఎన్టీ రామారావు, చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రులుగా ఉన్నప్పటి నుండి రిటైర్ అయిన వాళ్ల స్థానంలో కొత్తగా రిక్రూట్‌మెంట్ జరగడం లేదు. దాని వల్ల చదువుకున్న ఎస్సీ, ఎస్టీ, బిసి వర్గాలకు చెందిన విద్యావంతులకు ఉద్యోగాలు దొరకడం లేదు. అయితే ఇప్పుడు మంత్రిగారు సమాధానం చెపుతూ, ఫెయిర్ పద్ధతిలో రిక్రూట్ చేసుకొంటామన్నారు. పిండి కొద్దీ రొట్టె అన్నారు. మీరు ఎంత మంచిగా ఎంప్లాయిస్‌ను సంతోష పెడితే అంత బాగా పని చేస్తారు వారు. అంత క్వాలిటీ ఆఫ్ వర్క్ బయటకు వస్తుంది. కాబట్టి నేను మీ ద్వారా మనవి చేసేది --సెక్రటేరియేట్‌తో సహా అనేక డిపార్టుమెంటుల్లో అనేక ఖాళీలు ఉన్నాయి. బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ కాకుండా ఉన్నాయి. ఇరిగేషన్ డిపార్టుమెంట్‌లో ఇంజనీర్ల పోస్టులను ఫెయిర్ పద్ధతిలో రిక్రూట్ చేసుకుంటామని మంత్రిగారు చెప్పారు. ఎప్పటిలోగా వాటిని భర్తీ చేస్తారు? అదే విధంగా రిక్రూట్‌మెంట్‌పై ఉన్న బ్యాన్‌ను ఎత్తేసి, నిరుద్యోగుల్ని ఆదుకుంటారా?

శ్రీ కె. వెంకట రెడ్డి (నల్గొండ) : సార్, మీ ద్వారా ముఖ్యంగా సంబంధిత శాఖ మంత్రిగారికి, ముఖ్యమంత్రిగారికి ముందుగా నా కృతజ్ఞతలు తెలియచేసుకుంటున్నాను, బడ్జెట్‌లో 51 శాతం నిధుల్ని సాగునీటి రంగానికే కేటాయించినందుకు. ప్రస్తుతం ప్రాజెక్టులన్నీ ప్రోగ్రెస్‌లో ఉన్నాయి. అయితే ఎ.ఇ.ఇ., డి.ఇ.ఇ. వంటి క్రింది స్థాయి క్యాటగిరిల్లో దాదాపు 30 శాతం వరకు ఖాళీలు ఉన్నాయి. ఒకవైపు ఇంత పెద్ద ఎత్తున మనం సాగునీటి ప్రాజెక్టులు చేపడుతున్నాము. నిధులు ఉన్నా, సిబ్బంది లేకపోతే ప్రాజెక్టులను పూర్తి చేయడం కష్టమవుతుంది. కాబట్టి మీ ద్వారా ప్రభుత్వాన్ని కోరేదేమిటంటే, ఇప్పుడు ఉన్న ఖాళీలన్నింటిని ఎపిపిఎస్‌సి ద్వారా కాని, కంట్రాక్టు పద్ధతిలో కాని రిక్రూట్ చేసుకోవాలి. నిరుద్యోగులైన సివిల్ ఇంజనీర్లు మనకు ఎంతో మంది ఉన్నారు. అలాగే రిటైర్ అయిన వాళ్లను కూడా తీసుకోవచ్చు. ఉదాహరణకు నల్గొండ జిల్లాను తీసుకుంటే, జిల్లా మొత్తానికి ఒకే డివిజన్ ఉంది. దానిని రెండు డివిజన్లు చేయాలని ఎప్పటి నుండో కోరుతున్నాము. ఇటీవలనే పంచాయితీరాజ్‌శాఖ కింద ఉన్న ట్యాంక్స్ అన్నింటిని ఇరిగేషన్ డిపార్టుమెంట్‌కు ట్రాన్స్‌ఫర్ చేయడం జరిగింది. దాంతో మైనర్ ఇరిగేషన్‌కు మనం కేటాయించిన నిధులు సరిపోవడం లేదు. మండలం మొత్తానికి అక్కడ ఒక్క ఎ.ఇ. మాత్రమే ఉన్నాడు. ఒక్క ఎ.ఇ. మాత్రమే ఉండటం వల్ల వర్క్స్ సూపర్‌వైజ్ చేయడానికి ఇబ్బంది అవుతోంది. కాబట్టి మండలానికి కనీసం ముగ్గురు, నల్గురు ఎ.ఇ.లు ఉండే విధంగా వెంటనే ఖాళీలన్నింటిని భర్తీ చేయాలని కోరుతున్నాను.

శ్రీ జి. కిషన్ రెడ్డి : అధ్యక్షా, ఈనాడు చాలా పెద్దఎత్తున మనం సాగునీటి ప్రాజెక్టుల కార్యక్రమాన్ని చేపడుతున్నప్పుడు, ఉద్యోగుల సంఖ్య మీద కూడా దృష్టి కేంద్రీకరించవలసిన అవసరం ఉంది. ఈనాడు సి.ఇ.(డిజైన్స్) ఒక్కరే ఉన్నారు. ఇ.పి.సి. విధానం కింద క్వాలిటీ కంట్రోలు మొత్తం మనమే చూస్తున్నప్పుడు, ప్లానింగ్ కాని, డిజైనింగ్ కాని చూడవలసిన అవసరం ఉంది. క్వాలిటీ కంట్రోలుకు సంబంధించి Third Party క్వాలిటీ కంట్రోల్ చూడాలి. అయితే ఒక ప్రాజెక్టు దగ్గర పనులు చేస్తున్న కంట్రాక్టరు వేరే పనుల దగ్గర క్వాలిటీ కంట్రోల్ చూస్తున్నాడు. అక్కడ పనులు చేస్తున్న కంట్రాక్టరు ఇంకొక ప్రాజెక్టు యొక్క క్వాలిటీని పరిశీలించే పరిస్థితి ఉంది. ఆ విధంగా సరైన పద్ధతిలో క్వాలిటీ కంట్రోలు జరపకపోవడం వల్ల భవిష్యత్తులో ప్రమాదం జరిగే అవకాశం ఉంది. ఇరిగేషన్ రంగానికి ఈనాడు మీరు పది వేల కోట్ల రూ.ల బడ్జెట్ కేటాయింపులు చేశారు. అనేక సాగునీటి ప్రాజెక్టులు చేపడుతున్నారు. ఈ విధంగా ఇంత పెద్ద స్థాయిలో పనులు చేపడుతున్నప్పుడు అంతే స్థాయిలో ఉద్యోగాలను భర్తీ చేయవలసిన అవసరం కూడా ఉంది. ఈనాడు ప్రభుత్వ సిబ్బంది లేక క్వాలిటీ కంట్రోలు విషయమై ప్రయివేటు వాళ్ల మీద ఆధారపడే పరిస్థితి వచ్చింది. అంతేకాకుండా, ఏ ప్రాజెక్టు ఎక్కడ కడుతున్నారు, ఎంత వరకు పూర్తయింది అని తెలుసుకోవడానికి ఈనాడు కంట్రాక్టర్లు ఇచ్చే ఇన్‌ఫర్మేషన్

మీద ఆధారపడే పరిస్థితి ఉంది. కాబట్టి ఎప్పటికప్పుడు సమాచారాన్ని తెలుసుకోవడానికి, క్వాలిటీ కంట్రోలు చూడటానికి వెంటనే ప్రభుత్వం ఈ డిపార్టుమెంటుకు సంబంధించి ఏ రకమైన కాంప్రమైజ్ కాకుండా ఖాళీలను భర్తీ చేయాలి.

శ్రీ ఎస్. మోహన్ రెడ్డి (నంద్యాల) : అధ్యక్షా, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత వై.ఎస్.రాజశేఖర్ రెడ్డిగారి నాయకత్వంలో జలయజ్ఞం పేరు మీద చిన్నతరహా నీటిపారుదల రంగాన్ని అన్ని విధాల ఆదుకుంటూ, మనం అత్యధిక నిధులిచ్చిన విషయం సభకు విదితమే. అయితే ఇక్కడ ఒక పరిస్థితిని గమనించాలి. ఈరోజు కర్నూలు జిల్లాలో చాలా చెరువుల కట్టలు తెగిపోయాయి. అదే విధంగా అలుగులు తెగిపోయాయి. కాల్వలు, చెరువులు పూడిపోయి చాలా అధ్వాన పరిస్థితిలో ఉన్నాయి. చిన్నతరహా నీటిపారుదల శాఖ మంత్రిగారిని ఒక్కటే రిక్వస్టు చేస్తున్నాను నీటిపారుదల రంగానికి సంబంధించి ఉద్యోగాల సంఖ్యను పెంచడమే కాకుండా, నాణ్యత విషయంలో గాని, ముఖ్యంగా పూడికతీత పనులు చేయించడంలో గాని ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. అంతకు ముందు తెలుగుదేశం ప్రభుత్వం ఉన్నప్పుడు పనికి ఆహార పథకం అని చెప్పి కోట్లాది రూపాయలు వెచ్చించినా ఏ మాత్రం పనులు జరగలేదు. విపరీతంగా తిన్నారు, భోజనం చేశారు తప్ప పనులు జరగలేదు. నిధుల దుర్వినియోగం జరిగింది. అందువల్ల చాలా చెరువులు పూడికతో నిండిపోయి, చెరువులు, అలుగులు తెగిపోయి, పూర్తిగా పనికి రాకుండా పోయాయి. ఎప్పుడో శ్రీకృష్ణదేవరాయలు నిర్మించి, ఆ తర్వాత బాగా ఉపయోగపడిన చెరువులు నిర్వీర్యమైపోయాయి. కాబట్టి ఒక్కొక్క చెరువుకు కనీసం అయిదు, పది లక్షల రూపాయలు ఖర్చు పెడితే వేలాది ఎకరాలు తిరిగి సాగులోకి వస్తాయి. అందుకు కావలసిన ఉద్యోగాలను తప్పకుండా భర్తీ చేయాలని కోరుతున్నాను.

శ్రీ పొన్నాల లక్ష్మయ్య : అధ్యక్షా, ఈరోజున సమాధానాల్ని వివరంగా చెప్పే అవకాశం నాకు లభించిందనుకుంటున్నాను. సమాధానాల్ని వినడానికి కూడా అవకాశం లేక, వినే ఓపిక లేకపోయిన విషయాన్ని మనం చూస్తున్నాము. ఎందుకంటే ఈమధ్య తరచుగా ఆ విధంగా జరుగుతున్నది కాబట్టి ఆ అంశాన్ని ప్రస్తావిస్తున్నాను. గౌ.సభ్యులు చక్కటి ప్రశ్నలు వేశారు. వాటన్నింటికి ప్రభుత్వం సమాధానం చెపుతుంది. చెప్పిన తరువాత ఇంకా సమాధానాలు కావాలంటే చెప్పడానికి ప్రయత్నిస్తాను.

మిత్రులు రాజేందర్‌గారు మాట్లాడుతూ మైనర్ ఇరిగేషన్ రంగం పట్ల చిన్న చూపు చూస్తున్నారని, ఇంకా పెద్ద ఎత్తున నిధులు కేటాయించి, పనులు చేపట్టాలన్నారు. ఈ సంవత్సరం ఈ రాష్ట్ర చరిత్రలో ఎన్నడు కూడా ఇంత పెద్ద ఎత్తున మైనర్ ఇరిగేషన్ రంగానికి నిధులు కేటాయించిన దాఖలాలు లేవు. ఈ సంవత్సరం 450 కోట్ల రూ.లు కేటాయించాము. ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత మొదటి సంవత్సరం కేటాయించిన దాని కన్నా వంద శాతం అధికంగా ఈ మూడవ సంవత్సరపు బడ్జెట్‌లో నిధులు కేటాయించాము. చిన్న నీటి వనరులు బాగా తగ్గిపోతున్నాయి, ఆయకట్టు బాగా తగ్గిపోతుందని, దానిని పునరుద్ధరించాలని కూడా ఒక సూచన చేశారు. ఈ రంగంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నది. 13 జిల్లాల్లో ఉపాధి హామి పథకం ద్వారా పనులు చేసే దాంట్లో, ప్రతి జిల్లాలో చిన్న నీటి వనరుల రంగానికి ప్రాధాన్యం ఇవ్వాలని, తద్వారా ప్రతి గ్రామంలో ఒక చెరువు అయినా, ఒక కుంట అయినా త్రవ్వాలని సూచనలు ఇచ్చాము. ఆ విధంగా దానిని ప్రతి జిల్లాలో అమలు చేసే పరిస్థితి ఉంది. Already reports are there with us. అంతేకాకుండా దేశ వ్యాప్తంగా చిన్న నీటి వనరుల్ని అభివృద్ధిపరిచే దిశగా ఈ మధ్యనే కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాల ముఖ్యమంత్రులతోను, మంత్రులతోను,

అధికారులతోను ఒక సమావేశం నిర్వహించారు. ఎందుకంటే దేశంలో అన్నిటి కంటే ఈ ఏడు రాష్ట్రాల్లోనే చిన్న నీటి వనరులు అత్యధికంగా 70 నుండి 80 శాతం ఉన్నాయనే ఉద్దేశ్యంతో ఈ ఏడు రాష్ట్రాల వారిని పిలిచి, అభిప్రాయాల్ని, సలహాల్ని తీసుకున్నారు. దేశ వ్యాప్తంగా 40 లక్షల ఎకరాల్ని స్థిరీకరించడానికి ఈ చిన్న నీటి వనరుల్ని అభివృద్ధి పరిచే ప్రయత్నంలో భాగంగా Restoration, Rennovation and Repairs కార్యక్రమాల్ని దశల వారీగా చేపట్టాలని, అందుకు గాను సుమారు 6 వేల కోట్ల రూ.ల అంచనాలతో ప్రపంచ బ్యాంక్‌కు ప్రతిపాదనలు పంపించారు. అందులో మన రాష్ట్రంలో 10 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించేందుకు గాను ఈ restoration, repairs కార్యక్రమాన్ని తీసుకునే విధంగా సుమారు రూ.1500 కోట్ల పథకాన్ని కేంద్ర ప్రభుత్వానికి పంపించడం జరిగింది. దీని ద్వారా వచ్చే సంవత్సరంలో రాష్ట్రంలో చిన్న నీటి వనరుల్ని పెద్దఎత్తున తీసుకునే అవకాశం ఉంది.

తరువాత ఉద్యోగాల రిక్రూట్‌మెంట్ గురించి, ప్రమోషన్ల గురించి కూడా రాజేందర్‌గారు చెప్పారు. గత రెండు సంవత్సరాల కాలంలో పది మంది సి.ఇ.లకు ప్రమోషన్లు ఇవ్వడం జరిగింది. ఇందులో రిటైర్ అయిన వారు కూడా ఉన్నారు. 68 మంది ఎస్.ఇ.లకు, 225 మంది ఇ.ఇ. లకు ప్రమోషన్లు ఇవ్వడం జరిగింది. 2004 సం. నుండి ఫిబ్రవరి మాసం వరకు 674 మంది డిఇఇలకు ప్రమోషన్లు ఇస్తే, అందులో 465 మంది ఆంధ్ర ప్రాంతానికి, 209 మంది తెలంగాణ ప్రాంతానికి చెందిన వారు ఉన్నారు. అట్లాగే 504 మంది ఎ.ఇ.ఇ.లకు ప్రమోషన్లు ఇస్తే, అందులో 297 మంది ఆంధ్ర, 217 మంది తెలంగాణ ప్రాంతానికి చెందిన వారు ఉన్నారు. అదే విధంగా ఎ.ఇ.లుగా 67 మందికి ప్రమోషన్ ఇస్తే, అందులో 44 మంది ఆంధ్ర ప్రాంతానికి చెందిన వారు, 23 మంది ఇక్కడి వారికి ఇవ్వడమయింది. గత పది సంవత్సరాల్లో తెలంగాణ ప్రాంతానికి చెందిన 50 మంది మాత్రమే ప్రమోషన్ తీసుకున్నారు.

జనార్దనరెడ్డిగారు బ్యాక్‌లాగ్ పోస్టుల గురించి అడిగారు. రిక్రూట్‌మెంట్‌లో గాని, బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ విషయంలో కాని ఎస్సీ, ఎస్టీ రూల్ ఆఫ్ రిజర్వేషన్‌ను చాలా స్ట్రిక్ట్‌గా పాటించడమే కాకుండా ప్రమోషన్లో కూడా పూర్తిగా పాటిస్తున్నాము. అదే విధంగా గౌ.సభ్యులు వెంకటరెడ్డిగారు నల్గొండ జిల్లా విషయం గురించి చెప్పారు.

ఉ. 8.50

ఇక్కడ రెండు డివిజన్స్ శాంక్షన్ చేయడం జరిగింది. త్వరలో ఆదేశాలు యివ్వడంతోబాటు పూర్తి చేయడానికి ప్రయత్నిస్తాము. కిషన్‌రెడ్డి గారు థర్డ్ పార్టీ క్వాలిటీ కంట్రోల్ గురించి , వారు కాంట్రాక్ట్స్ చేస్తున్నారని చెప్పారు. ఇందులో వాస్తవం లేదు. If there are any specific examples, let him send. మోహన్‌రెడ్డి మాట్లాడుతూ కర్నూల్ విషయంలో మీడియం యిరిగేషన్ ట్యాంక్స్ గురించి అడిగారు. ఇందాక నేను చెప్పిన దానిలోనే సమాధానం వుంది.

డాక్టర్ కె. నగేష్ (ఆలేరు): అధ్యక్షా, మంత్రిగారిని ఒకటే కోరుతున్నాము. ఈనెల 31 లోపల యస్‌సి, యస్‌టి బ్యాక్‌లాగ్ వేకెన్సీస్ కంప్లీట్ చేయాలని గత సంవత్సరం జీవో తెచ్చారు. ఇప్పటివరకు ఎపి ఫుడ్స్‌లో తప్ప మరెక్కడా ఈ ప్రాసెస్ కంప్లీట్ చేయలేదు. మిగిలిన 20 రోజుల్లో 30 వేల మందిని రిక్రూట్ అయినా చేయాలి, లేదా టైమ్ ఎక్స్‌టెండ్ చేయాలి. ఈ విషయంలో ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవలసిందిగా కోరుతున్నాను.

శ్రీ నరేష్ కుమార్ అగర్వాల్ (ఇచ్ఛాపురం): అధ్యక్షా, క్వశ్చన్‌కు రిలేటెడ్ కాకపోయినా ఈ అవకాశాన్ని వినియోగించుకుంటున్నాను. ఇచ్ఛాపురం నియోజకవర్గం ఒరిస్సా బార్డర్‌లో వుంది. బహుదా నది మీద ఒరిస్సా ప్రభుత్వం చాలా ఎత్తుగా గోడ కడుతోంది. 1978 డిసెంబర్ 78 నాడు నాగావళి, జంఝావతి , బహుదా, నెరాడి నదుల క్రింద యిరిగేషన్‌కి సంబంధించి ఒక ఎగ్రిమెంట్ జరిగింది. కానీ ఆ ఎగ్రిమెంట్‌ను డీవియేట్ చేస్తూ ఆ నదులపై కన్‌స్ట్రక్షన్ చేస్తున్నారు. గౌరవ ముఖ్యమంత్రివ ర్యులు ఎంతో సానుభూతితో మా ఇచ్ఛాపురం నియోజకవర్గానికి మైనర్ యిరిగేషన్ కొరకు రు. 6 కోట్లు యిచ్చారు. బహుదా నదికి సంబంధించి యిచ్చిన రు. 3 కోట్ల 54 లక్షలు మనం కట్టబోయే గ్రోయర్ ఛానల్స్‌కు సంబంధించి యిచ్చారు. వరద వస్తే నీటిని అడ్డుకునే ప్రయత్నం ఒరిస్సా ప్రభుత్వం చేస్తోంది. దీనికి సంబంధించి ఉత్తరప్రత్యుత్తరాలు ఆ ప్రభుత్వంతో జరపవలసిందిగా కోరుతున్నాను. నా నియోజకవర్గానికి 2006-07 సంవత్సరానికి మైనర్ యిరిగేషన్‌కు సంబంధించి గౌరవ ముఖ్యమంత్రిగారు రు. 7 కోట్లు కేటాయించాలని కోరుతూ, ఈ అవకాశం యిచ్చిన తమకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

శ్రీ మందాడి సత్యనారాయణ రెడ్డి (హన్మకొండ): అధ్యక్షా, ఇప్పుడే గౌరవ భారీ నీటి పారుదల శాఖ మంత్రిగారు చెప్పారు. రాయలసీమలో, ఉత్తరాంధ్రలో, తెలంగాణాలో చెరువులు ఎక్కువగా వున్నాయి. ముఖ్యంగా తెలంగాణాలో చెరువులు మరీ ఎక్కువగా వున్నాయి. ఇవి పల్లెపదాలకు జీవనాడులుగా వుండి వ్యవసాయానికి సంబంధించి సత్వర ఫలితాలను యిస్తున్నాయి. మంత్రిగారు మునుపటి కంటే వంద శాతం ఎక్కువ యిస్తున్నట్లుగా చెప్పారు. నీటికి సంబంధించి అవసరం ఎంత , మీరు పెట్టిన బడ్జెట్ ఎంత అనేది ఆలోచించవలసిందిగా కోరుతున్నాను. భారీ యిరిగేషన్ శాఖా మంత్రిగారికి ఎన్ని వేల కోట్ల రూపాయలైనా సరిపోవడం లేదు. చిన్న నీటి వనరులపై చిన్న చూపు పనికిరాదు. అధ్యక్షా, ముఖ్యమంత్రిగారిని తమ ద్వారా కోరుతున్నాను. మీరు రైతాంగానికి రు. 1200 కోట్లో, రు. 1400 కోట్లో విద్యుత్ బకాయిలను ఔదార్యంతో రద్దు చేసినందుకు సంతోషం . అయితే సత్వరమే సత్ఫలితాలను యిచ్చేటటువంటి చిన్న నీటి వనరులకు మీరు రు. 450 కోట్లో, రు. 500 కోట్లో పెట్టడంం ఏమి బాగుంటుంది? చిన్న నీటి వనరుల శాఖ మంత్రిగారు మౌనంగా వున్నారు. దీనికి సంబంధించి కూడా భారీ నీటి పారుదల శాఖ మంత్రిగారే సమాధానం చెబుతున్నారు. మర్రి చెట్టు క్రింద చిన్న చెట్టు పెరగదు. దయచేసి మాకు నిధులు ఎక్కువ చేయండి.

ఈ శాఖలో సిబ్బంది కొరత కూడా ఎక్కువగా వుంది. మైనర్ యిరిగేషన్ మినిస్టర్ గారికి మా నియోజకవర్గంలోని చెరువులను సర్వే చేయవలసిందిగా పిటిషన్ యిస్తే , వెంటనే సర్వే చేయవలసిందిగా వారు వ్రాశారు. కానీ అక్కడి ఇంజనీరింగ్ సిబ్బందిని కలెక్టర్ గారు తీసుకువెళ్లి ఎంప్లాయ్‌మెంట్ గ్యారంటీ స్కీమ్‌కు తోలారు. స్టాఫ్ లేరు, దిక్కులేదు అంటున్నారు. అందువల్ల వున్న సిబ్బందికి ఇఅదనపు బాధ్యతలు పెట్టకుండా , ఈ పనులను వారికి పునమాయించాలని, మైనర్ యిరిగేషన్‌కు కనీసం రు. 1000 కోట్లు, రు. 1200 కోట్లు పెడితేనే వెంటనే ఫలితాలు వస్తాయని తెలియజేస్తున్నాను. బడ్జెట్ ఎన్‌హ్యాన్స్ చేయవలసిందిగా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

శ్రీ ఎ. ఇంద్రకరణ్ రెడ్డి (నిర్మల్): అధ్యక్షా, అదిలాబాద్ జిల్లాలో వర్షపాతం ఎక్కువగా వుండి నీరు వృధాగా గోదావరిలోకి వెళ్లి, అక్కడి నుండి సముద్రంలో కలుస్తున్న విషయం అధికారులకు, ప్రభుత్వ యంత్రాంగానికి అందరికీ తెలుసు. అదిలాబాద్ జిల్లాలో అటవీ ప్రాంతం ఎక్కువగా వుండి వర్షాలు ఎక్కువగా పడడం వల్ల చిన్న చిన్న చెరువులన్నీ – పంచాయతీ రాజ్ డిపార్ట్‌మెంట్ నుండి యిరిగేషన్ డిపార్ట్‌మెంట్

ఆధ్వర్యంలోకి వచ్చిన తరువాత – తగిన మరమ్మత్తులు లేక పూర్తిగా నిర్వీర్యం అయ్యే పరిస్థితిలో వున్నాయి. ఆ చెరువుల మరమ్మత్తు కోసం పెద్ద ఎత్తున డబ్బు కేటాయించవలసిందిగా కోరుతున్నాను. ఇందువల్ల చెరువులు నిండుగా వుండి, భూగర్భ జలం కూడా పెరిగే అవకాశం వుంటుంది. అందువల్ల చిన్న నీటి వనరులకు డబ్బు ఎక్కువగా కేటాయించవలసిందిగా కోరుతున్నాను. మండలంలో, జిల్లాలో స్టాఫ్ సరిపడినంతగా లేరు. ఇంజనీరింగ్ స్టాఫ్‌ను సరిపడ నియామకం చేస్తే పనులు చక్కగా జరగడానికి, నీరును కాపాడడానికి అవకాశం వుంటుంది. మా జిల్లాకు ఈ విషయంలో ప్రాముఖ్యత యివ్వవలసిందిగా కోరుతున్నాను.

శ్రీ పి. జనార్దన రెడ్డి: అధ్యక్షా, ఇప్పుడే మంత్రిగారు చెప్పారు, ఏడు రాష్ట్రాల ముఖ్యమంత్రుల , నీటిపారుదల శాఖ మంత్రుల సమావేశం జరిగినట్లుగా. మైనర్ యిరిగేషన్ ద్వారా కల్టివేషన్ ఎక్కువగా వుంది. ఈ ఏడు రాష్ట్రాలలోను మైనర్ యిరిగేషన్ క్రింద 80 శాతం సాగుబడి వున్నట్లుగా మంత్రిగారు స్టేట్‌మెంట్ యిచ్చారు. మన రాష్ట్రంలో సుమారు 44 లక్షల ఎకరాలు సాగు అవుతోందని చెప్పారు. దీన్ని బట్టి మైనర్ యిరిగేషన్‌కు ఎంత ప్రాముఖ్యం వుందో తెలుస్తుంది. ఈ పనులు కావాలంటే మనకు పని చేసే సిబ్బంది అవసరం చాలా వుంది. చాలా కాలంగా చాలా డిపార్ట్‌మెంట్స్‌లో రిటైర్ అయిన వారి స్థానంలో ఉద్యోగులను భర్తీ చేయడం లేదు. ఎపి ఫుడ్స్ ఫ్యాక్టరీకి సంబంధించి నేను యూనియన్ ప్రెసిడెంట్‌ను కావడం వల్ల , అక్కడి యాజమాన్యంతో మాట్లాడి అక్కడి ఖాళీలను భర్తీ చేయించడం జరిగింది. ఈ ప్రభుత్వంపై యువత ఎంతో ఆశతో , నమ్మకంతో వున్నారు. రాజంపేటలో ఆర్ అండ్ బి బిల్డింగ్‌ను కూల్చడం కోసం బుల్‌డోజర్‌ను నడిపిస్తే , తగిన ఇంజనీరింగ్ స్టాఫ్ లేకపోవడం వల్ల బిల్డింగ్ కూలి పది మంది చనిపోవడం, 15 మంది దాకా గాయపడడం జరిగింది. ప్రమాదాలు జరిగిన తరువాత లక్షలకు లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించడం కాకుండా , ముందు జాగ్రత్తతో ఉద్యోగులను పెడితే ఇటువంటి సంఘటనలు పునరావృతం కావు. ముఖ్యంగా ప్రభుత్వ సంస్థలలో చాలా ఉద్యోగాలు ఖాళీగా వున్నాయి. మన బడ్జెట్ పెరుగుతూ వుంటే, ఉద్యోగుల సంఖ్య మాత్రం తగ్గుతూ వస్తూ వుంది. తగిన సిబ్బంది నియామకం చేస్తారా, లేదా?

శ్రీ పొన్నాల లక్ష్మయ్య: అధ్యక్షా, బ్యాక్‌లాగ్ పోస్టులను గురించి డాక్టర్ నగేష్ అడిగారు. బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి సంబంధించి We have already informed APPSC for filling up of posts. Action is being taken. నరేష్ కుమార్ అగర్వాల్ గారు వారి నియోజకవర్గంలో ఇప్పటికే యిచ్చిన రు. 6 కోట్లతోబాటు మరొక రు. 7 కోట్లకు ప్రతిపాదనలు పంపించారని, ఆ నిధులు కూడా కావాలని అంటున్నారు. ఆ విషయం పరిశీలిస్తాము. అదేవిధంగా గౌరవ శాసనసభ్యులు సత్యనారాయణ రెడ్డి బడ్జెట్ చాలా తక్కువగా వుందని అంటున్నారు. సిబ్బంది నియామకం కావాలని అంటున్నారు. నేను చాలా స్పష్టంగా చెప్పాను, రాష్ట్ర చరిత్రలో ఏనాడు లేనంత అత్యధికంగా చిన్న నీటి పారుదల రంగానికి నిధులు కేటాయించడం జరిగింది. ఈ ప్రభుత్వం వచ్చిన మొదటి సంవత్సరం బడ్జెట్ కంటే నూటికి నూరు శాతం పెంచాము. రాష్ట్రంలోని 13 జిల్లాలలో అమలు అవుతున్న ఉపాధి హామీ పథకం ద్వారా చిన్న నీటి వనరులకు కూడా ప్రాముఖ్యత యిచ్చి చేయండని చెప్పారు. ఆ రకంగా జరుగుతూ వుంటుంది. అదే విధంగా ఏడు రాష్ట్రాలకు సంబంధించి చేసిన విధంగా వచ్చే కొద్ది రోజుల్లో ఈ పథకం అమలుపరచే దశలో కార్యక్రమం తీసుకోబడుతున్నది. ఇంత పెద్ద ఎత్తున చరిత్రలో ఏనాడు తీసుకోలేదని గమనించవలసిందిగా కోరుతున్నాను. అదిలాబాద్ జిల్లాలో స్టాఫ్ తక్కువగా వుందని, పి. జనార్దనరెడ్డి రిక్రూట్‌మెంట్ కావాలని ప్రస్తావించారు. అందుకే వెంటనే 200 మంది రిటైర్డ్ ఇంజనీర్స్‌ను తీసుకొని ఉపాధి హామీ పథకం, చిన్న నీటి వనరుల పనులకు ఉపయోగించబడే విధంగా తీసుకోవడం జరుగుతుంది. అవసరమైతే యింకా కొంతమందిని తీసుకోవడం జరుగుతుంది.

ఉ.9.00

## వసతి గృహాలకు రెసిడెంటు వార్డెన్లు

ప్రశ్న నెం.132(4775)

సర్వశ్రీ ఎస్. శైలజానాథ్ (శింగనమల), కొమిరెడ్డి రాములు (మెట్‌పల్లి) – గౌరవనీయులైన సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారాః

అ. సంక్షేమ హాస్టళ్ల లోని వార్డెన్లు హాస్టళ్లలో నివసించడం లేదన్న విషయం ప్రభుత్వం దృష్టికి వచ్చిందా?
ఆ. వార్డెన్లు హాస్టళ్లలో నివసించనందువల్ల విద్యార్థుల చదువులు దెబ్బ తింటున్న విషయం వాస్తవమేనా;
ఇ. అన్ని దశలలోనూ వున్న అవినీతి సమస్యకు ప్రధాన కారణమన్న విషయాన్ని గుర్తించడం జరిగిందా;
ఈ . అయితే, పరిస్థితిని మెరుగుపరచడానికి ప్రభుత్వం తీసుకున్న చర్యలు ఏమిటి?

**సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి (శ్రీ డి.ఎస్. రెడ్యానాయక్) :**

అ. అవునండీ.

సాంఘిక సంక్షేమ హాస్టళ్ల విషయానికి సంబంధించి కొంత మంది హాస్టలు సంక్షేమ అధికారులు ప్రధాన కార్యస్థానాలలో నివసించడం లేదు.

ఆ. లేదండీ.
ఇ. లేదండీ.
ఈ . ఈ క్రింద పేర్కొన్న ఆదేశాలను ప్రభుత్వం జారీ చేసింది :

– తమ ప్రధాన కార్యస్థానాలలో నివశించనట్టి హాస్టలు సంక్షేమ అధికారులపై క్రమశిక్షణా చర్యను ప్రారంభించడమయింది.

–హాస్టలు సంక్షేమ అధికారులందరూ ప్రధాన కార్యస్థానాలలోనే ఉండాలి.

– 10వ తరగతి విద్యార్థులకు అదనపు శిక్షణను సమకూర్చడానికి అన్ని సబ్జెక్టులలో ట్యూటర్లను నియమించడమయింది.

– ఆదివారాలలో వారంవారీ పరీక్షలన్నింటినీ నిర్వహించాలి.

డా.ఎస్. శైలజానాథ్ : అధ్యక్షా, మంత్రి గారికి ధన్యవాదాలు. గత తెలుగుదేశం పరిపాలనలో సంక్షేమ రంగం పూర్తిగా విస్మరించబడింది. ముఖ్యంగా ఎస్‌సి, ఎస్‌టి, బిసి హాస్టల్సు కొత్తవి గాని, పాతవి గాని పట్టించుకున్న దాఖలాలు లేవు. రాజశేఖరరెడ్డి గారి ప్రభుత్వం వచ్చేక సంక్షేమ రాజ్యాన్ని స్థాపించడంలోను, ఇంటిగ్రేటెడ్ హాస్టల్సు కాన్సెప్ట్‌ను ముందుకు తేవడం వల్లనూ రాష్ట్రం అంతా హర్షిస్తున్నారు. కాకపోతే, కొన్ని ప్రధాన సమస్యలను మంత్రి గారి దృష్టికి తెచ్చాము.

ఈ రాష్ట్రంలో ఏ మూలనైనా ఏ హాస్టలుకు వెళ్లినా ఒకటే పరిస్థితి. లైట్లు సరిగా ఉండవు. రాత్రి పూట పిల్లలు బిక్కుబిక్కు మంటూ పడుకుంటారు. బొద్దింకలు, తేళ్లు తిరుగుతూ ఉంటాయి. ప్రత్యేకంగా ఎస్‌సి, ఎస్‌టి హాస్టల్సులో అదేదో మేము ఉచితంగా పెట్టేవాళ్లం, మీరు తినే వాళ్లు అనే ఆలోచన సంక్షేమ శాఖ అధికారులలో బాగా కనిపిస్తోంది. మంత్రి గారికి ఇవి తెలియనివి కావు. మంత్రి గారు కొన్నిటికి చెప్పారు. కొన్నిటికి చాలా తేలిగ్గా చెప్పారు. అసలు ఎంతమంది వార్డెన్సు ఎస్‌సి ఎస్‌టి హాస్టల్సులో అక్కడ ఉంటున్నారు? కనీసం నా సింగనమల నియోజకవర్గంలో ఎంతమంది ఉంటున్నారో చెప్పాలి. ఎంత ఛండాలమైన పరిస్థితి హాస్టల్సులో ఉందంటే, అక్కడకు పోతే పిల్లలు బావురు మంటున్నారు. మన పిల్లల్ని ఇంట్లో వదలి పెట్టి వెడితే వాళ్లు అన్నం తిన్నారో, సరిగా పడుకున్నారో లేదో నని పది సార్లు ఫోను చేసి కనుక్కుంటాము. మారుమూల ప్రాంతాలలోని సాంఘిక సంక్షేమ శాఖ హాస్టలు పిల్లలు దారిద్ర్యానికి గురైతేనే తప్ప, తల్లిదండ్రులు హాస్టల్సుకు పంపరు. వారికి డబ్బులు పెట్టుకునే పరిస్థితి ఉంటే హాస్టల్సుకు పంపే పరిస్థితి ఉండదు. మంత్రి గారు లేదండీ, లేదండీ అంటూ సమాధానం ఇచ్చారు. బహుశా సాంఘిక సంక్షేమ శాఖ విభాగంలో పూర్తిగా ప్రక్షాళన జరిగి, అత్యంత గొప్పగా పని చేస్తున్నదని వారు అనుకుంటున్నారేమో నాకు తెలియదు. ప్రజలు మాత్రం కథలు కథలుగా చెప్పుకుంటున్నారు. వార్డెన్లు హాస్టల్సులో ఉండటం లేదన్న విషయం మంత్రి గారికి తెలియనిది కాదు. సంబంధిత అధికారులు ఆ విధంగా సమాధానాలు రాశారని భావిస్తున్నాను.

తర్వాత, రేషనలైజేషన్ పేరు మీద స్థానికంగా ఉన్న వారిని తీసివేశామని, లేకుంటే రాత్రి పూట రాని వారిని తీసివేశామని అంటున్నారు. అధ్యక్షా, నా నియోజకవర్గంలో స్థానికంగా ఉంటున్నారన్న పేరు మీద కొంతమందిని తీసివేశారు. బినామీ పేర్లు ఉంటాయి. రేషనలైజేషను పేరుతో మండల కేంద్రాలలో ఉండే వారిని బయటకు పంపించారు. దీనిపైన సంబంధిత అధికారులతో మాట్లాడితే లేదని చెప్పారు. కాని వాస్తవం అది కాదు. అధ్యక్షా, అవినీతి ఈ రోజు పుట్టుకు వచ్చింది కాదు. వారు పట్టించుకోనందు వల్ల పెద్ద ఎత్తున జరిగింది. మంత్రి గారు మా జిల్లాకు వచ్చినపుడు ఒక వార్డెనును సస్పెండ్ చేయడం జరిగింది. ఒక పూట వారు వచ్చినపుడే అతడు లేడని సస్పెండు చేశారు. మంత్రి గారిని అవినీతి మూలాల గురించి ప్రశ్నించడం లేదు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి పిల్లల భవిష్యత్తు దృష్ట్యా మీరు ఏమైనా వార్డెన్లు ఖచ్చితంగా అక్కడే ఉండే విధంగా చర్యలు తీసుకుంటారా? తీసుకున్నామన్నారు. ఎంతమంది పైన తీసుకున్నారు? అంతేకాకుండా జిల్లా అధికారులను ఎంతమందిని బాధ్యుల్ని చేశారు?

శ్రీ డి.ఎస్. రెడ్యా నాయక్ : సాంఘిక సంక్షేమ శాఖ గాని, గిరిజన సంక్షేమ శాఖ గాని, ఇంకా బి.సి. సంక్షేమ శాఖ గాని వాటి విషయంలో గౌరవ సభ్యులు చెప్పిన విధంగా గతంలో హాస్టల్సు చాలా అధ్వాన్నంగా ఉన్న మాట వాస్తవం. హాస్టల్సు మీద కథనాలు వచ్చిన మాట వాస్తవం. అందుకోసమే ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేక సంక్షేమ హాస్టల్సు గాని, ఆశ్రమ పాఠశాలలు గాని, రెసిడెన్షియల్ స్కూల్సు గాని బాగా నడవాలని, డాక్టర్ రాజశేఖర రెడ్డి గారి నాయకత్వంలో ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ ప్రభుత్వం కార్యక్రమాలు చేపట్టింది.

చాలా మంది గౌరవ సభ్యులు అడిగేరు, గతంలో హాస్టలు సీట్సు పెంచలేదు, పెంచమని. పెంచిన 5 శాతం, 10 శాతం మూలంగా అందరు పిల్లలకు అడ్మిషన్సు దొరకడం లేదని చెప్పినప్పుడు ప్రభుత్వం వెంటనే గిరిజన సంక్షేమ శాఖ గాని, సాంఘిక సంక్షేమ శాఖ గాని వివిధ హాస్టలు వెల్ఫేర్ ఆఫీసర్సుకు ఆదేశాలు ఇవ్వడం జరిగింది. జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు ఇవ్వడం జరిగింది. ఎంతమంది ఎస్సి, ఎస్టి పిల్లలు హాస్టల్సులో ఎడ్మిషను కావాలని దరఖాస్తు చేసుకుంటారో వారందరికీ అడ్మిషన్సు ఇవ్వాలని ఆదేశించడం జరిగింది.

గౌరవ సభ్యులు చెప్పారు, స్థానికంగా ఉండే వారిని తీసి వేశారని. ఎంతమంది దరఖాస్తు చేసుకుంటే అంతమందికీ అడ్మిషను ఇవ్వాలని చెప్పినపుడు రాష్ట్రంలో ఒక్క సంక్షేమ శాఖలోనే 2 లక్షల 72 వేల మంది పిల్లలు గతంలో కంటే 25 వేల మందిని అదనంగా చేర్చుకోవడం జరిగింది. చేర్చుకున్న తర్వాత చాలా కంప్లయింట్సు వచ్చాయి. ఆన్ రోల్ మీద ఎంతమంది పిల్లలున్నారని, హాస్టల్సులో అంతమంది ఉండటం లేదని, ఎక్కువగా ఎన్‌రోల్‌మెంటు చెబుతున్నారని, అందరూ స్కూల్సుకు పోవడం లేదని, హాస్టల్సులో భోజనం చేసి ఎక్కడికో పోతున్నారని రకరకాల ఫిర్యాదులు వచ్చాయి. అందువల్ల దీని మీద డ్రైవ్ పెట్టాము. డెప్యూటీ డైరెక్టర్సు, జాయింట్ డైరెక్టర్సు, ఎఎస్‌డబ్ల్యుఓలు, డిఎస్‌డబ్ల్యుఓలు అందరితో ఒక డ్రైవ్ పెడితే ఒక సాంఘిక సంక్షేమ శాఖలో 2 లక్షల 72 వేల మంది ఉండగా 35 వేల మంది ఫిజికల్‌గా ఉండటం లేదని పర్యవేక్షణలో తేలింది. వారు స్కూలుకు పోవడం లేదని గాని, లాంగ్ ఆబ్సెంటీస్ అని గాని తేలడం వల్ల వారిని తొలగించడం జరిగింది. ట్రాన్స్‌పరెన్సీ ఉండే విధంగా ఉండాలి. హాస్టలులోఉండేవారు స్కూలుకు పోవాలి. స్కూలుకు పోతే హాస్టలులో ఉండాలి. స్థానికంగా ఉండే పిల్లలు భోజనం చేసి ఎక్కడికో పోతున్నారని ఆ విధంగా నిర్ణయించడం జరిగింది. హాస్టలులో ఉండటం లేదు. స్కూలుకు పోయేది లేనిది తెలియదు. స్థానికంగా ఉండే పిల్లల మూలంగా చెడ్డ పేరు వస్తోందని అధికారులు చెప్పడం జరిగింది. వారు హాస్టలుకు పోయినపుడు వారు లేరు.

అంతేకాకుండా గతంలో ప్రభుత్వ ఆదేశాలున్నాయి. 5 కిలోమీటర్ల లోపు పిల్లలను హాస్టల్సులో అడ్మిట్ చేసుకోకూడదని ఆదేశాలు ఉండటం మూలంగా హెడ్‌క్వార్టర్సులో ఉండే పిల్లలను, బయటకు పోయిన పిల్లలను మాత్రం తీసివేసిన మాట వాస్తవం. అందులో తప్పు లేదు. భోజనం చేసి ఎంతమంది పోతున్నారు, ఎంతమంది ఉంటున్నారో తెలియని పరిస్థితి. వార్డెన్ ఇన్స్‌పెక్షనుకు పోతే భోజనం చేసి అప్పుడే పోయినా తప్పించుకునే అవకాశం ఉంటుంది. అందువల్ల ఖచ్చితంగా ఆదేశాలు ఇచ్చాం.

**ఉ. 9. 10**

వార్డెన్లు తప్పకుండా హెడ్‌క్వార్టరులో నివసించాలి. మధ్యాహ్నం భోజనానికి తప్ప ఉదయం 6 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు వార్డెన్ హాస్టల్ ఉండాలని ఖచ్చితంగా ఆదేశాలు జారీచేశాము. హాస్టల్‌లో ఆన్ రోల్ మీద ఎంతమంది పిల్లలు ఉంటారో అంతమంది పిల్లలు ఫిజికల్‌గా ఉండాలి, భోజనం చేయడానికి పోయినప్పుడు హాజరు రిజిస్టరులో సంతకం చేయాలి, ఉదయం, సాయంత్రం అబ్జర్వ్ చేయాలని వార్డెన్‌కు ఆదేశాలు ఇచ్చాము. నెలకు రెండుసార్లు విధిగా ప్రతి హాస్టలు చూడాలని ఎ ఎస్ డబ్ల్యులకు చెప్పాము. ఆన్ రోల్ మీద ఉన్న పిల్లలు ఫిజికల్‌గా ఉండాలి, ఫిజికల్‌గా ఉన్న వారు ఆన్‌రోల్ ఉండాలి, ఫిజికల్‌గా వున్నావారు స్కూలుకు వెళ్లాలి. స్కూలుకు కూడా వెళ్లి వెరిఫై చేయాలని చెప్పాము. పిల్లలకు మంచి విద్య ఉండాలి 7, 10 తరగతి పిల్లలకు ట్యూటర్సును పెట్టాము. సకాలంలో రెండు జతల బట్టలు అందేవిధంగా చర్యలు తీసుకుంటున్నాము. టెక్స్టుబుక్స్, నోట్ పుస్తకాలు, వర్క్‌బుక్‌లు కూడా ఇచ్చాము. ప్రతినెల ఒకసారి లోకల్‌గా వున్న పిహెచ్‌సిలోని డాక్టరు విధిగా హాస్టల్‌కు వచ్చి

పిల్లల ఆరోగ్య స్థితగులను చూచి హెల్త్ కార్డు మీద రాయాలని చెప్పి ఆదేశాలు ఇచ్చాము . హాస్టల్స్‌లో కొన్ని వార్డెను పోస్టులు ఖాళీగా ఉన్నందున హాస్టల్స్ సక్రమంగా నడవడంలేదని మా దృష్టికి వచ్చినపుడు మొత్తం 344 ఖాళీలు ఉంటే 194 ఖాళీలు ఈ రోజు వరకు నింపాము . గిరిజన సంక్షేమ శాఖలో ఉన్న ఖాళీలను కూడా నింపాము . ప్రతి నెల డెప్యూటీ డైరెక్టర్ సోషల్ వెల్ఫేర్, డి ఎస్ డబ్ల్యు వో నెలకు 15 రోజులు తన పరిధిలో ఉన్న హాస్టల్స్‌ను పర్యవేక్షణ చేయాలని చెప్పాము . జాయింట్ డైరెక్టర్ తన జోన్‌లో ప్రతి నెల 15 రోజులు తిరగాలని ఆదేశాలు ఇచ్చాము . నేను కూడా పోయినప్పుడు , కమీషనర్‌గారు కూడా వెళ్లినపుడు హాస్టల్ విజిట్‌చేస్తే, వార్డెన్ హెడ్‌క్వార్టరులో లేకపోతే స్పాట్ మీద చర్య తీసుకున్నాము . ఎ ఎస్ డబ్ల్యు వో సరిగా తనిఖీ చేయకపోతే వారిమీద యాక్షన్ తీసుకున్నాము . గౌరవసభ్యులు శైలజానాధ్‌గారికి తెలుసు . అనంతపూర్ వెళ్లినపుడు ఇద్దరు ముగ్గురు వార్డెన్లను, ఒక ఎ ఎస్ డబ్లు వోను సస్పెండ్ చేశాము . మిగతావారికి కూడా గట్టి ఆదేశాలు ఇచ్చాము . ఏ జిల్లాకు వెళ్లినా మా నోటీసుకు వచ్చినపుడు వారిమీద చర్యలు తీసుకుంటున్నాము . 137 మంది హాస్టల్ వార్డెన్లు హెడ్‌క్వార్టర్స్‌లో ఉండడంలేదని తెలిసినపుడు వారికి షో కాజ్ నోటీసు ఇచ్చాము . కొందరిని సస్పెండ్ చేశాము, కొందరికి ఇంక్రిమెంట్లు కట్ చేశాము . మిగతా కొంతమంది మీద చర్యలు తీసుకుంటున్నాము . హాస్టల్స్ బాగా నడవాలి, పిల్లలకు మంచి విద్య ఇవ్వాలనే ఆలోచనకు ప్రభుత్వ కట్టుబడి ఉంది . మన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సాంఘిక సంక్షేమ శాఖ 306 బిల్డింగులు మంజూరుచేసినపుడు అవి దాదాపు పూర్తి కావస్తున్నాయి . సుమారు 52 హాస్టలు బిల్డింగులు కట్టడానికి ఇవ్వడం జరిగింది . గత జూన్ ఎకడమిక్ సంవత్సరం నుండి ఈ రాష్ట్రంలో సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ 44 హైస్కూల్స్ , 46 హాస్టల్స్ ఎస్‌సి బాలికలకు తెరచి, గిరిజన సంక్షేమానికి 33 కాలేజ్ హాస్టల్స్ మంజూరు చేశాము . ఈ విధంగా ఇవన్నీ చెప్పాలంటే చాలా విషయాలు ఉన్నాయి .

శ్రీ కె . రాములు : అధ్యక్షా, ఈ హాస్టల్స్‌కు సంబంధించి వేసిన ప్రశ్నలో మంత్రిగారు చాలా ఎలాబరేటెడ్‌గా సమాధానం చెప్పినందుకు ధన్యవాదాలు . హాస్టల్స్‌కు సంబంధించి ఈ మధ్య న్యూస్ ఐటం వచ్చింది, 100 మంది కంటే ఎక్కువమంది స్టూడెంట్స్ చనిపోయారని వచ్చింది . మంత్రిగారు రియాక్ట్ అయ్యారు గానీ ఇంతవరకు ఎటువంటి చర్య తీసుకోలేదు ప్రిన్సిపల్ సెక్రటరీ, సోషల్ వెల్ఫేర్ అజయేంద్ర పాయల్ గారిని, మిస్టర్ దివాన్ గారితో మాట్లాడాను . అక్కడ నుండి కూడా సరిగా స్పందన రాలేదు . ఇంతమంది విద్యార్థులు చనిపోవడం మంచిది కాదు . ఈ హాస్టల్స్ మీద ఎక్కువగా వీకర్ సెక్షన్స్ డిపెండ్ అవుతున్నారు . ఈ విధమైన నెగ్లిజెన్స్ చూపించడం ఈ హాస్టల్ వార్డెన్స్ వారిని పేరెండ్స్ మాదిరిగా చూడవలసి ఉంది . ఇతర సంస్థలలో హైదరాబాద్ పబ్లిక్ స్కూల్, మిషన్ స్కూల్స్, కార్పొరేట్ స్కూల్స్‌లలో వార్డెన్లు హాస్టల్స్‌లో పేరెంట్స్‌లాగా, ఒక తల్లి, తండ్రిలాగా ఉండి పిల్లలను కాపాడుతున్నారు . మన హాస్టల్స్‌లో ఈ విధంగా జరగడంలేదు . ఆ విధంగా జరగడానికి ఏమన్నా చర్యలు తీసుకుంటారా ?

దివాకర రెడ్డిగారు, ముఖ్యమంత్రిగారూ, మీరు వచ్చిన తరువాత చాలా పెద్దఎత్తున తీసుకుని రాష్ట్రానికి చాలా సేవ చేశారు . పోయినసారి కంటే వెల్ఫేర్‌కు పెద్దపీట వేశారు . జలయజ్ఞం మాదిరిగా విద్యా యజ్ఞం కూడా రావాలి . లేకపోతే దీనికి న్యాయం జరగదు . ఎడ్యుకేషన్ మినిస్ట్రీ వీటిని తమరు స్వయంగా పర్యవేక్షించి మీ దగ్గర పెట్టుకుని ఈ సంవత్సరం, వచ్చే ఎకడమిక్ ఇయర్‌లో ఎక్కువ పర్సంటేజ్ పర్సంటేజ్ విద్యార్థులకు ఇవ్వాలనీ, జయయజ్ఞం మాదిరిగా విద్యాయజ్ఞం చేయాలని

మనివిచేస్తున్నాను . కారణం మనం ఎడ్యుకేషన్‌లో వెనుకకు వెళ్లాము . హాస్టల్స్ చూస్తే జలయజ్ఞం తరువాత సెకంట్ ప్రయారిటీ దీనికి ఇచ్చి, ఇంకా మీ నాయకత్వంలో ఎక్కువగా అభివృద్ధి చేయాలని మీద్వారా మనవిచేస్తున్నాను . రెండవది హాస్టల్స్ విషయంలో వాస్తవం కూడా మంత్రిగారు అక్కడకు వెళ్లినపుడు న్యూస్ ఐటంలో, టివిలో చూస్తుంటాను వారు తప్పకుండా ఒక పేరెంట్‌లాగా మాట్లాడుతారు . కాని వారిలో చలనం లేదు . పై అధికారులలో చలనం వస్తే క్రింది ఆఫీసర్స్‌లో కూడా వస్తుంది . 100 మంది చనిపోయిన దానిమీద ఏమి చర్య తీసుకున్నారు ? ఎవరిని రెస్పాన్సిబుల్ చేశారు ? సభ్య సమాజంలో 100 మంది చనిపోతే.... some sort of accountability should be there. Heads have to be rolled, but unfortunately not even a single head has been rolled. ఎడ్యుకేషన్ అభివృద్ధి చేయడానికి, అందులో హాస్టల్స్‌కు ప్రాధాన్యత ఇవ్వాలి . ఉదాహరణకు ఎడ్జర్న్‌మెంట్ మోషన్ తెస్తే చిన్నకారణాలు పట్టుకుని గొడవ అని చెబుతారు . అలాగే ఒక గ్రామంలో ఎస్ఎస్‌సికి సెంటరు పెట్టమని అడిగితే ఆయన సుబ్బారావుగారు పెట్టను అంటారు . ఆ విధంగా చెబితే నడవదు . పేద పిల్లలు మారుమూల గ్రామాలలో ఉంటారు . అందువలన ఎడ్యుకేషన్ మినిస్టరుగారిని పిలిచి, ఆయనను కూడా పిలిచి నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నాను . వార్డెన్ విషయంలో హ్యూమన్ టచ్ ఉండే విధంగా వారికి శిక్షణ ఇప్పించి వారు పేరెంట్స్ మాదిరిగా ఉండే విధంగా హాస్టల్స్, రాష్ట్రాన్ని, పూర్తి అభివృద్ధి లోకి తేవాలని మనవిచేస్తున్నాను . అధికారులలో డిసిప్లిన్ లేకపోతే, కంట్రోల్ కాకపోతే మంత్రులు నిస్సహాయులు కాకుండా తగువిధంగా ఏర్పాటుచేయాలని మంత్రిగారికి మీద్వారా మనవిచేస్తూ, ~~ఈ~~ అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను .

శ్రీ ఎల్ . రాజారావు (పాడేరు) : అధ్యక్షా, గిరిజన సంక్షేమ శాఖలో ఆశ్రమ పాఠశాలలో వార్డెన్ పోస్టులు లేవు . డెప్యూటీ వార్డెన్ల ద్వారా హాస్టల్స్ నిర్వహించబడుతున్నాయి . దాని మూలంగా విద్యాబోధన సక్రమంగా జరగడంలేదు . డెప్యూటీ వార్డెను పోస్టులకు ఉపాధ్యాయులలో పోటీ ఏర్పడి అందులో రాజకీయాలు చోటుచేసుకుంటున్నాయి . దానివలన విద్యావంతులైన ఉపాధ్యాయులు డెప్యూటీ వార్డెను పోస్టులకు వారిలో వారు పోటీపడి విద్యార్థులలో విభేధాలు సృష్టిస్తున్నారు . ఈ క్రమంలో ఆశ్రమ పాఠశాలలు టీచింగ్ సెంటర్లుగా కాక, చీటింగ్ సెంటర్లుగా మారుతున్నాయి . అంటే ఒక డెప్యూటీ వార్డెన్ వచ్చినపుడు, దానిని ఆశించిన వారు నిరాశకు లోనై విద్యార్థులను రెచ్చగొట్టి, వారిద్వారా కంప్లయింట్ చేయించడం, గ్రూపులు కట్టించడం వంటి పక్కదారి పట్టించే పరిస్థితులు ఎదురవుతున్నాయి . అందువలన వారి భవిష్యత్తు నాశనం అవుతున్నది . వారు విద్యకు, పనికి దూరం దూరం కాబడి, తుదకు సంఘ వ్యతిరేక శక్తులుగా తయారవుతున్నారు . ఇటువంటి పరిస్థితులు చక్కదిద్దడానికి డెప్యూటీ వార్డెను స్థానంలో వార్డెన్లను నియమిస్తామని మంత్రిగారు పత్రికాముఖంగా తెలియజేశారు . వచ్చే విద్యా సంవత్సరంలో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో డెప్యూటీ వారెన్ల స్థానంలో వార్డెన్లను ప్రభుత్వం నియమించాలని మంత్రిగారిని అడుగుతున్నాను .

ఉ.9.20

డా. జి.కుతూహలమ్మ (వేపంజరి) : అధ్యక్షా, ఎస్.సి., ఎస్.టి., బి.సి. హాస్టళ్లలో ఎన్ని బ్యాక్‌లాగ్ వేకెన్సీలు వున్నాయి, వాటిని ఎప్పటిలోగా భర్తీ చేస్తారు ? అదే విధంగా అనేక కారణాలతో సస్పెండ్ అయిన వార్డెన్లపై ఎటువంటి చర్యా సంవత్సరాల తరబడి తీసుకోకుండా, వారిని పునర్నియామకం చేయకుండా అట్లాగే వుంచడం

వల్ల ఆ ఖాళీలు అట్లానే వుండిపోతున్నాయి. చిత్తూరు జిల్లాలో ఇంత వరకూ 18 మంది అటువంటి వారు వున్నారు. ఆ పోస్టులలో అన్ఎంప్లాయ్డ్ యూత్‌ను కాంట్రాక్ట్ పద్ధతి మీద తీసుకుంటారా ?

శ్రీ ఎస్. ఉదయభాను (జగ్గయ్యపేట) : అధ్యక్షా, సాంఘిక సంక్షేమ హాస్టల్స్‌లో వార్డెన్లు పిల్లలకు సంక్షేమాధికారులు. మరి అన్ని హాస్టల్స్‌లో అందరు వార్డెన్లు వుండాలి. రాష్ట్రం మొత్తం మీద ఇంత వరకూ ఎన్ని వార్డెన్ పోస్టులు ఖాళీగా వున్నాయి, వాటిని ఎప్పటిలోగా భర్తీ చేస్తారు ? రెండో విషయం, ఇప్పుడు హాస్టల్స్‌లో పిల్లలకు ఇస్తున్న మెస్ ఛార్జెస్ చాలా తక్కువగా వున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో వాటిని పెంచే ప్రతిపాదన ఏమైనా ప్రభుత్వం వద్ద వుందా ? అదే విధంగా రాష్ట్రంలో అనేక చోట్ల ప్రభుత్వ స్థలాలు ఖాళీగా వున్న వాటిని హాస్టళ్లు కట్టడానికి కేటాయించారు కాని ఆ విధంగా కేటాయించిన స్థలంలో హాస్టల్ భవనాలను నిర్మించడం లేదు. మరి ఎస్.సి., ఎస్.టి., బి.సి. హాస్టళ్లను ఎప్పటిలోగా వాటికి కేటాయించబడిన స్థలాలలో కడతారు ? అదే విధంగా బాలికల గురుకుల పాఠశాలలు ఇంటర్మీడియట్ వరకూ వుంటున్నాయి. అక్కడ ప్రిన్సిపాల్స్‌గా లేడీ క్యాండిడేట్స్‌నే వేయాలి. లేనట్లయితే చాలా సమస్యలు ఎదురవుతున్నాయి కాబట్టి అటువంటి బాలికల గురుకుల పాఠశాలలో మహిళా ప్రిన్సిపాల్స్‌నే నియమించాలని కోరుతున్నాను.

శ్రీ టి.జీవన్ రెడ్డి (జగిత్యాల) : అధ్యక్షా, గ్రామీణ ప్రాంతాలలో వుండే దళిత, బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులు చదువుకోవాలంటే, హాస్టల్ వసతి సౌకర్యం చాలా తప్పనిసరి. తెలంగాణా ప్రాంతంలో కొన్ని మండల కేంద్రాలలో కాని లేక ఆ మండల పరిధిలో కాని ఎస్.సి., ఎస్.టి., బి.సి. హాస్టళ్లు అసలు లేక, విద్యార్థులు విద్యకు దూరమైపోతున్నారు. కాబట్టి మంత్రిగారిని మండల పరిధిలో మీరు ఎస్.సి./ఎస్.టి./బి.సి. హాస్టళ్లను ఏర్పాటు చేసేందుకు తగిన చర్యలు తీసుకోవలసిందిగా కోరుతున్నాను. అందుకు ఉదాహరణగా కరీంనగర్ జిల్లా గొల్లపల్లి మండలం మొత్తం మీద ఒక్క హాస్టల్ కూడా లేదు. ఆ పర్యవసానంగా జగిత్యాల డివిజన్‌లో హెడ్‌క్వార్టర్స్‌కు వచ్చి విద్యార్థులు చదువుకునే పరిస్థితి వస్తోంది కాబట్టి మండల కేంద్రాలలోనైనా హాస్టళ్లను ఏర్పాటు చేయాల్సిందిగా తమ ద్వారా మంత్రి గారిని కోరుతున్నాను.

డా. కె.నాగేష్ : అధ్యక్షా, ఉదయభాను గారు వేసిన ప్రశ్నలన్నిటితోనూ నేను ఏకీభవిస్తూ, వాటికి అదనంగా మరొక 2 ప్రశ్నలు అడగదలచుకున్నాను. ఎందుకంటే వార్డెన్లు లేకపోవడం వల్ల, ఆ పోస్టులలోకి డెప్యుటేషన్ మీద వచ్చే ఉద్యోగులు తమకు అనుకూలంగా వుండే ఒక వ్యక్తిని హాస్టల్‌లో పెట్టి వాళ్లు రాత్రికి ఇంటికి వెళ్లిపోతున్నారు. అలా ఇన్‌ఛార్జ్‌గా వున్న వారు మెటీరియల్ తీసుకునేటపుడు బస్తాకు 2, 3 కిలోలు తక్కువ వస్తున్నాయి. అదే విధంగా కూరగాయలు, నూనె వంటివి తక్కువగా వస్తున్నాయి. వార్డెన్లు వారి మీద వేసి పోతున్న పరిస్థితి వుంది. ఎవరూ ప్రశ్నించే పరిస్థితి లేదు. వారు టీచింగ్ కూడా చేయడం లేదు.

ఇప్పుడు కేంద్ర ప్రభుతం కూడా సంక్షేమ హాస్టల్స్‌ను పెంచడానికి ప్రతిపాదన ఇచ్చారు. దాదాపు 1000 వరకూ ఇస్తున్నారు. కాబట్టి ఇప్పుడు వున్న సోషల్ వెల్ఫేర్ హాస్టల్స్‌ను మినీ రెసిడెన్షియల్ హాస్టల్స్‌గా మారిస్తే ఖచ్చితంగా మంచి రిజల్ట్స్ వుంటాయి. ఇటీవలి కాలంలో రెసిడెన్షియల్ హాస్టల్స్‌లో మంచి రిజల్ట్స్ వస్తున్నాయి కాబట్టి వాటిని రెసిడెన్షియల్ హాస్టల్స్‌గా మార్చాల్సిందిగా మీ ద్వారా మంత్రి గారిని కోరుతున్నాను.

శ్రీమతి ఎస్.స్వర్ణ సుధాకర్ (అమరచింత) : అధ్యక్షా, ప్రభుత్వపరంగా గవర్నమెంట్ హాస్టల్స్‌లో సౌకర్యాలను కల్పించాలని చూస్తున్నా కూడా వార్డెన్లు సక్రమంగా పని చేయడం లేదు. ఉదాహరణకు

చిన్నచింతకుంట మండలంలో ఒక బి.సి. హాస్టల్ వుంది. అందులో వుంటున్న పిల్లలు ఏమి చెబుతున్నారంటే, తమ హాస్టల్ వార్డెన్ సక్రమంగా రావడం లేదు, పెట్టెలు, దుప్పట్లు వంటి సామగ్రిని సక్రమంగా ఇవ్వడం లేదని, వాటిని సక్రమంగా ఇప్పించేలా చూడాలని వారు అధికారులను కోరుతున్నారు. మరి మంత్రిగారు ఈ విషయాన్ని నోట్ చేసుకుని, అక్కడ చదువుకుంటున్న పిల్లలకు సక్రమంగా సామగ్రిని ఇప్పించేలా చూడాలని కోరుతున్నాను.

శ్రీ డి.ఎస్.రెడ్యా నాయక్ ః అధ్యక్షా, గౌరవ సభ్యులు చాలా విషయాలు చెప్పారు. రాములు గారు ఎస్.సి., ఎస్.టి., బి.సి. హాస్టళ్లలో సుమారు 100 మంది చనిపోయారని అన్నారు. వారు ఎందుకు చనిపోయారు, అట్లా చనిపోయినందుకు సంబంధిత వార్డెన్లపై ఎటువంటి చర్య తీసుకున్నారని అన్నారు. సర్, వారు చెప్పింది వాస్తవం. నా దగ్గర వున్న సమాచారం ప్రకారం, హాస్టల్స్, ఆశ్రమ స్కూళ్లు, రెసిడెన్షియల్ స్కూళ్లు, మొత్తం అన్నీ కలిపి చెబుతాను.

జిల్లాల వారీగా చూస్తే శ్రీకాకుళం జిల్లాలో ట్రైబల్ వెల్ఫేర్‌కు సంబంధించి 10 మంది, విజయనగరం జిల్లాలో 12, విశాఖపట్నం జిల్లాలో 26 మంది, తూర్పుగోదావరిలో 7, ఖమ్మం జిల్లాలో 9, వరంగల్‌లో 6, ఆదిలాబాదులో 7, కర్నూలు 1, నల్గొండ 5, నిజామాబాదులో 1, శ్రీశైలంలో 3, గుంటూరులో ఇద్దరు చనిపోయారు. ట్రైబల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్‌లో వుండే హాస్టల్స్‌లో మొత్తం 89 మంది చనిపోయారు. ఇందులో దాచుకునే అవసరం ప్రభుత్వానికేమీ లేదు.

గురుకులాలలో మొత్తం 22 మంది చనిపోయారు. విజయనగరంలో 2, విశాఖపట్నంలో 4, ఈస్ట్ గొడావరిలో 3, వెస్ట్ గొడావరిలో ఒక్కరు, ఖమ్మంలో 3, వరంగల్లులో 4, మహబూబ్ నగర్‌లో 3, శ్రీశైలంలో 2 చనిపోయారు.

మరి సంబంధిత వార్డెన్లపై ఎటువంటి చర్య తీసుకున్నారని అన్నారు. శ్రీశైలంలో 10 మంది చనిపోతే ఐదుగురు పిల్లలు వారి ఇండ్లలో చనిపోయారు. అయినప్పటికీ దాని మీద ఎంక్వైరీ వేసి తగు చర్య తీసుకుంటాము. కాని పిల్లలు ఇండ్లలో చనిపోతే వార్డెన్స్ మీద కాని, సంబంధిత అధికారుల మీద కాని సివియర్ యాక్షన్ తీసుకోలేము. ఇద్దరు యాక్సిడెంట్లలో చనిపోయారు. ఎక్కడైనా వార్డెన్ల తప్పు వుంటే, వారిని సస్పెండ్ చేసాము, అవసరాన్నిబట్టి వారికి ఇంక్రిమెంట్ కట్ చేసాము. మరొకసారి అటువంటి ప్రమాదం జరగకుండా తగు చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

అదే విధంగా జ్వరం వచ్చి బాధ పడుతున్న విద్యార్థుల విషయంలో వారిని వెంటనే రిఫరల్ ఆసుపత్రులకు తీసుకువెళ్లమంటున్నాము. వారిని ఆసుపత్రికి తీసుకువెళ్లడానికి కావలసిన కన్వేయన్స్ మనమే ఇస్తున్నాము, మందులు కూడా గిరిజన సంక్షేమ శాఖ నుంచి ఇప్పిస్తున్నాము. అయినా కూడా ఏజన్సీ ఏరియాలలో మరణాలు సంభవిస్తున్నాయి. సంబంధిత డి.టి.డబ్ల్యు.ఒ.లను, పి.ఒ.లను పిలిపించి, బాగా రెవ్యూ చేసి, ఇక ముందు ఇటువంటివి జరగడానికి వీలు లేదని, ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుంది కాబట్టి మరణాలు సంభవించకుండా తగు చర్యలు తీసుకోవాలని, ఎవరైనా ఒక బాధ్యతాయుతమైన ఆఫీసర్ మీద రెస్పాన్సిబిలిటీ ఫిక్స్ చేయాలని చెప్పడం జరిగింది. ఒక జబ్బు వస్తే, వెంటనే ఆసుపత్రికి పంపించినట్లయితే ఎటువంటి ప్రమాదం జరగడానికి అవకాశం వుండదు.

సాధారణంగా జ్వరం రాగానే తల్లితండ్రులు వచ్చి వారి ఇంటికి తీసుకెళ్లిపోతారు. అక్కడ జ్వరం ముదిరిపోయి ఏమైనా జరగడానికి అవకాశం వుంటుంది కనుక హాస్టల్‌లో వుండగా జబ్బు వచ్చినట్లయితే వెంటనే రిఫరల్ ఆసుపత్రికి పంపించమని, అవసరమైతే నిమ్స్‌కు పంపించమని ఖచ్చితమైన ఆదేశాలను ఇవ్వడం జరిగింది. సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్‌కు సంబంధించి ఇప్పటి వరకూ మొత్తం 39 మంది హాస్టల్స్‌లో చనిపోయారు, బి.సి. వెల్ఫేర్‌లో ఇద్దరు చనిపోయారు. మొత్తం గిరిజన సంక్షేమ శాఖలో హాస్టల్స్, గురుగులాలలో కలిపి 111 మంది, సోషల్ వెల్ఫేర్‌లో 39 మంది, వెనుకబడిన తరగతుల హాస్టలో 41 మంది, మొత్తం 152 మంది చనిపోవడం జరిగింది.

ఎస్.సి., ఎస్.టి., బి.సి. హాస్టళ్లలో ఇకపై మరణాలు సంభవించకుండా ఖచ్చితమైన ఆదేశాలను అధికారులకు ఇవ్వడం జరిగింది, ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూస్తామని గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను.
ఉ.9.30

ఇదే కాకుండా, రాజారావుగారు వార్డన్ పోస్టుల ఖాళీల గురించి అడిగారు. డెప్యూటీ వార్డన్ పోస్టులో టీచర్‌ను వేస్తున్నారు. టీచింగ్ కాకుండా చీటింగ్ అవుతోంది. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత చాలా ఖాళీలు ఉన్నాయి. వార్డన్స్, డెప్యూటీ వార్డెన్ పోస్టులుంటే, ఈ ఖాళీలు భర్తీ చేయకపోతే, టీచర్స్‌ని ఎక్కడి నుండో తీసుకువస్తే వారికి ఇంట్రస్ట్ ఉండడం లేదు. ఒక వార్డన్‌కి రెండు హాస్టల్స్ ఇస్తే వారు చూడరు. ఆ ఉద్దేశ్యంతోనే గౌరవ ముఖ్యమంత్రిగారి దృష్టికి ఈ విషయాన్ని తీసుకువెళ్లడం జరిగింది. 194 వార్డన్ పోస్టులు నింపుకోవడానికి అవకాశం చిక్కింది. ఆదేశాలు ఇచ్చారు. 194 మందిని వివిధ జిల్లా కలెక్టర్లను నింపవలసిందిగా ఆదేశాలు ఇచ్చాము. అన్నీ నింపారు. ట్రైబల్ వెల్ఫేర్‌లో నింపుతున్నాము. ఎక్కడైనా ఖాళీలుంటే అక్కడ కోర్కె మేరకు అక్కడి శాసనసభ్యులు లేదా పేరెంట్స్ కమిటి వారి కోర్కె మేరకు ఖాళీ ఉంటే ప్రక్క వార్డన్ సరిగ్గా చూడకపోవచ్చు, కాబట్టి శ్రద్ధ ఉన్న టీచర్స్‌ని, బాగా పని చేయగలిగేవారుంటే, అది కూడా జిల్లా కలెక్టర్ నింపుతున్నారు. మంచిగా పని చేసేవారుంటే టీచర్స్‌ని లేని చోట్ల పెట్టమని అంటున్నాము. జిల్లా కలెక్టర్ ఆదేశాలు ఇస్తున్నారు. శాసనసభ్యులు లోకల్‌గా ఉన్నవారు ఇచ్చిన సలహా మేరకు ఆ విధంగా జరుగుతోంది. మిగతావి ఉంటే అవి కూడా నింపడానికి ప్రయత్నం చేస్తాము. ఉదయభానుగారు వార్డన్ పోస్టుల గురించి అడిగారు. ఇంతకుముందు చెప్పాను. 194 పోస్టులు నింపాము. దాదాపు 50, 60 ఉన్నాయి. జీవన్‌రెడ్డిగారు అడిగారు. ఒకటి, అర తప్ప ప్రతీ మండల హెడ్‌క్వార్టర్స్‌లోనూ ఉంది. గొల్లపల్లి గురించి అన్నారు. జిల్లాలో పిల్లల సంఖ్య తక్కువ ఉన్న హాస్టల్స్‌ని మనం మార్చుకోవలసిన అవకాశం ఉంది. దానికి ప్రయత్నం చేస్తాము. వారి నియోజకవర్గంలో కాలేజ్ హాస్టల్‌ని ఇవ్వడం జరిగింది. శ్రీధర్ బాబుగారి నియోజకవర్గంలో కూడా ఇచ్చాము. ఈ విధంగా వారి జిల్లాలో నాలుగు హాస్టల్స్ ఇచ్చాము. ఈ సంవత్సరం అవకాశం వస్తే ఇస్తాము. కుతూహలమ్మగారు బ్యాక్‌లాగ్ గురించి అడిగారు. వారు వేరే ఫార్మ్‌లో వస్తే జవాబు చెబుతాను. వార్డన్ పోస్టులు చాలా కాలం నుండి సస్పెండ్ చేసినవాటి గురించి కొందరు రీఇన్‌స్టేట్ చేయాలన్నారు. తప్పు చేస్తే సస్పెండ్ చేయకపోతే ఎందుకు చేయలేదని అంటారు. ఎక్కువ రోజులు అలా చేయడం లేదు. ఎక్కడైనా కేసు ఉంటే సస్పెండ్ చేయడం జరుగుతోంది. ఎందుకంటే, మంచి మెసేజ్ పోవాలనేది మా ఉద్దేశ్యం. దాదాపు ఒకటి, రెండు నెలల తరువాత మళ్లీ పెండింగ్ ఎంక్వయిరీ ద్వారా చేస్తున్నాము. చిత్తూరు జిల్లాలో వెళ్లి చూసాను. అక్కడ అవకతవకలు ఉన్నాయి. క్రమశిక్షణచర్యలు

తీసుకోవాలి, మిగతా వారు వారిని చూసి తప్పులు చేయకుండా ఉండాలి. సంబంధించిన అధికారులను కూడా సస్పెండ్ చేయడం జరుగుతోంది. అక్కడ ఏ.టి.డబ్బు.ఓని సస్పెండ్ చేసాము. గౌరవ ముఖ్యమంత్రిగారి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే చాలా నిర్ణయాలు తీసుకోవడం జరిగింది. సాంఘిక సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖ, వెనకబడిన తరగతుల సంక్షేమ శాఖల్లో వివిధ చర్యలు తీసుకోవడం జరిగింది. ఈనాడు రాష్ట్రంలో ఉన్న హాస్టల్స్‌లో ముఖ్యంగా ప్రతీ మండల హెడ్ క్వార్టర్స్ డివిజన్‌లో ఎస్.సి., ఎస్.టి., బి.సి హాస్టల్స్‌లో సరైన పర్యవేక్షణ లేదు. అందుకు కొన్ని కారణాలు ఉన్నాయి. వాటన్నింటిని దూరం చేయాలి. ఆ ఉద్దేశ్యంతో గౌరవ ముఖ్యమంత్రిగారు వచ్చే అకడమిక్ సంవత్సరం నుండి ఈ రాష్ట్రంలో 120 ఇంటిగ్రేటెడ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయాలని, అందులో ఎస్.సి., ఎస్.టి., బి.సి పిల్లలను అందరిని చేర్చి సమగ్రమైన ఆలోచనలు రావడం కోసం నిర్ణయాలు తీసుకోవడం జరిగింది. ఒక్కో హాస్టల్‌లో ఇంటిగ్రేటెడ్ కాంప్లెక్స్‌లో 400 మంది విద్యార్థులతో కావలసిన టీచర్స్, వార్డన్లతో ఫెసిలిటీస్ అన్నీ ఇచ్చి మిని గురుకులాల మాదిరిగా ఈసంవత్సరమే నిర్ణయం తీసుకోవడం జరిగింది. ఇదే కాకుండా పిల్లలకు మంచి భోజనం, పౌష్టికాహారం ఇవ్వాలనే ఉద్దేశంతో ఈ సంవత్సరం 25 శాతం, వచ్చే అకడమిక్ ఇయర్‌లో జూన్ నుండి హాస్టల్స్, స్కూల్స్‌తోబాటు 25 శాతం మెస్ ఛార్జీలు పెంచడం జరిగింది. దానికి కావలసిన బడ్జెట్ కూడా పెంచడం జరిగింది. తద్వారా 8 లక్షల మంది పిల్లలకుప్రయోజనం చేకూరుతుంది. అప్పుడు పిల్లలకి మంచి భోజనం ఇవ్వడానికి అవకాశం ఉంటుంది. మంచి మెనూ కూడా ఇవ్వడానికి అవకాశం ఉంటుంది. ఆ విధంగా ఎన్ని కార్యక్రమాలు వస్తే అన్ని కార్యక్రమాలు తీసుకోవడం జరిగింది.

శ్రీ జి. కిషన్‌రెడ్డిః ఈనాడు అనారోగ్యంతో సుమారు 152 మంది విద్యార్థులు వివిధ ఆసుపత్రులలో చనిపోయారు. 152 మంది చనిపోవడం ప్రభుత్వానికి తక్కువ అనిపిస్తుందా? ఎంత క్యాజువల్‌గా మంత్రిగారు చెప్పారంటే 152 మంది అనారోగ్య ంతో చనిపోతే ఏమి చర్య తీసుకున్నారు. ఒక ట్రైబల్ సీరియస్ అయిన తరువాత ఆ విద్యార్థిని ఇంటికి పంపుతున్నారు. రిస్క్ ఎవరు తీసుకోవాలని, హాస్టల్‌లో ఎవరు ట్రీట్‌మెంట్ ఇస్తారని సదరు వార్డన్ ఇంటికి పంపుతున్నారు. ఆ విద్యార్థి అనారోగ్యంతో చనిపోయే ముందు కోమాలో ఉన్నప్పుడో వారిని ఇళ్లకు పంపించిన సంఘటనలు చాలా ఉన్నాయి. దీని మీద ప్రభుత్వం ఏమి చర్య తీసుకుంటోంది? బి.సి. స్కాలర్‌షిప్ విషయంలో పరిశీలించాలి. హాస్టల్ విషయంలో 2004-05,2005-06లో బిసి స్కాలర్‌షిప్ బకాయిలు ఉన్నాయో, వాటికి సంబంధించిన ధరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయో వాటికి డబ్బు ఇస్తారా, లేదా? కేంద్ర ప్రభుత్వం ఈబడ్జెట్‌లో రు.470 కోట్లు ఇవ్వవలసి ఉంది. దానికి కారణంగా 1,70,000 మంది ఎస్.సి, ఎస్.టి, విద్యారులకు సంబంధించి స్కాలర్‌షిప్స్ ఇవ్వలేదు. ఎప్పటి లోపల వీరి స్కాలర్‌షిప్స్ ఇస్తారో కేంద్ర ప్రభుత్వం నుండి నిధులు తీసుకువస్తున్నారా? వచ్చాయా, లేదా?

శ్రీ కె.పి. కొండా రెడ్డి (మార్కాపురం): ప్రకాశం జిల్లాలో ఎస్.సి బాలికల హాస్టల్స్ చాలా తక్కువగా ఉన్నాయి. ప్రభుత్వం ఆలోచన చేసి ఎస్.సి బాలికల హాస్టల్‌ని విద్యార్థుల సంఖ్యని బట్టి పెంచవలసిందిగా కోరుతున్నాను.

శ్రీ ఎల్. రాజారావుః మన ఆశ్రమ పాఠశాలల సిస్ట ం మార్చవలసిందిగా కోరాము. వార్డన్ పోస్టులు లేవు. టీచర్‌ని, డెప్యూటీ వార్డెన్‌గా అపాయింట్ చేస్తున్నారు. మరో టీచర్ వార్డన్ పోస్టు కావాలన్నప్పుడు విద్యార్థులను గ్రూపులుగా విభజించడం, కొంత మంది వారిని ఉసికొల్పి ఫిర్యాదు చేయడం వంటి రాజకీయ వాతావరణం వల్ల అక్కడంతా కలుషితమవుతోంది. డెప్యూటీ వార్డన్ స్థానంలో వార్డన్‌ని నియమించాలి.

కాబట్టి వార్డన్ పోస్టులు మంజూరు చేయాలి. విద్యార్థులు అనారోగ్యంతో చనిపోతున్నారు. టీచర్‌నో, డెప్యూటీ వార్డన్‌నో సస్పెండ్ చేసి బాగా చర్యలు తీసుకుంటున్నామని అనడం కాదు. అలా అయితే సమస్యకి పరిష్కారం దొరకదు. వైద్య సదుపాయాలు వారికి అందుబాటులో ఉందా, లేదా? వారంతా ఎందుకు చనిపోతున్నారుఅనేది పూర్తిగా అధ్యయన ం చేయవలసిన అవసరం ఉంది.ఇవన్నీ అధ్యయనం చేయకుండా, తెలుసుకోకుండా డి.టి.డబ్లు.ఓని., వార్డన్‌ని సస్పెండ్ చేస్తే విద్యార్థులకు వైద్య సదుపాయాలు అందుబాటులో ఉంటాయా?
ఉ.9.40

శ్రీ ఎన్. వరదరాజులు రెడ్డి (ప్రొద్దుటూరు)ః సస్పెండ్‌లో ఉన్న వారిని రివోక్ చేయాలని కొంత మంది సభ్యులు అడిగారు. మంత్రిగారు త్వరగా చెప్తామంటున్నారు. తప్పులు చేసిన వారి మీద సివియర్ పనిష్మెంట్‌అనేది ఉండాలి. అవసరమయితే డిస్మిస్ చేయాలి. తప్పులు చేసిన వారిని కొంత కాలం తరువాత రీఇన్‌స్టేట్ చేసుకోవడం వల్ల అదే ఆనవాయితీగా అవుతుంది. వారిని సెస్పెండ్ చేయాలి. ఉద్యోగాలు లేని నిరుద్యోగులు రాష్ట్రంలో చాలా మంది ఉన్నారు. వారికి అవకాశం కల్పించాలి. ఈ విధంగా సస్పెండ్ చేయకుండా రీఇన్‌స్టేట్ చేస్తే ఎవరయినా తప్పులు చేస్తూనే ఉంటారు. వారికొక గుణపాఠం ఉండాలి.

డా.ఎస్. శైలజానాథ్ ః గతంలో కన్నా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో వచ్చిన తరువాత ఈ సంక్షేమ రంగాల్లో ఎక్కువ బడ్జెట్ విషయం రాష్ట్రం అంతా గమనిస్తోంది. ఈ వార్డన్ అక్కడ ఉంటే పిల్లల చదువులు బాగు పడతాయంటే కాదు, నా నియోజక వర్గం సింగనమల ఎస్.సి నియోజకవర్గం. బాలికల విద్యాశాతం తక్కువే. కస్తూరిబా స్కూల్ శాంక్షన్ అయింది. ఆత్మకూరు మండలంలో ప్రత్యేకించి గిరిజన తండాలు ఎక్కువగా ఉన్నాయి. పిల్లలు చదవలేక మధ్యలో మానివేస్తున్నారు. తమ ద్వారా మంత్రిగారిని కోరేదేమంటే, ఆత్మకూరు మండలంలో బాలికలకు హాస్టల్‌ని శాంక్షన్ చేయాలని కోరుతున్నాను.

శ్రీ కొమిరెడ్డి రాములుః డా.రాజశేఖరరెడ్డిగారి ప్రభుత్వం వచ్చిన తరువాత రెడ్యానాయక్‌గారు ఏమి అనౌన్స్ చేశారంటే, అర్హులైన విద్యార్థులకు హాస్టల్‌లో సదుపాయం కల్పిస్తామన్నారు. ప్రత్యేకంగా బాలబాలికల పాఠశాలల్లో కరీంనగర్ జిల్లాలో హాస్టల్స్ తక్కువ ఇవ్వడం జరిగింది. ఈ అకడమిక్ ఇయర్‌లో అయినా ఎస్.సి, ఎస్.టి, బి.సి., మైనారిటి హాస్టల్స్‌లో అడ్మిషన్స్ కల్పించాలని కోరుతున్నాను.

శ్రీ డి.ఎస్. రెడ్యానాయక్ః గౌరవ సభ్యులు చాలా మంది చాలా విషయాలు చెప్పారు. తప్పకుండా వాటన్నింటిని దృష్టిలో పెట్టుకొని సక్రమంగా అన్నీ చేసే విధంగా చర్యలు తీసుకుంటాము. అన్నింటిని పరిశీలించి తగు చ ర్యలు గైకొంటాము. రాష్ట్రంలో ట్రైబల్ వెల్ఫేర్, సోషల్ వెల్ఫేర్, బిసి వెల్ఫేర్ హాస్టల్స్, గురుకుల హాస్టల్స్ షుమారు 5,200 వివిధ జిల్లాల్లో ఉన్నాయి. విద్యార్థులు చనిపోతున్నారంటే ఎన్నో కారణాలు ఉన్నాయి. ఉదాహరణకు పాడేరు ఏజెన్సీ ఏరియా ఉంది. గత ప్రభుత్వం డాక్టర్ పోస్టులు, ఫార్మసిస్టులు, ల్యాబ్ అసిస్టెంట్స్, ఏఎన్ఎమ్స్, స్టాఫ్ నర్సుల పోస్టులు భర్తీ చేయలేదు. అన్ని ఖాళీలు ఉండడంవల్ల వైద్యం లేకుండా, ప్యారా మెడికల్ స్టాఫ్ లేకుండా వైద్యం దొరకక చనిపోతున్న మాట వాస్తవం కాబట్టి, ప్రతిసారి చనిపోతున్నారనే మాటకు ఆస్కారం లేకుండా నేనే వివరంగా ఇచ్చాను. అందుకోసం ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలో ఏజెన్సీ ఏరియాలో ప్రత్యేకంగా 82 ప్రాధమిక ఆరోగ్య కేంద్రాలను కొత్తగా మంజూరు చేసి తెరవడం జరిగింది. 90 డాక్టర్ పోస్టులు ఖళీగా ఉంటే నింపుతున్నాము. 90 మందిలో 50 మంది జాయిన్ అయ్యారు. మిగతా వారిని కూడా భర్తీ చేసి వైద్య సేవలు అందించాలి. భవిష్యత్తులో ఇటువంటి ప్రమాదాలు జరగకుండా ఉండాలనే ఆలోచనతో పని చేస్తున్నాము. వార్డన్ తప్పు ఉంటే సస్పెండ్

చేస్తున్నాము. అది రుజువైతే అతని ఇంక్రిమెంట్ కట్ చేస్తున్నాము. రివర్ట్ చేస్తున్నాము. తప్పు లేకుంటే రీఇన్‌స్టేట్ చేస్తున్నాము. సదరు పిల్లవాడిని వారి తల్లిదండ్రులు తీసుకువెళ్లి తరువాత వారు చనిపోతే చర్య తీసుకోవడానికి అవకాశం లేదు. ఈ సంవత్సరం , గత సంవత్సర బడ్జెట్ పెట్టాము. ఎవరికైనా జబ్బు చేస్తే వెంటనే హాస్పటల్‌కి తీసుకువెళ్లి మందులకు ఖర్చయినా, పట్టణానికి తీసుకువెళ్లినా ప్రభుత్వం భరిస్తుందని చెప్పడం జరిగింది. అందుకు తగు చర్యలు తీసుకోవడం జరిగింది. వైద్య ఆరోగ్య శాఖామాత్యులందరం పర్సనల్‌గా పోయి చూసాము. అటువంటి కార్యక్రమాలు జరగకుండా చేస్తున్నాము. ఈ సంవత్సరం ఎండా కాలంలో పాడేరు ఏజెన్సీ ప్రాంతంలో స్ప్రే వేయడం జరిగింది మరొకసారి వేస్తాము. అన్ని చర్యలు తీసుకుంటున్నాము. గతంలో 10 సంవత్సరాల నుండి పేరుకుపోయిన సమస్యలు ఒకటి రెండు సంవత్సరాలో పోవాలంటే అది సాధ్యం కాదు.

మిస్టర్ స్పీకర్ః క్వశ్చన్ నెంః133(5357) సభ్యుల అభ్యర్థన మేరకు పోస్ట్‌పోన్ చేయడం జరిగింది.

## వేములవాడలో పాలిటెక్నిక్ కళాశాల అధ్యాపకుని లైంగిక వేధింపులు

ప్రశ్న నెంః 134 (4510)

సర్వశ్రీ / శ్రీమతి వి. సునీత లక్ష్మారెడ్డి (నర్సాపూర్), టి. జీవన్ రెడ్డి ,డి. శ్రీధర్ బాబు(మంథని) – గౌరవనీయులైన హోం శాఖా మంత్రిగారు దయచేసి ఈ క్రింది విషయములు తెలిపెదరాః

అ) కరీంనగర్ జిల్లా, వేములవాడ మండలం, అగ్రహారం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పనిచేస్తున్న ఎలక్ట్రానిక్స్ లెక్చరరు విద్యార్థినులను లైంగికంగా వేధిస్తున్న విషయం వాస్తవమేనా?

ఆ) అయితే, ఈ విషయంలో ప్రభుత్వం తీసుకున్న చర్య ఏమిటి?

**హోంశాఖ మంత్రిగారు ( శ్రీ కె. జానారెడ్డి )ః**

అ) అవునండి

ఆ) కరీంనగర్ జిల్లా, వేములవాడ మండలం, అగ్రహారం గ్రామం, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 3వ సంవత్సరం విద్యార్థిని అయిన కుమారి ఇందూరి సంధ్య ఇచ్చిన ఫిర్యాదును పురస్కరించుకొని ఐపిసి 354 విభాగం, 1997, ఆంధ్రప్రదేశ్ ర్యాగింగు నిషేధ చట్టంలోని 4 (1) (iii ) (iv) విభాగం క్రింద వేములవాడ పోలీసు స్టేషనులో నేరం నెం.1/2006గా ఒక కేసును రిజిష్టరు చేయడమయింది. నిందితుడు శ్రీ జె. శ్రీనివాసరావును అరెస్టు చేసి జుడీషియల్ కస్టడీకి రిమాండు చేయడమయింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సాంకేతిక విద్యాశాఖ డైరెక్టరు 2.1.2006 తేదీగల ప్రొసీడింగులు నెంః జి2/04/2006 ద్వారా నిందితుడిని సస్పెన్షనులో ఉంచారు.

శ్రీ మతి వి. సునీతా లక్ష్మారెడ్డిః అధ్యక్షా, గురుబ్రహ్మ, గురుర్విష్ణు, గురుర్‌దేవో మహేశ్వరః అన్నారు పెద్దలు. తల్లిదండ్రులుగా చూసుకోవలసిన గురువులే కొన్ని చోట్ల వారిని భక్షించే ప్రయత్నం చేస్తున్నారు. మానసికంగా, శారీరకంగా వేధింపులకు ఈవిద్యార్థులను గురిచేస్తున్నారు. మనం రోజు పేపర్లలో చూస్తున్నాము.

నిజంగా మన సభ్య సమాజం తలవంచుకునేటట్లుగా ప్రవర్తించడం బాధాకరంగా ఉంది. మొన్న కరీంనగర్ పాలిటెక్నిక్ కాలేజీలో , వరంగల్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో, చాలా హాస్టల్స్‌లో, స్కూల్స్‌లో విద్యార్థులు ఇటువంటి వేధింపులకు గురవుతున్నారు. ఆర్.డి.ఓల నుండి మహిళా యం.ఆర్.ఓలు, ఉన్నత స్థాయిలో ఉన్న అధికారుల నుండి క్రింది స్థాయిలో ఉన్న మహిళలు ఇటువంటి వేధింపులకు గురవుతున్నారు. ఇప్పుడే మంత్రిగారు సమాధానం చెబుతూ, కరీంనగర్ పాలిటెక్నిక్ కాలేజ్‌లో నిందితుడిని సెక్షన్ 354 క్రింద అరెస్ట్ చేయడం జరిగింది. సస్పెండ్ చేయడం జరిగిందన్నారు. ఆ నిందితుడికి సంబంధించి జడ్జ్ మాత్రం బెయిల్ కోసం జిల్లా కోర్ట్ పరిధిలో ఉంది కాబట్టి కోర్ట్‌లో ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు. దీని మీద కఠిన చర్యలు తీసుకుంటేతప్ప ఇటువంటివి పునరావృత్తం కావు. సస్పెండ్ చేయడం ఆనవాయితీగా జరుగుతోంది. మళ్లీ రెండు సంవత్సరాలకు వారిని రీ ఇన్‌స్టేట్ చేయడం జరుగుతోంది. ఇటువంటి తప్పుచేసిన వారిని ఈ విధంగా కప్పిపుచ్చే ప్రయత్నం జరుగుతోంది. వారిని సస్పెండ్ చేయడం కాకుండా డిస్‌మిస్ చేస్తే తగిన చర్య తీసుకున్నట్లు అవుతుంది. కోర్ట్‌లో వీరికి బెయిల్ రాకుండా గట్టి ప్రయత్నం చేస్తే, ఇటువంటివి పునరావృత్తం కావు. కాబట్టి ఇటువంటి చర్యలు తీసుకుంటున్నారా?మహిళలందరూ ఈ విధంగా వేధింపులకు గురైనవారు ఉన్నతాధికారులకు చెప్పినా, ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. కోర్ట్ కూడా ఆదేశాలు ఇచ్చారు. మహిళా శిశు సంక్షేమ సమితి, అసెంబ్లీ నుండి ప్రతీ జిల్లాకు వెళ్లినప్పుడు విజిలెన్స్ కమిటి కానీ, మానిటోరింగ్ సెల్‌ని ఏర్పాటు చేయాలని కోరినా, ఏ డిపార్ట్‌మెంట్ కూడా ఇటువంటి సెల్ ఏర్పాటు చేసినట్లుగా కనబడ లేదు. విజిలెన్స్ కమిటీలను ఏర్పాటు చేసే విధంగా ఎటువంటి ప్రయత్నాలు జరుగుతున్నాయి. మహిళలు ఇచ్చిన కేసులు కోర్ట్‌లలో పెండింగ్‌లో ఉన్నాయి. మహిళా కోర్ట్‌లను ఏర్పాటు చేసే విధంగా ఏమైనా చర్యలు తీసుకుంటున్నారా?

శ్రీ కె. జానారెడ్డిః ఈ కేసుకి సంబంధించి ఫిర్యాదు అందిన రెండు గంటల లోపు అరెస్ట్ చేసి వెంటనే జైలుకి పంపించడం జరిగింది. క్విక్ యాక్షన్ తీసుకోవడంతో సంబంధిత శాఖావారిని సస్పెండ్ చేయడం జరిగింది. పోలీస్ శాఖకి సంబంధించి చాలా కఠినంగా వ్యవహరించడం జరిగింది. బెయిలు రాకుండా ఉండడం కోసం అవసరమైన చర్యలు మా ప్రభుత్వం నుండి శాఖాపరంగా తీసుకొనవలసినవి తీసుకొన్నాకానీ, మెజిస్ట్రేట్ బెయిల్ ఇచ్చిన దానికి మనకు సంబంధం ఉండదనే విషయం గౌరవ సభ్యులు అర్థం చేసుకోవాలి. సదరు వ్యక్తులను డిస్‌మిస్ చేయడం అనేది విద్యాశాఖకి సంబంధించిన విషయం. సోదరి ఎలాబరేట్‌గా చెప్పిన విషయం హౌజ్‌కి సంబంధించిన విషయం. ఈ శాఖకి సంబంధించిన జవాబు ఏమిటంటే, సక్రమంగా వ్యవహరించడం, ఇక ముందు ఇటువంటి సమస్యలు ఎక్కడ ఎదురైనా, పోలీసు దృష్టికి వచ్చినా చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది. ప్రతీ జిల్లాలో కూడా ఎస్.పి దగ్గర ఈ మహిళలకు సంబంధించి అత్యాచారాలకు చెందినవి చూడడానికి ఒక సెల్‌ని ఏర్పాటు చేయడం జరిగింది. అవసరమైన కౌన్సిలింగ్ కూడా చేస్తున్న విషయం ఉంది. మహిళా కోర్ట్‌ల విషయంలో ఏ ప్రతిపాదన లేజు. దానిని పరిశీలిస్తాము.

శ్రీమతి వి. సునితా లక్ష్మారెడ్డిః మంత్రిగారు చెబుతూ, మహిళా కోర్ట్ గురించి అటువంటి ప్రతిపాదన లేదన్నారు. ఆలోచన చేయవలసిన అవసరం ఉంది. తప్పకుండా ప్రతి ఒక్క జిల్లాలో ఏర్పాటు చే యాలి. అక్కడున్న పెండింగ్ కేసులు త్వరలో డిస్‌పోజ్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలి. సమాజంలో మహిళలకు ఒక ఉన్నత స్థానం ఉంది. వారి హక్కులు కాపాడవలసిన అవసరం ప్రభుత్వం మీద ఉంది.

ఉ.9.50

శాసన సభలో గట్టి చట్టాలు తీసుకురావలసిన అవసరం లేదు. సింపుల్‌గా సస్పెండ్ చేయడమో లేకపోతే కోర్టుకు తీసుకొనిపోవడమో, తరువాత బెయిల్ తీసుకోవడం ఇవి అన్ని జరిగిపోతున్నాయి. కాబట్టి గట్టి చర్యలు తీసుకొనే విధంగా ఏదన్నా చట్టం తీసుకురావాలని మీ ద్వారా అడుగుతున్నాను.

శ్రీ కె.జానారెడ్డి: అధ్యక్షా, కోర్టులకు సంబంధించి న్యాయ శాఖ పరిశీలించాలి వారికి నివేదిస్తాను. తరువాత పోలీసు శాఖకు సంబంధించి కఠినమైన చర్యలు తీసుకోవడంలో ఏమి వెనుకాడేది లేదు. పటిష్టంగా తయారు చేయడానికి ఇటువంటివి జరిగినప్పుడు చేయాల్సినటువంటిది జరగకుండా నిరోధించడానికి అవసరమైన సూచనలు గౌరవ సభ్యుల దగ్గర వుంటే ప్రభుత్వానికి నివేదించండి. ఆ తరువాత మేము లోతుగా పరిశీలించి దీనికి పటిష్టంగా చట్టం తిరిగి చేయడానికి, ఏది చేయడానికి ప్రభుత్వం వెనుకాడదని చెప్పి తెలియచేస్తున్నాను.

## పెద్దంబర్ పేటలోని బధిరుల నమూనా పాఠశాల

ప్రశ్న నెం .135(4386 )

శ్రీమతి క్రిస్టెన్ లాజర్స్ (నామినేటెడ్)– గౌరవనీయులైన పాఠశాల విద్య, మహిళాభ్యుదయం, శిశు సంక్షేమ, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారాః

అ) రంగారెడ్డి జిల్లా, పెద్ద అంబర్‌పేటలోని చెవిటి విద్యార్థుల మోడల్ పాఠశాల పూర్తి సామర్ధ్యంతో నడుస్తున్నదా?

ఆ) లేనట్లయితే, తక్కువ మంది విద్యార్థులతో నడవడానికి గల కారణాలేమిటి?

ఇ) అవసరమైన విధంగా పాఠశాల తగిన పరిపాలన పరమైన, విద్యాపరమైన సదుపాయాలను కలిగి ఉన్నదా?

ఈ ) భారత పునరావాస మండలి, చెవిటి వారి పాఠశాల ఉపాధ్యాయులందరికీ సైన్స్ లాంగ్వేజి మీడియంను తప్పనిసరి చేసిందా? ఉపాధ్యాయులందరూ శిక్షణ పొందారా?

**విద్య, మహిళాభ్యుదయం, శిశు సంక్షేమ, వికలాంగుల సంక్షేమ శాఖ (శ్రీమతి ఎస్.రాజ్యలక్ష్మి):**

అ) అవునండీ

ఆ) ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు.

ఇ) అవునండీ ప్రిన్సిపాలు, మరో నలుగురు విద్యాపరమయిన బోధనా సిబ్బంది చెవిటి భాషలో బోదించడానికి అర్హతలను, అనుభవాన్నీ కూడా కలిగి వున్నారు. పాఠశాలకు అవసరమయిన శ్రవణ పరికరాలు, సామాగ్రి వున్నాయి పాఠశాలను సజావుగా నిర్వహించడానికి పరిపాలన విషయాలకు సంబంధించి అవసరమయిన సిబ్బంది కూడా పనిచేస్తున్నారు. విద్యార్థులందరూ శ్రవణ పరికరాలు కలిగి వున్నారు.

ఈ) అవునండీ

మిస్టర్ స్పీకర్: ఇది చాలా ఇంపార్టెంట్ క్వొశ్చన్. రాష్ట్ర వ్యాప్తంగా కూడా టీచర్సు అన్ని ప్రాంతాలలో ఉన్నారా?

శ్రీ జి.కిషన్‌రెడ్డి: అధ్యక్షా, హైద్రాబాదు సిటిలో నా నియోజకవర్గంలో బధిరులకు సంబంధించి ఆశ్రమ పాఠశాల వున్నది. దానికి సొంత భవనాలు లేకుండా రెంట్ బిల్డింగ్‌లో ఇబ్బందులకు గురౌతున్నది. కావలసిన సిబ్బంది కూడా లేరు. దానికి ప్రత్యేకమైన సిబ్బంది ఉండవలసిన అవసరం వుంటుంది. ఈ రోజు సిబ్బంది లేని పరిస్థితులు, రూమ్స్ సరైనటువంటివి లేని పరిస్థితులు, భోజనం కూడా అధ్వాన్నంగా ఉన్న పరిస్థితిగా ఉంది. బధిరుల ఆశ్రమ పాఠశాల అంబర్‌పేటలో ఉన్నది. ప్రభుత్వానికి సంబంధించి నేను సోషల్‌వెల్ఫేర్ డిపార్టుమెంటును అడిగినా, ఎడ్యుకేషన్ డిపార్టుమెంటును అడిగినా మా డిపార్టుమెంటు కాదు, మా డిపార్టుమెంటు కాదు అని అంటారు. దీనికి సంబంధించి అన్ని రకాల సమస్యలు ఉన్నాయి. భోజనం సరిగా లేకపోయిన, సబ్బులు, తలకు ఆయిల్, కడుపులో నొప్పి వున్నా చెప్పుకోలేని చాలా ఇబ్బందులు ఉంటాయి. మనం మానవతా దృక్పథంతో పని చేయవలసిన అవసరం వున్నది . అక్కడ నిధుల కొరత వున్నది పక్కా బిల్డింగ్స్ కోసం చాల రోజుల నుంచి ఈ ప్రభుత్వం రాగానే విజ్ఞప్తి చేస్తున్నాను. ప్రక్కకు ల్యాండ్ కూడా ఉన్నది వాళ్లకి సంబంధించిన రెంటెడ్ బిల్డింగ్స్ రూమ్స్ సరిగా వుండవు. మామూలు బిల్డింగ్ అందులోనే హాస్టలు, స్కూల్, క్లాస్ రూమ్స్ బాత్ రూమ్స్, టాయిలెట్సుకు ఇబ్బంది వున్నది. బధిరుల పాఠశాలలకు సంబంధించి మానవతా దృక్పథంతో నిధులు కొరత లేకుండా రాష్ట్రంలో ఉన్న అన్ని పాఠశాలల విషయంలో ప్రభుత్వం చర్య తీసుకోవలసిందిగా మీ ద్వారా కోరుతున్నాను.

మిస్టర్ స్పీకర్: ప్రయివేటు రన్‌చేస్తున్న ఇన్‌స్టూట్యూషన్సు ఉన్నాయి, రాష్ట్ర ప్రభుత్వం రన్ చేస్తున్న పాఠశాలలు సరైన స్టాఫ్ వున్నదా, లేదా, అనేది మెయిన్ ప్రశ్న.

శ్రీమతి ఎన్.రాజ్యలక్ష్మి:అధ్యక్షా, ఈ ప్రశ్న పెద్ద అంబర్ పేట చెవిటి విద్యార్థుల మోడల్ పాఠశాలకు సంబంధించినది ఇది ప్రయివేటు పాఠశాల దీనిని గురించి స్పష్టంగా క్వొశ్చన్ వేయడం జరిగింది. ఈ రోజు ప్రశ్న వేసిన సభ్యులు ఇక్కడ లేరు కాబట్టి జనరల్‌గా ఉండేటటువంటి ప్రశ్న గురించి అడగడం జరిగింది. బదిరులకు సంబంధించిన స్కూలులో ట్రైనింగ్ అయినటువంటి ఉపాధ్యాయులు నియమించడం జరుగతున్నది. గౌరవ సభ్యులు కిషన్‌రెడ్డిగారు చెప్పినట్టు అక్కడ స్థలం ఉన్న సరైనటువంటి భవనాలు లేనటువంటి పరిస్థితి, టీచర్సు కొరత వుందని చెప్పారు. దాని మీద చర్య తీసుకోవడం జరుగుతుంది. ఈ పెద్ద అంబర్‌పేట విషయం ఈ సభ ద్వారా మీకు తెలియాలి. ఆంధ్రప్రదేశ్ డెఫ్ అసోసియేషన్ హైద్రాబాదు యూనిట్ రంగారెడ్డి జిల్లాలో ఉన్నటువంటి పెద్ద అంబర్‌పేటలో బదిరుల కోసం మోడల్ స్కూల్ నిర్వహించడం జరగుతోంది. ఈ సంస్థకు 17 ఎకరాల సొంత స్థలం , భవనాలు, తగినంత వసతి సౌకర్యం , హాస్టల్ వసతి కూడా వున్నది. ఇది 1.7.1990 నుంచి ప్రారంభమైన ఈ పాఠశాలకు 1998-99 ఆర్థిక సంవత్సరం వరకు కేంద్ర ప్రభుత్వం, దానికి గ్రాంటు ఇన్ ఎయిడ్ అందించడం జరిగింది.1999 లో జరిగిన యాజమాన్య ఎన్నికలపై కొందరు కోర్టుకు వెళ్లి తే కోర్టు స్టే విధించినది. 2002 వరకు కూడా ఈ స్టే కొనసాగుతావున్నది. 2002లోప్రభుత్వం స్టే ఎత్తివేసినప్పటికి అసోసియేషన్‌కు ఇప్పటివరకు ఎన్నికలు జరగలేదు. ఈ కారణంగా ఈ పాఠశాల జిల్లా కలక్టర్ పర్యవేక్షణంలో నడుస్తుంది. 1999-2000 నుంచి ఈ పాఠశాల నిర్వహణకు జాయింట్ కలక్టర్ అధ్యక్షతన వికలాంగుల సంక్షేమ శాఖ అసిస్టెంటు డైరక్టర్సు ఇద్దరు సభ్యులుగా జిల్లా కలక్టరు ఒక కమిటిని నియమించడం జరిగింది. 1999 నుంచి కేంద్ర ప్రభుత్వం నుంచి గ్రాంట్ ఇన్ ఎయిడ్ అందనందున డిపెఫ్ ఎస్సై నుంచి ఈ పాఠశాల నిర్వహణకు తాత్కాలిక నిధులు సమకూర్చడం జరుగుతోంది. కేంద్రం నుంచి గ్రాంట్ ఇన్ ఎయిడ్ అందాక డిపెప్ ఎస్సై తిరిగి జమ చేయడం జరుగుతుంది. ఈ రోజు రాష్ట్రంలో బదిరుల కోసం 5 ఆశ్రమ పాఠశాలలు

ఉన్నాయి. ప్రస్తుతం చాలినంత సిబ్బంది ఉన్నారు. కొన్ని ఖాళీలు కూడా ఉన్నాయి. వాటిని త్వరలో భర్తీ కోసం చర్యలు తీసుకోవడం జరుగుతుంది. ప్రత్యేకించి అంబర్‌పేట్ స్కూలులో మాత్రం ఒక ప్రిన్సిపాల్ రాజకుమార్, ఆయన 10 సంవత్సరాలు పాఠశాల పర్యవేక్షణ చేస్తూ అక్కడే ఉన్నారు. విద్యాపరంగా స్పెషల్ ఎడ్యుకేట్‌తోబాటు బదిరులకు స్పెషల్ ఎడ్యుకేషన్‌లో శిక్షణ పొందినటువంటి ఇద్దరు అసిస్టెంటు టీచర్సు విద్యార్థులకు బోధన అందచేస్తున్నారు. అదనంగా ఒక క్రాఫ్టు టీచర్ కూడా పనిచేస్తున్నారు. పరిపాలనా పరంగా పాఠశాల మెరుగైన పనితీరుకోసం తగిన సిబ్బంది ఉన్నారు. మండల స్థాయిలో క్యాంపులు నిర్వహించి విద్యార్థులను ఎంపిక చేయడం జరుగుతుంది. పాఠశాలల్లో బదిరుల విద్యార్థులందరికి కూడా శ్రవణ పరికరాలు అందచేయడం జరిగింది. పాఠశాల్లో తగినంత ఫర్నీచర్, ఆడియో సామగ్రి అందుబాటులో వున్నది. ప్రస్తుతం బదిరుల మోడల్ పాఠశాల్లో 60 మందికి గాను 54 మంది విద్యార్థులు ఉన్నారు. ఈ పాఠశాల మెరుగుగా పనిచేస్తుంది. అలాగే రాష్ట్రంలో వుండే పాఠశాలల పనితీరు మెరుగుపర్చే చర్యలు తీసుకుంటామని మీ ద్వారా గౌరవ సభ్యులకు తెలియచేస్తున్నాను.

మిస్టర్ స్పీకర్: స్పోర్సు ఫిజికల్ చాలెంజ్ పిల్లలకు జిల్లాల వారిగా స్పోర్ట్సు కండక్టు చేయాలనే కార్యక్రమం వున్నది. అది కోరుతున్నారు.

శ్రీమతి ఎన్.రాజ్యలక్ష్మీ: అధ్యక్షా, ఉన్నాయి, దానిని అమలు చేస్తున్నాము.

శ్రీ జి.కిషన్‌రెడ్డి: అధ్యక్షా, హైద్రాబాదులో బదిరులకు సంబంధించిన గరల్సు ఆశ్రమ పాఠశాల వున్నది. ఈ రోజు రాష్ట్రంలో ఎన్ని పాఠశాలలు ఉన్నాయి. గరల్సుకు సంబంధించిన పాఠశాలలు తెలంగాణా జిల్లాలో ఎన్ని ఉన్నాయి, దయచేసి మీ ద్వారా కోరుతున్నాను.

శ్రీమతి ఎన్.రాజ్యలక్ష్మీ:అధ్యక్షా, ఈ రోజు నా దగ్గర ఎన్ని పాఠశాలలు ఉన్నాయి, ఎంతమంది సిబ్బంది సమాచారం పూర్తి స్థాయిలోలేదు. నేను తరువాత సభ్యులకు తెలియచేస్తాను.

ఉ.10.00

## ప్రైవేటు బస్సు ట్రావెల్సు వారు అధిక కిరాయిలను వసూలు చేయుట

ప్రశ్న నెం.136(4986)

శ్రీ టి. వెంకటరావు(గుంటూరు 2 ) - గౌరవనీయులైన సహకార, రవాణాశాఖ మంత్రిగారూ, దయచేసి ఈక్రింది సమాచారం తెలియచేస్తారాః

అ) ప్రైవేటు బస్సు ట్రావెల్స్, ఏజన్సీలు పండుగల సమయంలో ప్రయాణికులనుండి అధిక ఛార్జీలను వసూలుచేస్తున్న విషయం వాస్తవమేనా?

ఆ) ప్రత్యే సర్వీసులను ఏర్పాటుచేయటానికి, వారు ఎక్కువ పైకాన్ని వసూలుచేస్తున్న విషయం కూడా వాస్తవమేనా?

ఇ) పై అక్రమాలను అరికట్టేందుకు ప్రభుత్వం ఏదైనా చర్యను తీసుకున్నదా?

ఈ) అయితే, ఆ వివరాలేమిటి?

**సహకార, రవాణాశాఖామంత్రి (శ్రీ కన్నా లక్ష్మీనారాయణ):**

అ) ప్రైవేటు బస్సు ట్రావెల్స్ వసూలుచేసేందుకు ప్రభుత్వం ఎట్టి ఛార్జీలను నిర్ణయించలేదు.

ఆ) ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు.

ఇ) స్టేజ్ క్యారేజీలుగా నడుస్తున్న బస్సులపై రవాణాశాఖ కేసులను నమోదుచేస్తున్నది.

ఈ) అనధీకృతంగా తిరిగిన వాహనాలపై శాఖ 23,307 కేసులను నమోదుచేసింది.

శ్రీ టి. వెంకటరావు: అధ్యక్షా, ఆర్.టి.సి. యాజమాన్యం బస్సులను హైర్ చేసుకుంటోంది. ఆ సమయంలో, వారితో ఒప్పందాలు కుదుర్చుకుంటున్నప్పుడు నిర్దిష్టమైన ఆంక్షలు విధించకపోవటంవలన పండుగలు వచ్చినప్పుడు దూరాబారం ప్రయాణంచేసే ప్రయాణీకులు ఎక్కువమంది ఆర్.టి.సి. బస్సులు తగినన్ని లేకపోవటంవలన ప్రైవేట్ బస్సులను ఆశ్రయిస్తున్నారు. వారు ఒక స్లాబ్ అనేది లేకుండా ఇబ్బడిముబ్బడిగా టికెట్‌కు రూ.70 పైచిలుకు వసూలుచేస్తున్నారు. ప్రైవేట్ ఆపరేటర్స్ పండుగలకు దండుకోవటం బాగా అలవాటైపోయింది. ప్రైవేటు ఆపరేటర్లను అదుపుచేయటానికి ఆర్.టి.సి. అధికారులు ప్రత్యేక చర్యలను తీసుకోవటానికి అవకాశం ఉన్నప్పటికీ వారు అటువంటి చర్యలు తీసుకుంటున్న దాఖలాలు కన్పించటంలేదు. దీంట్లో అధికారుల చిత్తశుద్ధిని ఆలోచించవలసిన అవసరం ఉన్నది. మీద్వారా మంత్రిగారికి ఒక ఇన్ఫర్మేషన్ ఇవ్వదలచాను. శ్రీకృష్ణ ట్రావెల్స్‌వారు విజయవాడకు రూ.260 టికెట్ వ్రాయటం జరిగింది. ఇది ఎంత అమానుషమో తమరు గమనించాలి. ఈ పరంపర ఇలాగే కొనసాగితే పండుగలకు శెలవలు వచ్చినప్పుడు ప్రయాణంచేయాలంటే ప్రజలు చాలా ఇబ్బందులుపడతారు. దీనికి ప్రత్యేక దర్యాప్తు బృందంద్వారా, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ద్వారా అయినాసరే ప్రైవేటు ఆపరేటర్స్‌ను అరికట్టకపోతే కార్పొరేషన్ చిత్తశుద్ధినే శంకించవలసి వస్తుంది. ఇంత విచ్చలవిడిగా, బహిరంగంగా టికెట్స్‌పెట్టి దండుకుంటుంటే అరకొరగా కాగితాలపైన మొక్కుబడిగా కేసులు నమోదుచేస్తున్నారు. ఈ విధానాన్ని సరిచేయవలసినదిగా మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ కన్నా లక్ష్మీనారాయణ: అధ్యక్షా, రాష్ట్రంలో రెండు రకాలైన సర్వీసెస్ ఉన్నాయి. ఒకటి కాంట్రాక్ట్ క్యారియర్స్‌కాగా, రెండవది స్టేజ్ క్యారియర్స్. దగ్గరదగ్గర 95% నేషనలైజ్డ్ రూట్స్, ఇతరత్రా రూట్స్‌లో కాంట్రాక్ట్ క్యారియర్స్ నడుస్తాయి. గౌరవసభ్యులు అడిగింది ఏమంటే కాంట్రాక్ట్ క్యారేజెస్ ఎక్కడైతే మిస్‌యూజ్ చేస్తున్నారో వాటిపై సరైన నియంత్రణ లేదనేది వారి అభిప్రాయంగా భావిస్తున్నాను. అందుకనే చెప్పాను. కాంట్రాక్ట్ క్యారియర్స్‌గా లైసెన్స్ తీసుకుని స్టేజ్ క్యారియర్స్‌గా తిరుగుతున్న వాటిపైన కేసెస్ బుక్‌చేస్తున్నారు. గౌరవసభ్యులు చెబుతున్నదాంట్లో వాస్తవం ఉన్నది, ఒప్పుకుంటున్నాను. ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్‌కు కొంత స్టాఫ్

తక్కువగా ఉన్నది. పబ్లిక్ సర్వీస్ కమిషన్ద్వారా రిక్రూట్మెంట్చేసే ప్రాసెస్ జరుగుతోంది. ఆర్.టి.సి.లో కూడా ఎన్ఫోర్స్మెంట్ విభాగం ఉండాలనేది ప్రభుత్వం దృష్టిలో ఉన్నది. ఆర్.టి.సి. నుండి ప్రపోజల్ పంపాము. కాంట్రాక్ట్ క్యారియర్స్గా లైసెన్స్ తీసుకుని స్టేజ్ క్యారియర్స్గా త్రిప్పుతున్నారు. వాటిని నియంత్రించటానికి ఆర్.టి.సి.లో కూడా ఎన్ఫోర్స్మెంట్ విభాగం అవసరమనే వాదన చాలా కాలంగా ఉన్నది. ప్రభుత్వం దీనిని సీరియస్గా తీసుకుని పరిశీలించి ఏర్పాటుచేయాలనే అభిప్రాయంలో ఉన్నది. ఇది ప్రభుత్వ పరిశీలనలో ఉన్నది. ఎటువంటి మిస్యూజ్ జరగకుండా ఉండటానికై ఎన్ఫోర్స్మెంట్ విభాగం ఏర్పాటుచేయాలనే ఆలోచన ఉన్నది. శ్రీకృష్ణ ట్రావెల్స్వారు కాంట్రాక్ట్ క్యారియర్స్గా తీసుకుని మిస్యూజ్ చేస్తున్నారని చెప్పారు. ఆ సమాచారం నాకు పంపిస్తే నేను ఖచ్చితంగా ఎంక్వైరీ చేయించి చర్య తీసుకుంటాను.

MR. SPEKER: Question No.137(5402) is postponed at the request of the Member. Now, Question No.4518, Minister for Panchayat Raj & Endowments.

## ఆదాయం లేని ఆలయాలకు నిధులు మంజూరు చేయుట

ప్రశ్న నెం.138(4518)

సర్వశ్రీ /శ్రీమతి డి. శ్రీధర్బాబు, వి. సునీతాలక్ష్మారెడ్డి, జి. కుతూహలమ్మ, ఆర్. సూర్యప్రకాశరావు(రాజమండ్రి), డి.కె.అరుణ (గద్వాల) – గౌరవనీయులైన పంచాయితీరాజ్, దేవాదాయశాఖామంత్రిగారూ దయచేసి ఈక్రింది సమాచారం తెలియచేస్తారాః

అ) రాష్ట్రంలోని ఆదాయంలేని / దుర్బలంగా ఉన్న దేవాలయాలకు నెలకు రూ.2,000 ఇవ్వాలని ప్రభుత్వం ఉద్దేశిస్తున్న విషయం వాస్తవమేనా?

ఆ) అయితే, గుర్తించిన అట్టి దేవాలయాల సంఖ్య ఎంత? ఈ సంవత్సరానికి మంజూరుచేసిన మొత్తం ఎంత?

**పంచాయితీరాజ్, దేవాదాయశాఖామంత్రి (శ్రీ జె.సి. దివాకరరెడ్డి):**

అ) అవునండీ. మదింపుచేయదగని ఆదాయ గ్రూపు దేవాలయాలలో తగినంత ఆదాయం కలిగి ఉండనట్టి ప్రతి సంస్థకు , దూపదీప నైవేద్యం కోసం నెలకు రూ.1,000 మొత్తాన్ని అర్చకుల వేతనాల నిమిత్తం రూ.1,500 మొత్తాన్ని సమకూర్చవలసిందిగా ఆదేశించడమయినది. తదనుసారంగా 15-02-2006 తేదీగల రెవెన్యూ (దేవాదాయ) శాఖ ఎం.ఎస్.నెం.179 జి.ఓ.లో ఉత్తర్వులను కూడా జారీచేయడం జరిగింది.

ఆ) జిల్లానుండి మొదటి దశలో 2000 పేద, ఆవశ్యకత ఉన్న సంస్థలను గుర్తించాలని ప్రతిపాదించడమయినది. భవిష్యత్తులో జమ అయ్యే నిధుల ఆధారంగా, దశలవారీగా ప్రయోజనంపొందే దేవాలయాల సంఖ్యను పెంచడమవుతుంది. 2005-06 సంవత్సరంలో మదింపుచేయదగిన ఆదాయంనుండి ఈ కార్యం కోసం రూ.5,78,76,153 మొత్తాన్ని సేకరించాలని అంచనావేయడమయినది.

శ్రీ డి. శ్రీధర్‌బాబు: అధ్యక్షా, ఈరోజు గౌరవ ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డిగారి నాయకత్వంలో గౌరవ ఎండోమెంట్స్ మినిస్టర్‌గారు చాలా రోజులుగా ధూపదీప నైవేద్యంలేక కొట్టుమిట్టాడుతున్న వేలాది దేవాలయాలలో ధూపదీప నైవేద్యాలు కల్పించేందుకై రాష్ట్ర దేవాదాయశాఖ తరపున ఒక వినూత్నమైన పథకం రూపొందించటం జరిగింది. ఈ పథకాన్ని అర్చకుల పక్షాన, భక్తులందరి పక్షాన ఆహ్వానిస్తున్నాము, స్వాగతిస్తున్నాము. ఇటువంటి తరుణంలో చాలా రోజులుగా ఈ దేవాలయాలకు సంబంధించిన విషయాలన్నింటిపైన పూర్తి స్థాయిలో అవగాహన చేసుకుని ఈ కార్యక్రమం తీసుకున్నందుకు మంత్రిగారికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియచేస్తున్నాను. అసలే దైవచింతన లేకుండా కేవలం స్వార్థచింతనతో ప్రజలందరూ యాంత్రిక జీవితం జీవిస్తున్న ఇటువంటి తరుణంలో, సమాజంలో అరిష్టాలు పెల్లుబుకుతున్న ఇటువంటి సమయంలో ఇటువంటి కార్యక్రమాలు తీసుకుని దేవాలయాల్లో నిత్య కైంకర్యం ఏర్పాటుచేసేందుకై ప్రభుత్వం నిర్ణయంచేయటం ఎంతో అభినందనీయం. మీద్వారా గౌరవ మంత్రిగారిని కొన్ని విషయాలు అడగదలచాను. రాష్ట్రంలో ధూపదీప నైవేద్యాలు కరువైన ఆలయాలు ఎన్ని ఉన్నాయి? అటువంటి అన్ని ఆలయాలలో నిత్య కైంకర్యం జరపటానికి ఎటువంటి చర్యలు తీసుకోబోతున్నారు? పలు ఆలయాలకు ఆదాయంలేదు. అటు అర్చకులకు నెలల తరబడి జీతాలు లేవు. మొన్నీమధ్యన పత్రికల్లో కూడా చూశాము. వరంగల్‌లోని రామలింగేశ్వరస్వామి టెంపుల్‌లో చాలా రోజులుగా అక్కడ పనిచేస్తున్న అర్చకులు జీతం లేకుండా ఉన్నారు. నల్గొండ జిల్లాలోని విశ్వేశ్వరస్వామి దేవాలయంలో అర్చకులకు చాలా నెలలుగా జీతాలు లేక కష్టనష్టాలలో నడుస్తున్నాయని పత్రికల్లో చూశాము. ఇది వాస్తవమేనా? వారికి పూటగడవటానికి కనీసం నెలసరి జీతం అందించటానికై పూర్తిస్థాయిలో చర్యలు తీసుకుంటారా? రాష్ట్రంలో 6-జి సంబంధించి ఎన్ని దేవాలయాలు ఉన్నాయి? అందులో ఆదాయం వస్తున్న దేవాలయాలు ఎన్ని? సర్వశ్రేయో నిధినుండి ఎన్ని నిధులు సేకరించాలనే ప్రతిపాదన చేశారు? ఆ సొమ్ము ఏవిధంగా ఖర్చుచేస్తారు? ఆదాయంలేని దేవాలయాల్లో నిత్య పూజల నిర్వహణకు ప్రత్యేక కార్యాచరణ ఏమైనా ఏర్పాటుచేస్తున్నారా? అర్చకుల సంక్షేమ నిధి ఎప్పటినుండి ఏర్పాటుచేస్తారు? అర్చకులకు సంబంధించి మన ప్రభుత్వం ప్రత్యేకంగా 30/87 చట్టాన్ని సవరించటానికి ఎలక్షన్ మేనిఫెస్టోలో ఎన్నికల ప్రణాళికలో పెట్టుకోవటం జరిగింది. దరిమిలా గౌరవ ముఖ్యమంత్రిగారు చిత్తశుద్ధితో 04-10-04 సంవత్సరంలో అఖిలపక్ష సమావేశం నిర్వహించటం జరిగింది. ఈ చట్టాన్ని పూర్తిస్థాయిలో సవరించి అర్చకులకుగాని, భక్తులకుగాని, అదేవిధంగా శిథిలావస్థలో ఉన్న దేవాలయాలను పర్యవేక్షించటానికై ఈ సవరణ చేయాలని గౌరవ ముఖ్యమంత్రిగారు చాలామార్లు చెప్పినప్పటికీ ఆలస్యం అవుతోంది.

ఉ.10.10

ఆలస్యానికి కారణం ఈ నాడు మన పక్షాన, అధికారుల పక్షాన చెప్పవలసిన అవసరమున్నది. ప్రభుత్వం చాలా మంచి కార్యక్రమాలు చేపట్టడం జరిగింది. ధూపదీప నైవేద్యాలకు సంబంధించి వెయ్యి రూపాయలు, అర్చకుల జీతాల క్రింద రు. 1500/-లు ఇవ్వడం చాలా మంచిది. ఇలాంటి సమయంలో చిల్కూరు దేవాలయ నిర్వహణ పద్ధతి బాగుందని చెప్పి ఆ దేవాలయాన్ని దేవాదాయ శాఖ ఎందుకు

స్వాధీనపరచుకోవడానికి ముందుకు పోతున్నారో తెలియజెయ్యాల్సిందిగా గౌరవ మంత్రి గారిని కోరుతున్నాను. దేవదాయ శాఖ నిర్వహణ లోని ఆలయాలలో ధూపదీప నైవేద్యాలకు కాని అర్చకుల జీతాలకు కాని ఇవ్వలేని దేవాదాయ శాఖ ఈ దేవాలయాన్ని స్వాధీనపరచుకోవటానికి ప్రయత్నించడం ఎంతవరకు సబబు అని చాలా మంది ప్రశ్నిస్తున్నారు. దీనిని గౌరవ ముఖ్యమంత్రి గారు కూడా ప్రత్యక్షంగా చాలా సానుకూలంగా వున్నారు. ఈ సందర్భంలో ప్రత్యేకంగా నేను కోరేది ఒకటే. ఈనాడు చిల్కూరు దేవాలయం వారు చేస్తున్న ప్రతి ఒక కార్యక్రమాన్ని అర్చకులు హర్షిస్తున్నారు. భక్తులు హర్షిస్తున్నారు. ప్రభుత్వం వారు చిన్న దేవాలయాలకు స్వయంప్రతిపత్తి కార్యక్రమాలు ఎన్నో చేస్తున్నారు. అలాంటి సమయంలో చిన్న దేవాలయాలకు సంబంధించినంత ఆదాయం కూడా లేని దేవాలయాలలో ఈ చిల్కూరు దేవాలయం కూడా ఒకటి. వారు ఎక్స్‌పరిమెంటల్ బేసిస్ మీద ఈ దేవాలయాన్ని నడిపిస్తున్నారు. నేను ఏ అర్చకుడి గురించి మాట్లాడటం లేదు. ఈ నాడు ఒక ఎక్స్‌పరిమెంటల్ బేసిస్ మీద స్వయంప్రతిపత్తితో ముందుకు నడుస్తున్న తరుణంలో ఈ విధమైన నిర్ణయాలు ఖచ్చితంగా ప్రభుత్వం పైన రిఫ్లెక్ట్ అయ్యే కార్యక్రమం అవుతుంది. నేను పూజలు చేస్తాను. ఆ దేవాలం అర్చకులు పూజలు చేస్తారు. దేవాదాయ శాఖ మంత్రి గారు కూడా పూజలు చేస్తారు. ఈ సందర్భంగా నేను కోరేది ఒకటే. ఈనాడు సుప్రీం కోర్టు నిర్దేశించిన విధంగా 30/87 విషయంలో అర్చకులకు పే స్కేల్స్ పూర్తిస్థాయిలో ఇవ్వాలి. అయితే ఆ విషయం ఇప్పటి వరకు ఇంప్లిమెంట్ కాలేదు. అంతేకాకుండా అర్చకుల జీవితాలు ఈనాడు ఏ విధంగా వున్నాయో ఈ శాసనసభలో వున్న చాలా మంది గుళ్లకు వెళ్లేవారే కాబట్టి వారందరికీ తెలుసు. దుర్భరమైన పరిస్థితుల్లో వున్న అర్చకుల పరిస్థితిని కాపాడవలసిన కనీస బాధ్యత మనపై వుందని నేను గౌరవ మంత్రి గారికి మనవి చేస్తున్నాను. అర్చకులకు పే స్కేల్స్ విషయంలో కాని, చిన్న దేవాలయాలను స్వాధీనం చేసుకోవాలని తీసుకున్న నిర్ణయంవిషయంలో కాని, చిల్కూరు దేవాలయం విషయంలో కాని అదేవిధంగా ఎక్కడైతే పే స్కేల్స్ వర్తించని ప్రాంతాల్లో వున్న వారికి కాని, పే స్కేల్స్ వర్తింపచేసినా జీతాలు చెల్లించలేని పరిస్థితుల్లో వున్న దేవాలయాల విషయంలో కాని ఖచ్చితంగా గౌరవ మంత్రి గారు ప్రొవిజన్స్ ఆఫ్ లా పరంగా చర్య తీసుకోవాలని కోరుతున్నాను. నేను గౌరవ మంత్రి గారికి చాలా ప్రశ్నలు అడగడం జరిగింది. వాటి పరంగా అర్చకుల విషయంలో తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను. ఇప్పుడున్న మంత్రి గారు చాలా కష్టించి పని చేస్తున్నారు. కాని అధికారుల పరంగా అలసత్వం కనపడుతున్నదని ప్రజల్లో అభిప్రాయం వుంది. దాని గురించి ఖచ్చితంగా జవాబు చెప్పాలని నేను మంత్రి గారిని కోరుతున్నాను.

MR. SPEAKER : A very passionate appeal has been made by the Member.

శ్రీ జె.సి.దివాకర్ రెడ్డిః అధ్యక్షా, ఈ రాష్ట్రంలో దేవాదాయ శాఖ గుర్తించిన దేవాలయాలు 33 వేల 901 వున్నాయి. వాటిలో సిక్స్ (సి) క్రింద అంటే రు. 50 వేల లోపు ఆదయం కలిగిన దేవాలయాలు 32 వేల 98 వున్నాయి. ఇదే కాకుండా ఇంకొక 20, 25 వేల దేవాలయాలు రికగ్నైజ్ చేయనివి గ్రామాల్లో వున్నాయి.

రికగ్నైజ్ చేసిన దేవాలయాలలో కూడా చాలా దేవాలయాలకు ఆదాయం లేని ఫలితంగా చాలా చోట్ల ధూపదీపనైవేద్యాలు కూడా జరగడం లేదు. ఎక్కడైనా కొన్ని ఎకరాల భూమి వున్నప్పటికీ వాటి నుంచి సరియైన ఆదాయం రాని ఫలితంగా నిజంగానే అర్చకులు దుర్భరమైన జీవితాలు గడుపుతున్నారు. అట్లాగే అక్కడ ధూప దీప నైవేద్యాలు కూడా సక్రమంగా జరగడం లేదని మా ప్రభుత్వం వచ్చిన తరువాత ముఖ్యమంత్రి డాక్టర్ రాజశేఖర రెడ్డి గారు గుర్తించిన ఫలితమే......... నేను అనుకుంటాను...... ఏ రాష్ట్రంలో కూడా లేని పద్ధతిలో స్ట్రైట్ అవే....... డైరెక్ట్‌గా మా దేవాదాయ శాఖ అర్చకులకు వెయ్యి రూపాయలు, దూపదీపనైవేద్యాలకు రు. 1500 ఇవ్వాలని నిర్ణయం ఈ మధ్యనే ముఖ్యమంత్రి గారు తీసుకోవడం జరిగింది. ఆ మేరకు జి. ఒ. కూడా

ఇస్యూ చేయడం జరిగింది. ప్రభుత్వం ఈ దేవాలయాల విషయంలో ప్రత్యేకమైన శ్రద వహిస్తోంది. వాటిని బాగు చేయాలని,సనాతనమైన హిందూ ధర్మాన్ని రక్షించాలన్న ఉద్దేశంతో చేస్తున్నాము. దాని ఫలితమే ఇవన్నీ. వారు చిల్కూరు దేవాలయం గురించి చెప్పారు. అధ్యక్షా, దీనిలో ఎప్పుడూ కలుగజేసుకోవాలన్న ఉద్దేశం ప్రభుత్వానికి ఎన్నడూ లేదు. ఈ దేవాలయం 1984 సమయంలోనే ఈ శాఖ ఆధ్వర్యం క్రిందకు వచ్చింది. దీనిని సిక్స్ (సి)దేవాలయంగా గుర్తించడం జరిగింది. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఒక ప్రైవేట్ లిటిగేషన్ హైకోర్టుకు పోయింది. హైకోర్టు వారు ఈ మధ్యనే తీర్పు ఇచ్చారు. ఇది సిక్స్ (సి) దేవాలయం కాబట్టి మూడు మాసాల లోపల ఒక కమిటీ వేయాల్సిందే అని తీర్పు ఇవ్వడం జరిగింది. అట్లాగే కొన్ని కంప్లెయింట్స్ కూడా వెళ్లాయి. అవి మా దృష్టి కంటే హైకోర్టు దృష్టికి వెళ్లాయి కాబట్టి వాటి విషయంలో కూడా విచారణ చేయాలని చెప్పడం జరిగింది. అయితే ప్రభుత్వానికి బాగా నడుస్తున్న దేవాలయాల విషయంలో జోక్యం చేసుకోవాలని ఏ కోశానా, ఎక్కడా లేదు. ప్రధానంగా మా ముఖ్య మంత్రి గారికి ఆ ఉద్దేశమే లేదు.దీని గురించి ఏ రకంగా బయటపడాలని ఆలోచన చేస్తున్నారు. కాని అది కాస్తా ఆలోచన చేసినా హైకోర్టు జడ్జిమెంట్ వుంది కాబట్టిఆ తీర్పు ప్రకారంగా పోక తప్పదేమోనన్న ఆలోచనతో వ్నారు. టైం వుంది అధ్యక్షా మాకు. సామరస్య పూర్వకంగా ఏదో ఒక నిర్ణయం తీసుకోకతప్పదు. అటు భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా , ఇటు దేవాలయం వారికి ఏలాంటి ఇబ్బంది లేకుండా చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం వుంది. దేవాలయాల విషయంలో ఈ ప్రభుత్వం యొక్క చిత్తశుద్ధిని ఎవరూ శంకించాల్సిన అవసరం లేదు. సక్రమంగా సనాతన ధర్మాలను రక్షిస్తూ భక్తులకు, యాత్రికులకు అందరికి కూడా అన్ని రకాలైన సౌకర్యాలు చేయాలనేఉద్దేశంతోనే ఈ ప్రభుత్వం వుందని నేను ఈ సందర్భంగా మనవి చేస్తున్నాను.

శ్రీ డి.శ్రీధర్ బాబుః అధ్యక్షా, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రణాళికలో పెట్టిన మేరకు గౌరవ ముఖ్యమంత్రి గారు 2004వ సంవత్సరం అక్టోబర్ మాసంలో అఖిలపక్ష సమావేశం జరిపి 30/87 కు అమెండ్‌మెంట్స్ గురించి చర్యలు తీసుకోవాలని ఆదేశాలు కూడా ఇవ్వడం జరిగింది. గౌరవ ముఖ్యమంత్రి గారు పూర్తి స్థాయిలో చిత్తశుద్ధితో అమెండ్‌మెంట్స్ తీసుకొస్తామని ఖచ్చితంగా నిర్దేశించిన తరువాత కూడా ఆలస్యమవుతున్నది. దీనికి కారణమెవరు? కారణాలు తెలుసుకోవాల్సిన అవసరం మన పరంగా వుందని గౌరవ మంత్రి గారిని నేను కోరుతున్నాను. ఈ అమెండ్‌మెంట్స్ గురించి మన ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టుకోవడం జరిగింది. దాని పరంగా ఇమ్మీడియట్‌గా యాక్ట్ చేసి ఈ అమెండ్‌మెంట్స్ తీసుకురావాలని, తద్వారా మనం ఇచ్చిన హామీని నెరవేర్చుకున్నవారమవుతామని, ఇప్పటికే చాలా ఆలస్యమయ్యిందని, 2004వ సంవత్సరం అక్టోబర్ మాసంలో అఖిల పక్ష సమావేశం నిర్వహించిన తరువాత కూడా ఈ అమెండ్‌మెంట్ తీసుకురాలేదనే అపవాదు వుంది కాబట్టి దయచేసి దీనిని గమనించి వెంటనే అమెండ్‌మెంట్ తీసుకురావాలని నేను గౌరవ మంత్రి గారిని కోరుతున్నాను.

ఉ.10.20

శ్రీ జె.సి. దివాకర్ రెడ్డి ః అధ్యక్షా, ముఖ్యమంత్రి శ్రీ వై.యస్. రాజశేఖర్ రెడ్డిగారు దీనికంటె ఎన్నో ప్రధానమైన విషయాలలో కూడా మా పార్టీ ఇచ్చిన మేనిఫెస్టోకు అనుగుణంగా ఇప్పటికే ఎన్నో చర్యలు తీసుకోవడం జరిగింది. దీంట్లో కూడా అలసత్వం లేదు. న్యాయ నిపుణులతో కొంత విచారణ చేయించవలసిన అవసరం వుంది. ఇతర చట్టాలు ఎలా వున్నాయో ఒకసారి పరిశీలన చేసి అతి తొందరలో నిర్ణయం తీసుకోవడం జరుగుతుంది. మేనిఫెస్టోలో చెప్పిన విషయాలను తూచా తప్పకుండా ఆచరణలో పెట్టడానికి ఈ ప్రభుత్వం సిద్ధంగా వుందని మనవి చేస్తున్నాను.

## పాఠశాలలలో భాషా పండితులు, ఇతర అంశాలను బోధించే ఉపాధ్యాయులు

ప్రశ్న నెం .139(5245)

సర్వశ్రీ/శ్రీమతి పి. సుజాత (ఆచంట), సిహెచ్. బాబు రమేష్ (ఎల్లవరం), వి. నరేందర్ రెడ్డి (మహబూబాబాద్) – గౌరవనీయులైన పాఠశాల విద్యాశాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారాః

అ) పాఠశాలల్లో లాంగ్వేజ్ పండిట్‌లు, సబ్జెక్ట్ టీచర్లు తక్కువగా వున్న విషయం వాస్తవమేనా?

ఆ) విద్యా సంవత్సరం ఆఖరు రోజుల్లో ఒత్తిడి చేయడం వల్ల ఫలితాలు పొందటం లేదనే విషయం వాస్తవమేనా?

ఇ) సదుపాయాలు కల్పించకుండా ఫలితాలు సాధించడం సాధ్యమేనా?

**పాఠశాల విద్యాశాఖా మంత్రి ( శ్రీమతి ఎస్. రాజ్యలక్ష్మి):**

అ) అవునండీ

ఆ) లేదండీ

ఇ) లేదండీ

MR. SPEAKER : Question No. 140(5433) has been postponed at the request of the Member.

## స్వల్ప వ్యవధి ప్రశ్నలు

## కర్నూలు జిల్లాలోని ఐదల పురపాలక సంఘాలలో భూగర్భ మురుగు నీటి పారుదల వ్యవస్థ

స్వల్ప వ్యవధి ప్రశ్న నెం.140–ఎ(5324–ఎఫ్)

సర్వశ్రీ కె. రామభూపాల్ రెడ్డి (పాణ్యం), ఎం . శిఖామణి (కోడుమూరు), ఇ. ప్రతాపరెడ్డి (ఆత్మకూరు) – గౌరవనీయులైన మునిసిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారాః

అ) కర్నూలు జిల్లాలోని ఐదు మున్సిపాలిటీలలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేసే ప్రతిపాదన ఏదైనా వుందా?

ఆ) అయితే, ఈ పథకం కార్యరూపం దాల్చడానికి ఎంత కాలం పడుతుంది?

**మునిసిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి( శ్రీ కోనేరు రంగారావు)ః**

అ) లేదండీ

ఆ) ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు. అయితే, కర్నూలు మున్సిపల్ కార్పోరేషనులో 'సమగ్ర వరద నీటి కాలువలు, మురుగుపారుదల అధ్యయనాల ' కోసం కన్సల్టెన్సీ అధ్యయనాన్ని చేపట్టడానికి ప్రతిపాదనలను కోరడమైంది. అధ్యయనాన్ని ఖరారు చేసిన తర్వాత తదుపరి చర్యను చేపట్టడమవుతుంది.

శ్రీ కె. రామభూపాల్ రెడ్డి ః అధ్యక్షా, మంత్రిగారు సమాధానం చెబుతూ, లేదండీ, ఈ ప్రశ్న ఉత్పన్నం కాదని చెప్పారు. కర్నూలు జిల్లాలో ఐదు మున్సిపాలిటీలున్నాయి. ఈ మున్సిపాలిటీలలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కోసం మొత్తం ఎంత డబ్బు ఖర్చు పెట్టాలనుకుంటున్నారు? ఇప్పటి వరకు ఎంత ఖర్చు పెట్టారు? కర్నూలు మున్సిపాలిటీని కార్పోరేషన్‌గా మార్చడం జరిగింది కాని కార్పోరేషన్ స్థాయిలో కర్నూలు కార్పోరేషన్‌ను అభివృద్ధి చేయడం లేదు. ముజ్‌ఫర్ నగర్, సలీం నగర్ లలోని పరిస్థితులను చూస్తే, గ్రామీణ ప్రాంతాల కన్నా అధ్వాన్నమైన పరిస్థితుల్లో ఆ వాడలు వున్నాయి. ఈ ప్రశ్న ఉత్పన్నం కాదంటే, ఇక మనం ఏవిధంగా డెవలప్ చేయగలమో ఒకసారి ఆలోచించండి. ఈ డ్రైనేజీ లేకపోవడం వల్ల, నడవడానికి వీలులేని పరిస్థితుల్లో రోడ్లు ఉండడం వల్ల, పందులు రోడ్ల మీదకు రావడం వల్ల అక్కడ నివశించే ప్రజలు చాలా ఇబ్బందికరమైన పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. కావున ఎప్పటి లోగా ఈ డ్రైనేజీని అక్కడ ఏర్పాటు చేస్తారు? ఎంత డబ్బు కేటాయిస్తారు? అక్కడ సిమెంటు రోడ్లు కూడా ఏర్పాటు చేయవలసిన అవసరం వుంది. ఈ కర్నూలు కార్పోరేషన్ గాకుండా మిగిలిన నాలుగు మున్సిపాలిటీలు – నంద్యాల, ఆదోని, ఎమ్మిగనూరు, డోన్ ల పరిస్థితి తీసుకున్నా అక్కడ కూడా అదే విధంగా వుంది. ఇంతకు ముందు డోన్ గ్రామ పంచాయతీగా వుండేది, ఇప్పడు దాన్ని మున్సిపాలిటీ స్థాయికి పెంచడం జరిగింది. ఈ నాలుగు మున్సిపాలిటీలు మరియు కర్నూలు మున్సిపల్ కార్పోరేషన్‌లలో ఏవిధంగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సిస్టంను తీసుకొస్తున్నారో చెప్పాలి. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ అంటే ఈ ప్రశ్న ఉత్పన్నం కాదన్నారు. మురుగు నీటి పారుదలకు ఏవిధమైన ఏర్పాట్లు చేస్తున్నారు, ఎంత డబ్బులు కేటాయిస్తున్నారు చెప్పాలని మీద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ ఎం . శిఖామణి ః అధ్యక్షా, తమరి ద్వారా మంత్రిగారికి మనవి చేసేదేమంటే, రాయలసీమకు ముఖద్వారం కర్నూల్. ఒకప్పుడు అది రాష్ట్రానికి మాజీ కేపిటల్. కర్నూల్‌ను మున్సిపల్ కార్పోరేషన్ స్థాయికి పెంచినా అక్కడ ఎటువంటి వసతులు లేవు. గల్లీగల్లీకి వెళ్లి ఒకసారి చూడండి. సలీంనగర్‌లో పరిస్థితి అధ్వాన్నంగా వుంది, పిల్లలు మురికి కూపంలో ఉంటారు. అలాగే ముజ్‌ఫర్ నగర్ చూడండి. పేరుకు మాత్రమే మాజీ కేపిటల్. అక్కడ ఏ వసతులు కూడా లేవు. కావున అక్కడ ఎప్పటిలోగా డ్రైనేజీ వ్యవస్థను చేపడుతారు? ఎలాంటి వసతులు లేని ఈ కార్పోరేషన్‌లో వసతులు కల్పించడానికి మంత్రిగారు చర్యలు తీసుకుంటారా? ఇంతవరకు ఎంత ఖర్చు పెట్టారు, ఇంకా ఎంత ఖర్చుపెట్టబోతున్నారో చెప్పాలని కోరుతున్నాను.

శ్రీ ఎస్. మోహన్ రెడ్డి ః అధ్యక్షా, మీద్వారా మంత్రిగారిని రిక్వెస్ట్ చేస్తున్నాను . కర్నూల్ జిల్లాలో అది పెద్ద మున్సిపాలిటీ నంద్యాల మున్సిపాలిటీ . అందులో 1.12 లక్షల మంది ఓటర్లున్నారు. ఈ మున్సిపాలిటీకి డిఎఫ్ఐడి నిధులు రూ. 32 కోట్లు, వరల్డ్ బ్యాంక్ నిధులు రూ. 27కోట్లు, అలాగే హడ్కో నిధులు కూడా మంజూరు కావడం జరిగింది. అదేవిధంగా కర్నూలు జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలకు కూడా డిఎఫ్ఐడి

ఫండ్స్, వరల్డ్ బ్యాంకు ఫండ్స్, హడ్కో ఫండ్స్ మురుగు నీటి పారుదలకు గాని , రోడ్లకుగాని కొత్తగా ఫండ్స్ రాబోతున్నాయి. మంత్రిగారిని , ముఖ్యమంత్రిగారికి చేసే విజ్ఞప్తి ఏమంటే, మనం అన్ని మునిసిపాలిటీలకు ఎందుకు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సౌకర్యాన్ని ఏర్పాటు చేయకూడదు? రోడ్లు వేస్తున్నాం, వాటర్ ఇస్తున్నాం, ఎల క్ట్రిసిటీ ఇస్తున్నాం, కాని డ్రైనేజీ విషయానికి వచ్చేసరికి ఓపెన్ డ్రైనేజీ పెడుతున్నాం . దీని వల్ల దోమలు, పందుల వల్ల సానిటేషన్ దెబ్బతిని విషజ్వరాలు తదితర రోగాల బారిన పడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కాల్వలు కనబడితే పిల్లలను అక్కడే కూర్చోబెడుతున్నారు. దీని వల్ల ఆరోగ్యం దెబ్బతినే అవకాశాలున్నాయి కాబట్టి ఓపెన్ డ్రైనేజీని అండర్ గ్రౌండ్ డ్రైనేజీ క్రింద మార్చమని ముఖ్యమంత్రిగారిని కోరుతున్నాను. నంద్యాల మున్సి పాలిటీకి సంబంధించి చూస్తే, మేము ఆర్థికంగా బాగానే వున్నాం . ఈ మున్సిపాలిటీలో రూ. 1.50 కోట్ల నుంచి రూ. 2 కోట్ల వరకు సొంత నిధులున్నాయి. డిఎఫ్ఐడి, వరల్డ్ బ్యాంకు , హడ్కో నిధులకు అదనంగా కావలసి వస్తే జనరల్ ఫండ్స్ నుంచి ఖర్చు పెట్టడానికి మేము సిద్ధంగా వున్నాం . దయచేసి నంద్యాల మున్సి పాలిటీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను తప్పకుండా ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవాలని మంత్రిగా రిని, ముఖ్యమంత్రిగారిని ఈ సందర్భంగా కోరుతున్నాను.

శ్రీమతి కోట్ల సుజాతమ్మ (డోన్) : అధ్యక్షా, మా డోన్ కొత్తగా మున్సిపాలిటీ అయింది. అయితే ఎటు వంటి అభివృద్ధికి నోచుకోలేదు ఇంతవరకు. గ్రామ పంచాయతీగా వున్నపుడు కూడా అభివృద్ధి కాలేదు. ఇక్కడ డ్రైనేజీ వ్యవస్థకు ఫండ్స్ సరిపోవడం లేదు కాబట్టి ఇంకా ఎక్కువగా ఇచ్చేటట్లు చూడాలి. మాదగ్గర వాటర్‌లో క్యాల్షియం ఎక్కువగా వుంది కాబట్టి వాటర్ బెడ్స్, ఫిల్టర్స్ ఏర్పాటు చేయవలసిన అవసరం వుంది. కర్నూల్ కార్పోరేషన్‌లో ఉపాధి అనే పథకాన్ని ప్రవేశపెట్టారు. అదే విధంగా ఈ ఉపాధి పథకాన్ని డోన్ మున్సిపా లిటీలో కూడా ప్రవేశపెట్టాలని మంత్రిగారిని కోరుతున్నాను. డోన్ మున్సిపాలిటీ ప్రత్యేకంగా వుంది కాబట్టి ఇక్కడ ఉపాధి పథకాన్ని ప్రవేశపెట్టాలంటే మినిష్టర్‌గారి పర్మిషన్ తీసుకోవాలని చెప్పారు కాబట్టి అడుగుతు న్నాను. ఉపాధి అంటే డిగ్రీ, పదవ తరగ తి చదువుకున్న వారికి ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించడం . కావున దయచేసి ఈ ఉపాధి పథకాన్ని డోన్ మున్సిపాలిటీలో కూడా ప్రవేశపెట్టాలని మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ కోనేరు రంగారావు : అధ్యక్షా, కర్నూల్ జిల్లాలో మొదటి దశలో కర్నూల్‌లో డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయడానికి కావలసిన సర్వే జరిగింది కూడా . దీనికి రూ. 32 కోట్లతో ఒక ప్రాజెక్టు తయారుచే యడం జరిగింది. ఇవన్నీ కూడా డైరెక్ట్‌గా గవర్నమెంటు చేయదు . హడ్కో గాని, నాబార్డ్‌కు గాని మేము రిక మెండ్ చేయడం జరుగుతుంది, రికమెండ్ చేస్తాం . ఇంకా సమగ్రమైన రిపోర్టు రాలేదు, అది వచ్చిన తర్వాత చేస్తాం .

తర్వాత డిఎఫ్ఐడి నిధులు స్లమ్ ఏరియాల్లో మాత్రమే ఖర్చు పెడతాం . ఇతర ప్రాంతాలలో, పట్టణా లలో ఖర్చు పెట్టడానికి అవకాశం లేదు. రెండో దశలో నంద్యాల, ఆదోని మున్సిపాలిటీలకు సంబంధించి కూడా సర్వే చేయించడానికి ఏర్పాట్లు చేస్తున్నాం . ఎపిఎస్‌పి అనే కన్సల్టెన్సీ సంస్థ ద్వారా సర్వే చేయించి కావలసిన రిపోర్ట్స్ తయారుచేసి గవర్నమెంటుకు సబ్‌మిట్ చేయడం జరుగుతోంది. అందుచేత ఈ కార్యక్రమం అంతా కూడా ముందు కర్నూల్ పూర్తయిన తర్వాత నంద్యాల, ఆదోని కూడా పూర్తి చేయడానికి ప్రయత్నం చేస్తాం .
ఉ.10.30

దీని ప్రాజెక్టు రిపోర్టు డీటెయిల్డుగా మా దగ్గరకు వచ్చిన తరువాత దానికి కావలసిన నిధులు సెంట్రల్ గవర్నమెంట్ డిపార్ట్‌మెంట్సు మన ప్రభుత్వం ద్వారా రికమండ్ చేస్తాము. మోహన్‌రెడ్డిగారు చాలా పట్టణాలలో నిధులు వచ్చాయని, అవి ఖర్చు పెట్టలేదని అంటున్నారు. అది వాస్తవం కాదు. అర్జీ పెట్టినంత మాత్రాన శాంక్షన్ అయ్యాయని కాదు. దానికి సంబంధించిన సర్వే జరగాలి. ఏ ఏ కార్యక్రమానికి ఎంత డబ్బు అవసరమని ఇన్ఫర్మేషన్ వచ్చిన తరువాత నిధులు మంజూరు చేయడం జరుగుతుంది. కర్నూలు పట్టణానికి డ్రైనేజికి కావలసిన ఏర్పాట్లను చూస్తున్నాము. అది అయిపోయిన తరువాత నంద్యాలలో, ఆధోని విషయంలో చేస్తామని గౌరవ సభ్యులకు తెలియచేస్తున్నాను.

శ్రీమతి డి. కె.అరుణః అధ్యక్షా, అండర్ గ్రౌండ్ డ్రైనేజి కోసం మహబూబ్‌నగర్ గద్వాల్‌లో ప్రతిపాదనలు పంపడం జరిగింది. సర్వే నిర్వహించారు. డిపిఇఆర్ రిపోర్టు తయారు చేశారు. సిసిఎఫ్ నిధుల ద్వారా రు.3 కోట్లు నిధులు మున్సిపాలిటీ నుండి కేటాయించడం జరిగింది. డిపిఆర్ వచ్చిన మాట వాస్తవమేనా? అడ్మినిస్ట్రేషన్ శాంక్షన్ ఇచ్చి ఎప్పటి లోగా టెండర్సు పిలుస్తారు? రాజీవ్ నగర బాట సందర్భంగా ముఖ్యమంత్రిగారు కొన్ని మున్సిపాలిటీలకు వచ్చి మా మున్సిపాలిటీకి కూడా రావడం జరిగింది. ఆ సమయంలో కొన్ని అస్యూరెన్సులు ఇవ్వడం జరిగింది. వాటికి సంబంధించి ఎటువంటి కార్యక్రమాలు జరగలేదు. చేపడుతున్నాం అంటున్నారు కాని ఇంతవరకు ఏ పని చేయలేదు. ఆ పనులు ఎప్పటిలోగా టేకప్ చేస్తారు? గద్వాల్ మున్సిపాలిటీకి నీటి పైప్‌లైన్సు సరిగా లేకపోవడం వల్ల అక్కడున్న పాత పైప్‌లైన్సు కట్ అవడం వల్ల డ్రింకింగ్ వాటర్ ప్రియారిటీగా తీసుకొని పరిష్కరించాలని కోరుతున్నాను. సమ్మర్ వచ్చింది. కాబట్టి ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరుతున్నాను.

మిస్టర్ స్పీకర్ః కర్నూలు మున్సిపాలిటీకి సంబంధించిందించిన ప్రశ్న. వేరే మున్సిపాలిటీకి సంబందించింది. మినిస్టరుగారికి రిప్లై ఇవ్వడం కష్టమవుతుంది.

శ్రీ కె.రామ్‌భూపాల్ రెడ్డిః అధ్యక్షా, కర్నూలు జిల్లా కార్పోరేషన్ రు.32 కోట్లు ఈ పథకం కోసం కేటాయించడం జరిగింది. నేను అడిగిన దానికి మంత్రిగారు సమాధానం చెప్పలేదు. అండర్‌గ్రౌండ్ డ్రెయినేజి సిస్టమ్ కోసం కర్నూలు కార్పోరేషన్‌లో ఎంత డబ్బు ఖర్చు పెట్టారు? ఎంత ఖర్చు పెట్టాలని అనుకున్నారు? కర్నూలు కార్పోరేషన్‌లో ముజఫర్ నగర్, సలీం నగర్, కల్లూరు ఎస్టేట్ ఏరియాలను మీరు వెళ్లి చూడండి. అక్కడ పరిస్థితి చాలా దారుణంగా ఉంది. దానిని ఎలా డెవలప్ చేస్తారు? అన్ని ప్లాన్స్ తయారు చేశాము. ఆ మూడు ప్రాంతాలను అభివృద్ధి చేయడానికి ఎన్ని రోజులు పడుతుంది? కాలాతీతం అవుతుంది . మురికి వాడలలో డిఐఎఫ్ నిధులు ఖర్చు పెట్టడానికి ఉంది. ఆ మూడు ప్రాంతాలలో ఎంత డబ్బు ఖర్చు చేస్తారు? వారికి త్రాగడానికి కూడ ఇబ్బంది ఉంది. వారికి త్రాగునీటికి, డ్రెయినేజికి ఇబ్బంది లేకుండా ఎప్పటి లోగా సమస్యలను పరిష్కారం చేస్తారో మంత్రిగారిని తెలుపమని కోరుతున్నాను.

శ్రీ కోనేరు రంగారావుః రెండు సంవత్సరాలుగా మన గౌరవ ముఖ్యమంత్రిగారు మంచినీటి విషయంలో ప్రాధాన్యత ఇచ్చి, ఏ విషయమైనా ఇబ్బంది లేకుండా, ఆందోళన లేకుండా ఈ సమస్యను పరిష్కారం చేస్తూ వచ్చారు. డ్రెయినేజి, మంచినీటి విషయంలో కాని గార్బేజి రిమూవల్ విషయంలో కూడా మున్సిపాలిటీలలో ఒక ప్రత్యేకమైన ఆలోచన చేసి ముఖ్యమంత్రిగారే స్వయంగా ఆ కమిటీకి బాధ్యత వహించి ఈ కార్యక్రమాన్ని పరిష్కారం చేయాలని మంచి నిర్ణయం చేశారు. కర్నూలు విషయంలో మేము ఇన్‌వెస్టిగేషన్

చేస్తున్నాము. రు.32 కోట్లు ఇచ్చినవి కాదు. అవన్నీ ఇన్‌వెస్టిగేషన్ చేసి ఏ విధమైన పథకాలకు కర్నూలు కార్పోరేషన్‌లో డ్రెయినేజి సమస్య పరిష్కారం చేయడానికి ఏవిధమైన కార్యక్రమం చేయాలని ఎపిఇఎస్‌పి ద్వారా ఇన్‌వెస్టిగేషన్ జరుగుతుంది. వారు చేసిన ఇన్‌వెస్టిగేషన్ ద్వారా ఈ రు.32 కోట్లు ప్రాజెక్టు తయారు చేశారు. ఇంకా పరిశీలన చేయాలి. హడ్కో నుండి, నాబార్డు నుండి ఈ నిధులు స్వీకరించడానికి రికమండ్ చేసి ఆ నిధులు వచ్చిన తరువాత మున్సిపల్ కార్పోరేషన్‌లో ఈ కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుంది. తమరు చెప్పినట్లుగా చాలా మున్సిపాలిటీల గురించి అడిగారు. మా దగ్గర సమాచారం ఉంది. ఇన్‌వెస్టిగేషన్ కార్యక్రమం ఒకటవ, రెండవ గ్రూప్ ఏర్పాటు చేసి మున్సిపాలిటీలను ఒక సంస్థ ద్వారా ఇన్‌వెస్టిగేషన్ చేయడం జరుగుతుంది. ఇవ న్నీ కావాలంటే సెపరేట్ క్వశ్చన్ వేస్తే తప్పకుండా సమాధానం ఇవ్వగలను. గద్వాల్ విషయంలో ఒక ప్రత్యేక కార్యక్రమం రూపొందించాము. ఆ కార్యక్రమం అమలు చేస్తాము. కర్నూలు విషయంలో ఇన్‌వెస్టిగేషన్ అయిపోయిన తరువాత నిధులు మంజూరు అయిన తరువాత అభివృద్ధి చేయాలని కావలసిన ఏర్పాట్లు చేయాలని, మంచినీరు ఇవ్వడానికి ప్రయత్నం చేస్తామని మీ ద్వారా ప్రయత్నం చేస్తున్నాము.

శ్రీ ఎన్. మోహన్ రెడ్డిః అధ్యక్షా, మంత్రిగారు సమాధానంలో డిఎఫ్ఐడి ఫండ్సు వాడలేదని చెప్పడం సమంజసం కాదు. కాంగ్రెసు ప్రభుత్వం వచ్చిన తరువాత రెండువేలసంవత్సరంలో తెలుగుదేశం ప్రభుత్వం ఉన్నప్పుడు రు.32 కోట్లు శాంక్షన్ అయ్యాయి. నాలుగు సంవత్సరాల వ్యవధిలో తెలుగుదేశం ప్రభుత్వం ఉన్నప్పుడు రు.3 కోట్లు ఖర్చు పెడితే కాంగ్రెసు ప్రభుత్వం వచ్చిన తరువాత రు.8 కోట్లు ఖర్చు పెట్టాము. మరో రు.7 కోట్లు శాంక్షన్ అయ్యాయి. చాలా చక్కగా వర్క్ చేశాము. టెండర్సు రు.3 కోట్లకు కాల్‌ఫర్ చేశారు. ఎవరూ రావడం లేదు. డ్రెయినేజి ఒకటే పిలుస్తున్నారు. ఏ కాంట్రాక్టరు రాలేదు. వరల్డ్ బ్యాంకు నిధులు ఇచ్చేటప్పుడు రోడ్సు, డ్రెయినేజి కలిపి ఇవ్వాలని అడుగుతున్నాము. డిఎఫ్ఐడి స్లమ్ ఏరియాస్‌కి మాత్రమే అంటున్నారు. వంద శాతం స్లమ్ ఏరియాస్‌కు వేసే రోడ్సు, వాటర్‌లైన్సు, కరెంటు ఇస్తు న్నప్పుడు అండర్‌గ్రౌండ్ డ్రెయినేజి వ్యవస్థను కలిపి ఇస్తే మురుగునీటి పారుదల నుండి విముక్తులను చేసిన వారము అవుతాము. ముఖ్యమంత్రిగారు నగరబాటకు వచ్చినప్పుడు రు.2.50 కోట్లు శాంక్షన్ చేశారు.

ఉ. 10.40

మరి ఆర్ అండ్ బి మినిస్టర్ గారు రెండు కోట్ల యాభై లక్షలు ఇచ్చారు కాని రోడ్డు నుండి ఆ బ్రిడ్జి వరకు వచ్చే దారికి ఇచ్చిన నిధులు ఒక కోటి ఎనభై లక్షలు ఇప్పటి వరకూ శాంక్షన్ కాలేదు. కాబట్టి ఆ బైస్ పాస్ రోడ్డుకు కావలసిన నిధులు వెంటనే శాంక్షన్ చెయ్యాలని మీ ద్వారా ఆర్ అండ్ బి మినిస్టర్ గారిని, ముఖ్యమంత్రి గారిని కోరుతున్నాను.

శ్రీ కోనేరు రంగారావు: అధ్యక్షా, గౌరవసభ్యులు చెప్పిన విషయాన్ని దృష్టిలో పెట్టుకొని ఈ కార్యక్రమాన్ని పూర్తి చేస్తాము. డి.ఎఫ్.ఐ.డి అనేది ఒక స్పెసిఫిక్ సంస్థ. స్లమ్ డెవలప్‌మెంట్ కోసమే ఆ సంస్థ, ఇన్వెస్టిగేషన్ చేసి కార్యక్రమాన్ని అమలుజరుపుతారు. ఆ నిధులను డైవర్ట్ చేయడానికి మనకు అవకాశం లేదు. అట్లాగే, గౌరవసభ్యులు చెప్పినట్లుగా రోడ్లు, డ్రైనేజ్ లకు ఖర్చు పెట్టే విషయం పై తప్పకుండా వరల్డ్ బ్యాంకు నిధుల నుండి పరిశీలిస్తాము. ఏమాత్రం అవకాశం ఉన్నా తప్పకుండా ఆ నిధులను కేటాయించి, వారి చెప్పిన సమస్యలను పరిష్కరించడానికి ప్రయత్నం చేస్తాము.

MR. SPEAKER: Question No. 140-B(5325) has been postponed at the request of the Member.

## జీరో అవర్

శ్రీ జి. కిషన్‌రెడ్డి: అధ్యక్షా, నా కాన్స్‌టిట్యుయెన్సీలోని నారాయణగూడ బ్లడ్‌బ్యాంక్ చాలా ప్రాముఖ్యమైనటువంటి సంస్థ. ఇన్‌స్టిట్యూట్ అఫ్ ప్రివెంటీవ్ మెడిసిన్ అది చాలా బ్రహ్మాండమైన, పురాతనమైన సంస్థ. మన దేశంలోనే చాలా ప్రముఖమైనది. చాలా సంవత్సరాలుగా ఆ సంస్థ కుక్కకాటుకి సంబంధించిన యాంటీ ర్యాబిస్ వ్యాక్సిన్‌ను తయారుచేస్తుంది. కలరా, టి.బి వంటి వ్యాక్సిన్‌ను తయారుచేస్తున్న ప్రముఖ కేంద్రం అది. నాచారంలో దానికి యూనిట్ ఉంది. సుమారు యాభై ఎకరాల స్థలం ఉంది. కొన్ని కారణాల వల్ల దానిని ఇటీవల మూసివేయడం జరిగింది. దానిని పున: ప్రారంభించాలని, ఉత్పత్తిని పున: ప్రారంభించాలని కోరుతున్నాను. ఎక్కడైనా కుక్క కరిస్తే, ముందు ఇవ్వాలంటే వేరే కంపెనీల దగ్గర కొనవలసి వస్తుంది. దానికి సంబంధించినటువంటి యాభై ఎకరాలలో ముప్పై అయిదు ఎకరాల భూమిని బెంగుళూరుకు సంబంధించిన టెక్స్‌టైల్ కంపెనీకి అమ్మేస్తున్నట్లు వార్తలు రావడం జరిగింది. ఉద్యోగస్తులు కూడా ఆందోళన చేస్తున్నారు. వంద కోట్లు విలువ చేసే భూమిని 9 కోట్ల రూపాయలకు అమ్మేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇది చాలా అన్యాయం. ప్రభుత్వ భూమిని హైదరాబాదులో ఎక్కడికక్కడ ప్రైవేట్ వ్యక్తులకు ధారాదత్తం చేస్తున్నటువంటి ప్రభుత్వ విధానం చాలా అన్యాయం. పేదలకు వైద్యం అందించే ఈ ఇన్‌స్టిట్యూట్‌కు సంబంధించిన భూమిని అమ్మివేయకుండా ప్రభుత్వం వెంటనే ఆదేశాలు లేదంటే ప్రభుత్వం తీవ్రమైన పరిణామాలను ఎదుర్కోవలసి వస్తుందని మనవి చేస్తున్నాను.

SRI K. ROSAIAH: Sir, I have noted down and necessary action will be taken.

శ్రీ కొమిరెడ్డి రాములు: అధ్యక్షా, నిన్నటి నుండి ఇంటర్మీడియేట్ ఎగ్జామ్స్ స్టార్ట్ అయ్యాయి. చాలా మంది విద్యార్థినీవిద్యార్థులకు కూర్చునే సదుపాయం లేకుండా కనీసం బేసిక్ ఎమినిటీస్ లేకుండా ఎగ్జామ్స్ నడిపిస్తున్నారు. కాబట్టి జరిగే ఎస్.ఎస్.సి ఎగ్జామ్స్‌కు ముందే చర్యలు తీసుకోవాలని మనవిచేస్తున్నాను. మహారాష్ట్ర ప్రభుత్వం, స్టూడెంట్స్ యొక్క హెల్త్‌ని దృష్టిలోపెట్టుకొని సాఫ్ట్ డ్రింక్స్‌ని అన్ని స్కూల్స్‌లో, కాలేజెస్‌లో బ్యాన్ చేసింది. అదే విధంగా మనం కూడా చెయ్యాలని మీ ద్వారా మంత్రి గారికి మనవి చేస్తున్నాను.

శ్రీ పిన్నమనేని వెంకటేశ్వరరావు: సార్, సభ్యులు చెప్పింది నోట్ చేసుకున్నాను. వెరిఫై చేసి నిధులు ఇప్పించే ఏర్పాటు చేస్తాము.

శ్రీ ఎల్. రాజారావు: అధ్యక్షా, గుంటూరు జిల్లా బాపట్ల మండలంలో 1926లో నాటి బ్రిటీష్ ప్రభుత్వం, షెడ్యూల్డ్ కులాలకు చెందిన ఆది ఆంధ్ర లకు కోపరేటీవ్ చట్ట ప్రకారం 2557 ఎకరాల భూమిని రిజిస్టర్ చేసి వారికి కేటాయించడం జరిగింది. ఈ విధంగా రిజిస్టర్ కాబడిన సొసైటీలు పదకొండు వరకు ఉన్నాయి. ఇందులో మూడు గ్రామాలకు చెందిన అంకన్నపాలెం, బేతంపూడి, దగ్గుపల్లి వారి పాలెం ఆది ఆంధ్ర సొసైటీల ఆధీనంలో వున్న భూములు మాత్రమే షెడ్యూల్డ్ కులాల ఆధీనంలో ఉన్నాయి. అగ్రకూలాలకు చెందిన

కొంతమంది పెద్దలు దానిని ఆక్రమించుకున్నారు. దానికి సంబంధించి హైకోర్టు ఉత్తర్వులు ఉన్నాయి. జిల్లా కలెక్టరు గారిచ్చిన ఉత్తర్వులు కూడా ఉన్నాయి. కాని ఏ ఉత్తర్వులు కూడా ఇంతవరకూ అమలుకాబడలేదు. బాపట్ల మండలంలో ఎన్ని ఆది ఆంధ్ర సొసైటీలు రిజిస్టర్ కాబడి ఉన్నాయి? వీటికి ఏ సర్వే నెంబరు నుండి ఏ సర్వే నెంబరు వరకు భూములు కేటాయించనున్నారు, ఆ భూముల ఫలసాయం అనుభవిస్తున్న లబ్ధిదారులు ఎవరు అనేటువంటి అంశాలను తెలుసుకొనుటకు ఒక విచారణ కమిటీని ఏర్పాటు చెయ్యాలని తమరి ద్వారా రెవెన్యూ మంత్రి గారిని కోరుతున్నాను. అందుకు సంబంధించిన మెమోరాండంను పంపిస్తున్నాను.

శ్రీ ధర్మాన ప్రసాదరావు : అధ్యక్షా, నోట్ చేసుకున్నాను. నెససరీ యాక్షన్ కోసం డిపార్ట్‌మెంట్‌కి పంపిస్తాను.

శ్రీమతి డి.కె. అరుణ: అధ్యక్షా, గత నాలుగైదు రోజుల నుండి రాష్ట్రంలో చాలా చోట్ల అకాల వర్షాలు కురవడం వల్ల పంటలు, పండ్ల తోటలు నష్టపోయాయి. అదే విధంగా పిడుగులు పడడం వల్ల పశువులు, వందల గొర్రెలు చనిపోవడం జరిగింది. అటువంటి వాటికి ప్రభుత్వం ఏమైనా ఆర్థిక సహాయం అందజేస్తుందా, నష్టపరిహారం చేసే ప్రయత్నం చేస్తుందా అని మంత్రి గారిని అడుగుతున్నాను.

శ్రీ ధర్మాన ప్రసాదరావు: అధ్యక్షా, నోట్ చేసుకున్నాను. సంబంధిత కలెక్టర్స్ నుండి నివేదికలు వచ్చినతరువాత తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

శ్రీ గుమ్మడి నర్సయ్య (ఇల్లందు) : అధ్యక్షా, మా నియోజక వర్గానికి హెడ్ క్వార్టర్ అయినటువంటి పట్టణం ఇల్లెందు. 130 సంవత్సరాల నాడు నిర్మాణం అయినటువంటి పట్టణం. ఇక్కడ సింగరేణి సంస్థ కూడా అదే కాలంలో ప్రారంభం అయింది. దేశం మొత్తం మీద ప్రప్రథమంగా ఇల్లెందులో సింగరేణి సంస్థ భూమి నుండి బొగ్గును బయటకు తీయడం మొదలు పెట్టారు. అప్పటి నుండి గవర్నమెంట్ ఎంత భూమి ఆ కంపెనీకి అప్పజెప్పిందో తెలియదు గాని అండర్‌గ్రౌండ్‌గా నడిచిన ఈ కంపెనీ ఓపెన్‌గా గనులను ప్రారంభం చేసి, ఆ ఇల్లెందు పట్టణాన్ని కబళించడం కోసం ప్రయత్నం చేస్తున్నారు. ఈ విషయంలో జననివాసం ఉంటున్న ప్రాంతాన్ని క్రమబద్ధీకరణ చేయమని చెప్పి కలెక్టర్ గారికి అక్కడ ఉన్నటువంటి రెవెన్యూ అధికారులకి, ముఖ్యమంత్రి గారికి, సి.యం.డి గారికి రిప్రజెంట్ చేసాము. అక్కడ ఆందోళన చేసాము. అట్లాగే గవర్నమెంట్ 874 పక్కా గృహాలు మంజూరు చేసింది. ఆ పరిధిలో గుడిసెలు వేసుకొని కిరాయి ఇళ్లలో ఉన్నటువంటి వాళ్లు, ఇళ్ల నిర్మాణం కోసం ఆ స్థలాలలో ఇళ్లు కట్టుకోడానికి మా గవర్నమెంట్ ఇళ్లు మంజూరుచేస్తే ఇప్పటికి ఎన్ని మెమోరాండమ్స్ ఇచ్చినా, ఎంత మొర పెట్టుకున్నా స్పందన లేదు. సింగరేణీ తరపు అధికారులు ఆ నిర్మాణాన్ని ఆపు చేస్తున్నారు. ఆ పక్కా గృహాలను ఆపేసారు. ఇప్పుడు క్యాన్సిల్ అయిపోతున్నాయని, కలెక్టర్ గారు, డియం గారు చెబుతున్నారు. అక్కడ ఇళ్లు మొదలు పెట్టి, నిర్మాణం చేసుకోవాలనుకుంటే సింగరేణి వాళ్లు అడ్డం వస్తున్నారు. ఆ ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసి, సింగరేణి వాళ్ల నుండి ఆ భూమిని క్రమబద్ధీకరణ చేసి, జననివాసం ఉన్నటువంటి ప్రాంతాన్ని వదిలేసి, వాళ్ల ప్రాజెక్టుని కొనసాగించుకోమని చెప్పి మీ ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

శ్రీ ధర్మాన ప్రసాదరావు: అధ్యక్షా, నోట్ చేసుకున్నాను. తగిన చర్యలు తీసుకుంటాము.

శ్రీ పి. సుభాష్‌చంద్రబోస్ (రామచంద్రాపురం): స్పీకర్ సార్, తూర్పుగోదావరి జిల్లా ద్రాక్షారామంలో పోలీస్ స్టేషన్ లో క్రైమ్ నెం. 74, ఆగష్టు 2వ తేదీన, 2005లో కేసు రిజిస్టర్ అయ్యింది. అండర్ సెక్షన్ 307,302, 201, 34 of murder cases. అప్పుడే మర్డర్ జరిగి ఏడు నెలలు పూరి కావొస్తుంది. ఇప్పటి వరకూ దాంట్లో ప్రైమ్ ఎక్యూజ్డ్ పప్పుల వెంకన్నను అరెస్ట్ చేయడానికి ప్రభుత్వం ఇప్పటివరకూ చర్యలు తీసుకోలేదు. Local Police are well aware the movements of the prime accused. చట్టం రౌడీషీటర్సును, సంఘంలో ఉన్న పెద్దవాళ్ల పై ఏ విధమైన చర్యలు తీసుకోవడం లేదు. తక్షణమే చర్యలు తీసుకోకపోతే పోలీసు వ్యవస్థకే సిగ్గుచేటు. శాంతిభద్రతలకు విఘాతం కిలిగే పరిస్థితులున్నాయి. దయచేసి ప్రైమ్ అక్యూజ్డ్‌ని వెంటనే అరెస్ట్ చెయ్యాలని, అవసమైన చర్యలు తీసుకోవలసింగా గౌరవ హోం మంత్రి గారిని కోరుతున్నాను.

శ్రీ ధర్మాన ప్రసాదరావు : అధ్యక్షా, నోట్ చేసుకోవడం జరిగింది. సంబంధిత మంత్రి గారికి పరిశీలన నిమిత్తం పంపిస్తాము.
ఉ 10.50

శ్రీ కె.పి. కొండా రెడ్డి:- అధ్యక్షా, ఈ ప్రశ్న పశు సంవర్థక శాఖా మంత్రి గారికి సంబంధించినది. మార్కాపురం నియోజక వర్గంలో మొన్న మూడవ తేదీన శుక్రవారం రాత్రి భారీ వర్షాల మూలంగా ఎర్రగొండ పాలెం మండలంలో దాదాపు ఎనిమిది గ్రామాలు చాలా దెబ్బ తిన్నాయి. పంటలు విపరీతంగా నష్టపోయాయి. రాళ్లవాగు కొండ ప్రాంతం చివరి కాలువ లో నీళ్లు ఉధృతంగా వచ్చినందువల్ల మురారిపురం చెరువులో ఉన్న సుగాలి చెంచు జాతుల వారి ఆవులు, బర్రెలు, ఎద్దులు చనిపోయాయి. 517 ఆవులు, 285 గొర్రెలు, 27 కోడెలు, 3 బర్రెలు మొత్తం 832 పశువులు చచ్చిపోయాయి. రు.50 లక్షలు నష్టం జరిగింది. ప్రతి ఆవు ఖరీదు రు.3 వేలు, ప్రతి గొర్రె, మేక ఖరీదు రు.3 వేలు. దాదాపు రు.50 లక్షలు నష్టం జరిగింది. ఈ ఆస్తులన్నీ సుగాలి జాతుల వారివి, కొండ ప్రాంతం వారివి. కాబట్టి తప్పనిసరిగా నష్ట పరిహారం ప్రభుత్వం ద్వారా ఇవ్వవలసిందిగా కోరుతున్నాను.

శ్రీ జి. సూర్యారావు:- నోట్ చేసుకున్నాను. సంబంధిత అధికారికి చర్యల కొరకు ఆదేశాలు ఇవ్వడం జరుగుతుంది.

శ్రీ తోట గోపాలకృష్ణ (పెద్దాపురం ):- అధ్యక్షా, సిమెంట్ రేటు ఎస్ఎస్ఆర్ రేటు ప్రకారం రు.125 లు, అదే మార్కెట్ రేటు రు.158/- లు. మార్కెట్ రేటు 20 ఎమ్ఎమ్ సైజ్ మెటల్ రు.4600 లు లారీ లోడ్ అవుతుంది. రు.6000 లు మార్కెట్ రేటు. ఐరెన్ ఛార్జీలు ఇష్టం వచ్చినట్లు పెరుగుతున్నాయి. ఈ పనులు అన్నీ మార్చి నెలాఖరులోపల కావాలని చెప్పారు. కానీ ఈరోజు పరిస్థితి చూస్తే కంట్రాక్టర్లు ఆ రేటుకు కొనే పరిస్థితి లేదు. కాబట్టి ఐరెన్ కానీ, సిమెంట్ కానీ మార్కెట్ రేటు ప్రకారం మన డిపార్ట్‌మెంట్ ద్వారా సప్లయ్ చేసినా ఫర్వాలేదు. ఇంకో విషయం ఏమంటే మార్చి నెలాఖరు అని కాకుండా ఏప్రిల్ నెలాఖరు వరకు ఈ వర్క్సును పొడిగించవలసిందిగా కోరుతున్నాను.

శ్రీ జక్కంపూడి రామ్మోహన్ రావు:- నోట్ చేసుకున్నాను.

శ్రీ చల్లా రామకృష్ణా రెడ్డి (కోయిలకుంట్ల):- అధ్యక్షా, ఆరు స్టార్డ్ క్వశ్చన్స్ పోయిన తరువాత చివరకు ఈ సెషన్‌లో జీరో అవర్‌లో ఈ రోజు అవకాశం వచ్చింది. ఇది హౌసింగ్ మినిస్టర్ గారికి సంబంధించినది. ఇందిరమ్మ పథకం క్రింద ఒక మండలాన్ని ఒక యూనిట్‌గా తీసుకుని one third of the population కు గృ హనిర్మాణం చేపట్టడానికి అవకాశం కల్పిస్తున్నాము. ప్రభుత్వానికి నా రిక్వెస్ట్ ఏమంటే మిగిలిన two third లో ఇప్పుడు ప్రస్తుతం మనకు డిఆర్‌సి కోటా కానీ, ఎమ్ఎల్ఏ కోటా కానీ ఇప్పుడు ఇందిరమ్మ పథకం అమలు అవుతోంది కాబట్టి ఇది అమలు కావడం లేదని తెలుస్తున్నది. దయ ఉంచి తమరి ద్వారా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసేది ఎమ్ఎల్ఏకు అంతకు ముందు 500 ఇచ్చేవారు. డిఆర్‌సి కి 500 ఇచ్చేవారు. కనీసం 50 శాతం అయినా ఇస్తే కొంతవరకు మనం సాటిస్‌ఫై చేయడానికి అవుతుంది. ఇప్పుడు ఇస్తే కానీ మళ్లీ ఇందిరమ్మ పథకం నెక్స్ట్ స్కీమ్‌లో అది వచ్చినప్పుడు వీటిని ఇవ్వడానికి అవకశాం ఉండదు. దాని వల్ల మనకు వచ్చే నష్టం ఉండదు. లేదంటే కాలయాపన జరుగుతుంది. అన్యాయం జరుగుతుంది. ఒకవేళ ఫుల్‌ఫ్లెడ్జ్‌డ్‌గా 500+500 డిఆర్‌సి లో ఎమ్ఎల్ఏలకు ఇచ్చే కోటాలో ఇచ్చేది ఇవ్వలేకపోయినా 50 శాతం ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నాను. దీనికి స్పెసిఫిక్‌గా ఆన్సర్ తెలియజేయాలని కోరుతున్నాను.

*(కాంగ్రెస్ శాసన సభ్యుల నుంచి చప్పట్లు)*

శ్రీ ధర్మాన ప్రసాద రావు:- ఇది జీరో అవర్. నోట్ చేసుకున్నాను. వారి అభిప్రాయాన్ని సంబంధిత మంత్రి గారికి పంపించడం జరుగుతుంది. తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

శ్రీ మందాడి సత్యనారాయణ రెడ్డి (హన్మకొండ) :- అధ్యక్షా, ఈ సభలో నిన్న మా తెలంగాణా రాష్ట్ర సమితి ఎమ్ఎల్ఏలను అందరినీ కూడా సస్పెండ్ చేశారు. నేను మీ ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను. మేము ఈ ప్రభుత్వ పార్టీగా కేంద్రంలో మిత్ర పక్షంగా ఉన్నాము. ఇక్కడ కూడా మొన్నటి దాకా మిత్రపక్షమే. నిన్నా ఇవ్వాళ చూడబోతే పొయ్యిలో ఉప్పు వేసినట్లు చిటపట మంటున్నది. మా సభ్యులను బయట ఉంచడం బాగుండదు. కాబట్టి మా వారి సస్పెన్షన్‌ను ఎత్తి వేయాలని కోరుతున్నాను.

MR. SPEAKER: It is a Zero Hour appeal. It is an appeal which is there.

All the papers are deemed to have been laid on the Table of the House.

## సభా సమక్షంలో ఉంచిన పత్రములు

1. A copy of the Annuial Report of Andhra Pradesh State Minorities Corporation for the year 2004-2005, as required under Section 13 of Andhra Pradesh State Minorities Commission Act, 1998,

2. A copy of the Report and Accounts of Andhra Pradesh State Minorities Finance Corporation Limited for the year 2000, in compliance with Section 619-A of the Companies Act, 1956, along with reasons for delay and

3. A copy of the 27th Annual Report of Andhra Pradesh State Civil Supplies Corporation Limited for the year 2001-2002, in compliance with Section 619-A of the Companies Act, 1956.

Now Tea Break for ten minutes.

(The House adjourned for Tea Break for ten minutes, at 10.56 a.m.)

## THE HOUSE REASSEMBLED AT 11.26 A.M.

**(HON'BLE SPEAKER IN THE CHAIR)**

(INTERRUPTIONS FROM SRI P. JANARDHAN REDDY)

## 2006-2007సంవత్సరానికి వార్షిక ఆదాయ – వ్యయ పట్టిక (బడ్జెటు) పై

గ్రాంట్ల కొరకు అభ్యర్థన – నాల్గవరోజు

అభ్యర్థన నెం. **XXIV (24)** - అల్ప సంఖ్యాక వర్గాలు

అభ్యర్థన నెం. **XXV (25)** - మహిళా, శిశు సంక్షేమం, వికలాంగుల సంక్షేమం

అభ్యర్థన నెం. **XVIII (18)** - గృహ నిర్మాణం

అభ్యర్థన నెం. **XXI (21)** - సాంఘిక సంక్షేమం

అభ్యర్థన నెం. **XXII (22)** - గిరిజన సంక్షేమం

అభ్యర్థన నెం. **XXIII (23)** - వెనుకబడిన తరగతుల సంక్షేమం

(ప్రతిపాదించబడినవి)

MR. SPEAKER: Now, I will take up Demands for Grants.

SRI MOHD. FAREEDUDDIN: Speaker sir, I beg to move :

" That the Government be granted a sum not exceeding Rs.69,59,80,000/- under Demand No.XXIV (24) - Minority Welfare. "

SMT N. RAJYA LAKSHMI: Speaker sir, I beg to move:

" That the Government be granted a sum not exceeding Rs.617,72,54,000/- under Demand N.XXV (25) - Women, Child and Disabled Welfare. "

SRI K. JANA REDDY: Speaker sir, I beg to move:

" That the Government be granted a sum not exceeding Rs.1824,08,90,000/- under Demand No.XVIII(18) - Housing. "

SRI D.S. REDYA NAIK: Speaker sir, I beg to move:

" That the Government be granted a sum not exceeding Rs.1553,83,85,000/- under Demand No.XXI (21) - Social Welfare. " and

" That the Government be granted a sum not exceeding Rs.656,20,75,000/- under Demand No.XXII (22) - Tribal Welfare. "

SRI D. SRINIVAS: Speaker sir, I beg to move:

" That the Government be granted a sum not exceeding Rs.391,03,59,000/- under Demand No.XXIII(23) - Backward Classes Welfare. "

MR. SPEAKER: Demands moved. The cut motion Nos.317 to 570 are deemed to have been moved.

ఉ.11.30

## సభా కార్యక్రమము

శ్రీ పి. జనార్ధన రెడ్డి : అధ్యక్షా, నిన్నటి రోజున హౌజ్‌ను నడవనీయకుండా ముఖ్యంగా తెలుగుదేశం పార్టీ వాళ్లు ఎక్కువుగా, సిపిఐ, సిపిఎం, టిఆర్ఎస్ వాళ్లు పోడియం దగ్గరకు వచ్చి, మేము ఉదయమే

అడ్జర్న్‌మెంట్ మోషన్స్ ఇచ్చాము అని పట్టుబడితే, మీరు ఫ్లోర్ లీడర్స్ అందర్నీ పిలిచి మాట్లాడారు. నేను అనుకుంటూ, ఏ స్పీకర్‌గారు కూడా ఇంత టైమ్ ఇచ్చి, ప్రతిపక్షనాయకుల్ని కన్విన్స్ చేసిన సంఘటన ఎప్పుడూ చూడలేదు. ప్రతిపక్ష నాయకులుగా మాకు కూడా అనుభవం ఉంది. బిఏసి, ఫ్లోర్ లీడర్స్ మీటింగులకు వెళ్లుతుండే వాళ్లము. కాని ఎప్పుడూ కూడా మీరు చేసినంతగా ప్రతిపక్షనాయకుల్ని ఏ స్పీకరూ కన్విన్స్ చేయలేదు. అయితే నిన్నటి మీటింగ్‌లో ఏమి జరిగిందో మాకు తెలియదు కాని, ఇక్కడకు వచ్చిన తరువాత తిరిగి మళ్లీ తెలుగుదేశం పార్టీ వాళ్లు రిపీట్ చేస్తుంటే అది భరించలేక రోశయ్యగారు సస్పెన్షన్ రిజల్యూషన్ మూవ్ చేశారు.....

శ్రీ జి. కిషన్‌రెడ్డి : భారమైన హృదయంతో ......

శ్రీ పి. జనార్ధనరెడ్డి : వారిది భారమైన హృదయం మీది, సంతోషకరమైన హృదయం.......సరే బాధతో మూవ్ చేయడం జరిగింది. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షం ఉండాలి. అది ఉన్నప్పుడే అసెంబ్లీలో చర్చలు జరగడం ప్రజాస్వామ్యంలో మంచి పద్ధతి, సాంప్రదాయం. కిషన్‌రెడ్డిగారికి తెలియదు కాని, మేము ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మేము హౌజ్‌లో ప్రొటెస్టు చేస్తూ ఉన్నప్పటికీ, అన్నీ ప్రొసీజర్ ప్రకారం జరిగిపోతుండేవి, హౌజ్ నడుస్తూనే ఉండేది. బిల్లులు అన్నీ పాస్ చేసుకున్న సంఘటనలున్నాయి. మేము బయటకు వెళ్లిపోయిన తరువాత చంద్రబాబునాయుడుగారు తరువాత మమ్మల్ని తిట్టని తిట్టు తిట్టకుండా తిట్టేవారు. ఇప్పుడేమో వాళ్లు బయటకు వెళ్లిపోతూ, అసెంబ్లీలో సిఎల్‌పి మీటింగ్ పెట్టుకున్నారని అంటున్నారు. గతంలో వారు అధికారంలో ఉన్నప్పుడు ఇక్కడ ఒక లక్ష్మణ రేఖ కూడా గీశారు. ఎథిక్స్ కమిటీ అని ఆ రోజుల్లో పెట్టారు. వాళ్లు అధికారంలో ఉన్నప్పుడు అవన్నీ జ్ఞాపకం వస్తాయి, అధికారం నుండి పోయిన తరువాత జ్ఞాపకం రావు. గతంలో ప్రతిపక్షాన్ని సస్పెండ్ చేస్తే, సెక్యూరిటీ, మార్షల్స్ , పోలీసు వాళ్లు, ఇంటెలిజెన్స్ డిపార్టుమెంట్ వాళ్లు అసెంబ్లీలో ఎక్కడా మూవ్ కాకుండా బయట గేటు వరకు బలవంతంగా తీసుకునిపోతుండే వాళ్లు. మేము అప్పుడు ఏదోరకంగా స్పీకర్ దగ్గర వరకు వెళ్లుతుండేవాళ్లము. అయితే తొమ్మిది సంవత్సరాల మూడు మాసాలపాటు ముఖ్యమంత్రిగా ఉండి, అంతకంటే ముందు కాంగ్రెస్ పార్టీ ఎం.ఎల్.ఏ.గా, మంత్రిగా ఉన్న చంద్రబాబునాయుడు నిన్న సస్పెండ్ అయిన తరువాత....

మిస్టర్ స్పీకర్ : మీరు ప్రివిలేజ్ నోటీసు ఇచ్చారు. It is under my consideration. కూర్చోండి.

శ్రీ పి. జనార్ధన రెడ్డి : ...సస్పెండ్ అయిన తరువాత అసెంబ్లీ లోపలకు వచ్చే దారిలో కూర్చొని, ఎప్పుడైనా అయిదు, పది నిమిషాలు స్టెప్స్ మీద కూర్చొన్న సందర్భాలు ఉన్నాయి, కాని ఈ విధంగా చాలా సేపు కూర్చొని, మమ్మల్ని లోపలికి పోనీయకుండా అడ్డుపడటం జరిగింది. అక్కడ మైక్ పట్టుకుని ఉపన్యాసం ఇచ్చారు. ఆయన నిజాం గ్రౌండ్‌లో జరిగే పబ్లిక్ మీటింగ్ అనుకున్నాడో ఏమో నాకు తెలియదు కాని ,అసెంబ్లీ ప్రెమిసెస్‌ను ఈ విధంగా దుర్వినియోగం చేయడం ఎంతవరకు కరుక్టు అని అడుగుతున్నాను. మైక్ పట్టుకుని మాట్లాడుతున్నట్లుగా మీడియాలో కూడా వచ్చింది. నేను పర్సనల్‌గా కూడా చూశాను. టి.వి.లో చూశాను. కావున నేను మనవి చేసేదేమిటంటే, ఒక అనుభవం గల వ్యక్తి, ముఖ్యమంత్రిగా పనిచేసిన ఒక వ్యక్తి ఈ విధంగా చేస్తే, మీరు చర్య తీసుకోవలసిన అవసరం ఉంది. దాని మీద నేను ప్రివిలేజ్ నోటీసు ఇచ్చాను......

MR. SPEAKER: It is under my consideration. నేను ఎగ్జామిన్ చేయిస్తాను.

శ్రీ పి. జనార్ధనరెడ్డి : వినండి సార్., మీరు చేస్తారు. చేయవలసిందే. నాకు ఒక నిమిషం టైమ్ ఇవ్వండి. ఆ విధంగా చంద్రబాబునాయుడు మైక్ పట్టుకుని మాట్లాడుతుంటే దాన్ని తమాషాగా చూసిన వారి మీద చర్య తీసుకోవాలి. ముఖ్యంగా మార్షల్ మీద, వేరే పోలీసు అధికారుల మీద చర్య తీసుకోండి. బహుశా ఆ సమయంలో చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నారనుకొన్నారో, ఏమో.....

మిస్టర్ స్పీకర్ : మీరు నోటీసు ఇచ్చారు. అది నా కన్సిడరేషన్‌లో ఉంది. కూర్చోండి.

శ్రీ పి. జనార్ధన రెడ్డి : సార్ అసెంబ్లీకి సంబంధించినంతవరకు స్పీకర్ హెడ్. అసెంబ్లీ ప్రెమిసెస్‌ను ఎవరు దుర్వినియోగం చేసినా, మంత్రులు చేసినా, ఎవరు చేసిన తప్పే. దీని మీద వెంటనే చర్య తీసుకోవాలి. బాధ్యులైన అధికారుల మీద చర్యలు తీసుకోవాలి.

MR. SPEAKER: It is under my consideration. నేను ఎగ్జామిన్ చేయిస్తాను. Then I will give my decision.

(ఈ దశలో శ్రీ జి. కిషన్‌రెడ్డి మాట్లడటానికి ప్రయత్నించారు )

కిషన్‌రెడ్డిగారు, మీరు ఇచ్చిన ప్రివిలేజ్ నోటీసు కూడా నేను ఇప్పుడే రిసీవ్ చేసుకున్నాను. It is under my consideration. You can just mention about it.

శ్రీ జి. కిషన్‌రెడ్డి : అధ్యక్షా, నేను ఈ రోజు రెండు ప్రివిలేజ్ నోటీసులిచ్చాను. ఒకటి, నిన్నటి రోజున ఆర్థిక శాఖ మంత్రిగారు మాట్లాడుతూ, సమాచార హక్కు చట్టం ఉన్న కారణంగా సభలో ఫైల్స్ పెట్టలేకపోతున్నామని చెప్పడం జరిగింది. ఆ చట్టం వస్తే, సభలో ఫైల్స్ పెట్టకూడదని ఎక్కడా నిషేధం లేదు. కాని మంత్రిగారి సమాధానంలో ఆ రకంగా అర్థం వచ్చింది. సమాచార హక్కు చట్టం వల్ల అసెంబ్లీలో ఫైల్స్ పెట్టడం లేదంటూ వారు సభను తప్పుదోవ పట్టించే విధంగా చెప్పారు కాబట్టి, ఆ విషయ మీద నేను నోటీసు ఇచ్చాను. ఇంకొకటి, తెలుగుదేశం పార్టీకి చెందిన దేవేందర్‌గౌడ్‌గారు లేవనెత్తిన అంశాల మీద గొడవ జరిగిన సందర్భంగా మీరు అసెంబ్లీలో డిక్లేర్ చేయడమయింది. ఫ్లోర్ లీడర్స్ మీటింగ్‌లో కూడా మీరు మాట్లాడటం జరిగింది. ఏమిటంటే, నేను ప్రభుత్వాన్ని క్లారిఫికేషన్ అడుగుతాను,దీని మీద రిపోర్టు ఇవ్వమని అడుగుతాను అని....

MR. SPEAKER: Yes, you have made your point.

శ్రీ జి. కిషన్‌రెడ్డి : అయితే నిన్న ముఖ్యమంత్రిగారు మాట్లాడుతూ, voluntarily మేము మీకు ఇన్‌ఫర్మేషన్ ఇస్తున్నామని చెప్పారు. అంటే మీరు చెప్పిన దానికి, వారు చెప్పిన దానికి తేడా ఉంది. మీరు రూలింగ్ ఇచ్చారు. దానికి వ్యతిరేకంగా ముఖ్యమంత్రి చెప్పారు. ఈ రెండు అంశాల మీద నేను ప్రివిలేజ్ నోటీసులు ఇచ్చాను. తప్పకుండా వీటి మీద చర్య తీసుకోవలసిందిగా కోరుతున్నాను.

శ్రీ ఎన్. కిరణ్ కుమార్ రెడ్డి (వాయల్పాడు) : అధ్యక్షా, నిన్న మీ దగ్గర జరిగిన మీటింగ్‌లో ఫైనాన్స్ మినిస్టర్‌గారు ఒక సజేషన్ మాత్రమే ఇచ్చారు. How can that become a privilege of the House?

MR. SPEAKER: He has given a privilege motion. It is under my consideration and after examination I will decide whether it is a privilege or not.

శ్రీ ఎన్. కిరణ్‌కుమార్ రెడ్డి : ఒక సజేషన్ ఇచ్చింది ప్రివిలేజ్ ఎట్లా అవుతుంది? ఏది ప్రివిలేజ్ అవుతుంది, ఏది కాదు అనే అంశాన్ని మీరు ఖచ్చితంగా ఎగ్జామిన్ చేయవలసిన అవసరం ఉంది. It is not a privilege of the House.

MR. SPEAKER: I will examine it and I will give my decision.

శ్రీ గాదె వెంకట రెడ్డి (బాపట్ల ): స్పీకర్ సార్, జనరల్‌గా ప్రివిలేజ్ నోటీసు మీకు ఇవ్వడం, తరువాత దానిని ఎగ్జామిన్ చేసి, ప్రివిలేజెస్ కమిటీకి రిఫెర్ చేయడం అంటూ ఒక ప్రొసీజర్ ఉంది. రెండవది, ప్రొసీజర్ ఏమిటంటే, with the permission of the chair, a Member is entitled to raise this matter as a privilege issue. You have allowed it to mention on the Floor of the House. దీని విషయంలో కొన్ని సభా సాంప్రదాయాలున్నాయి. రూల్స్ అండ్ రెగ్యులేషన్స్ ఉన్నాయి. అసలు అసెంబ్లీ ఆవరణలో ఏదైనా మీటింగు పెట్టుకోవాలన్నా, ప్రెస్ కాన్ఫరెన్స్ పెట్టుకోవాలన్నా మనకు కమిటీ హాల్ నంబరు 3 ఉంది. అక్కడ పెట్టుకోవాలని మీరు చెప్పారు. కాని దానిని ఉపయోగించుకోకుండా, బయట మైక్ పట్టుకుని బహిరంగ ఉపన్యాసం ఇచ్చే సాంప్రదాయం, పద్ధతి చాలా గర్హనీయమైన విషయం. ముందుగా అటువంటి మీటింగ్ పెట్టుకోవడానికి మీ పర్మిషన్ తీసుకోవాలి. కాబట్టి దీని మీద మీరు రూలింగ్ ఇవ్వాలి. It comes under privilege and it comes under contempt of the House.

ఇకపోతే కిషన్‌రెడ్డిగారు ఇచ్చిన ప్రివిలేజ్ నోటీసు విషయానికి వస్తే, I would like to express my opinion. లోపల ఏమి జరిగింది ఏమిటీ కథా అనే దానిని ప్రక్కన పెట్టండి. మనకు ఒక హక్కు, ప్రజలకు ఒక హక్కు అనే పద్ధతిలో మాట్లాడటం ధర్మం కాదు. సభలో గాని, స్పీకర్ ముందు గాని ఫైల్స్ పెట్టాలా వద్దా అనేది స్పీకర్‌గారి discretionary power. ఉభయపక్షాలు కావాలనుకుంటే, స్పీకర్‌గారు ఇవ్వాలనుకుంటే, ఫైల్స్ పెట్టవచ్చు. అంతే తప్ప ప్రతి ఫైల్ స్పీకర్‌గారి ముందు పెట్టాలని, అపొజిషన్ పార్టీలకు చూపించాలని ఏ ప్రభుత్వాన్ని అయినా డిమాండ్ చేయడం ప్రజాస్వామ్యంలో నడవదు. అది మంచి పద్ధతి కాదని మీ ద్వారా మనవి చేస్తున్నాను. As far as Kishan Reddy's privilege motion is concerned, it does not come under privilege of the House.

MR. SPEAKER: The privilege motions given by both the Members are with me. నోటీసు మీరు ఇచ్చారు. కిషన్‌రెడ్డిగారూ, you were allowed to mention about it. మీరు మెన్షన్ చేశారు. దానిపైన ఏమి చేయాలో I will examine as to whether it comes under privilege or not and then I will inform you. So you leave it to the chair.

శ్రీ జి. కిషన్‌రెడ్డి : సార్ ....సార్ ....

MR. SPEAKER: You have already mentioned it. The matter is before the chair.

ఉ.11.40 srn/kbs

మిస్టర్ స్పీకర్ : మీ అభిప్రాయం చెప్పారు. The matter is before the chair. జనార్దన రెడ్డి గారూ, కిషన్ రెడ్డి గారూ మీరిచ్చిన ప్రివిలేజ్ నోటీసులు నా వద్ద ఉన్నాయి. I will examine it.

( గౌ. సభ్యులు శ్రీ జి. కిషన్ రెడ్డి నుంచి అంతరాయం)

As per the rules only one mention is allowed for the privilege motion. You have already mentioned about it. నేను పరిశీలించి మీకు తెలియజేస్తాను. I will examine it. You leave it to the chair. Now, no more on the subject.

శ్రీ కె. రోశయ్య : అధ్యక్షా, తమకు ఒకటే మనవి చేస్తున్నాను. నేను మాట్లాడింది సభా వేదిక మీద. రికార్డులలో ఉంది. తమరు సభాపతి. మీరు చూచి, దానిలో నేను అనుచితంగా గాని, సభను గాని, సభలో ఉన్న ఏ గౌరవ సభ్యుడిని గాని అగౌరవ పరిచే విధంగా మాట్లాడితే తమరు స్పీచి టెక్స్టును చూచి, నా ఎక్స్‌ప్లనేషను కూడా అడగక్కర లేదు, మీ ఇష్టం వచ్చిన చర్య తీసుకోండి. నాకు అభ్యంతరం లేదు. నేను సమాచార హక్కు, రైట్ ఆఫ్ ఇన్ఫర్మేషను చట్టం తెచ్చేక గౌరవ సభ్యులకు ఏది కావాలంటే ఆ సమాచారం అడిగే హక్కు ఉందని చెప్పాను. అది బహుశా సభాహక్కుల కిందకు ఎట్లా వస్తుందో నాకు తెలియదు.

ఒకటే మనవి చేస్తున్నాను. ఎక్కడైనా ఎవరైనా సభా హక్కులకు నోటీసు ఇచ్చే అవకాశం ఉంది, మీరు వెనకబడి ఇవ్వకుండా ఉండటం ఎందుకు, ఇవ్వడం మంచిదే. పరిశీలన చేసి, తాము ఏ తీర్పు అయినా ఫరదర్‌గా ఇవ్వవచ్చు. నా ఎక్స్‌ప్లనేషన్ అక్కరలేదు. నేను సభలో మాట్లాడిన ప్రతి మాట ప్రజాస్వామ్య బద్ధంగా మాట్లాడేను. స్పీకరు గారి అనుమతితో మాట్లాడేను, అంతేగాని స్పీకరు గారు పదే పదే కూర్చోమని చెబితే కూడా వినకుండా మాట్లాడే హక్కు నాకు లేదు.

శ్రీ జి. కిషన్ రెడ్డి : మీరు లేవగానే మీకు మైకు ఇస్తారు కదండీ.

SRI N. KIRAN KUMAR REDDY: Rule 150 of Rules of Procedure and Conduct of Business in the Andhra Pradesh Legislative Assembly says that " The right to raise a question of privilege shall be governed by the following conditions, viz., (I) not more than one question shall be raised at the same sitting. " ఒక్క ప్రివిలేజ్ మాత్రమే ఇవ్వవలసి ఉంటుంది. I would like to bring it to your notice.

MR. SPEAKER: The matter is very clear. The privilege motions are before me. కిషన్ రెడ్డి గారూ, మీరు ప్రివిలేజ్ నోటీసు ఇస్తూ మెన్షన్ చేయడానికి అవకాశం అడిగేరు. అవకాశం ఇచ్చాను. మీరు ఎవరిపైన ప్రివిలేజ్ ఇచ్చారో వారికి రైట్ ఉంటుంది. ఆ రైట్ ప్రకారం మెన్షన్ చేశారు. మీరు గాని, వీరు గాని ఫైనల్ కాదు. ఫైనల్ చేసేది స్పీకర్. నిర్ణయించేది స్పీకర్. మీరిచ్చిన ఇన్ఫర్మేషన్, everything is with me. పూర్తిగా ఎగ్జామిన్ చేసి, I will inform you, మళ్లీ దీనిని డిబేట్‌గా మార్చే వీలు లేదు. Now, I will take up discussion on Irrigation Demands.

శ్రీ జి. కిషన్ రెడ్డి : నేను చాలా క్లారిటీతో చెప్పాను. అసెంబ్లీకి ఉన్న విశేషమైన అధికారాలతో ఫైల్సు తెప్పించుకోవచ్చును. ప్రభుత్వం పెట్టడానికి అవకాశం ఉంది. మంత్రి గారు సమాచార హక్కు ఉంది కాబట్టి సమాచార హక్కులో ఇది లేదని సభను తప్పుదోవ పట్టించారు.

మిస్టర్ స్పీకర్ : మీరు గాని, మంత్రి గారు గాని నిన్న మాట్లాడిన ఇష్యూస్ గాని రికార్డులలో ఉన్నాయి. పరిశీలించి, I will give my decision. You leave it to the chair and the matter is closed now.

## 2006-2007సంవత్సరానికి వార్షిక ఆదాయ - వ్యయ పట్టిక (బడ్జెటు) పై చర్చ

**గ్రాంట్ల కొరకు అభ్యర్థన - నాల్గవరోజు**

**అభ్యర్థన నెం. XXXIII (33) - పెద్దతరహా, మధ్య తరహా నీటిపారుదల**

**అభ్యర్థన నెం. XXXIV (34) - అడవులు,పర్యావరణం శాస్త్ర సాంకేతిక విజ్ఞానం, చిన్న తరహా నీటిపారుదల**

**అభ్యర్థన నెం. XXXV (35) - సమాచారం, పౌర సంబంధాలు, ఇంధనం, బొగ్గు గనులు**

**అభ్యర్థన నెం. XI (11) - రోడ్లు, భవనాలు, ఓడరేవులు (కొనసాగింపు)**

శ్రీమతి గల్లా అరుణ కుమారి (చంద్రగిరి): అధ్యక్షా, ఆంధ్రప్రదేశ్‌ను అన్నపూర్ణ అంటారు. అలాంటి అన్నపూర్ణ కరువు అనే రక్కసి బారిన పడింది అధ్యక్షా. కష్టపడి, పంట పండించే రైతుల కుటుంబాలు విషాదంలో మునిగిపోయాయి. నీరే సకల జీవరాశులకు జీవనాధారము, అవసరము. గత పాలకులకు దూరదృష్టి లేని కారణంగా వారి అవగాహనాలోపం వల్ల గత 5 సంవత్సరాల కాలాన్ని ఉదాహరణగా తీసుకుంటే, ఆ దేవుడు ఇచ్చిన నీరు ఎలా వృధా అయిందో ఒకసారి పరిశీలిస్తే అర్థం అవుతుంది అధ్యక్షా.

కృష్ణా నీరు 2001లో 69 టిఎంసిలు, పెన్నా 44 టిఎంసిలు, గోదావరి 2884 టిఎంసిలు వృధా అయితే, కృష్ణా 2002లో 14 టిఎంసిలు, పెన్నా 128 టిఎంసిలు, గోదావరి 1773 టిఎంసిలులు వృధా అయ్యాయి. కృష్ణా నీరు 2003లో 16 టిఎంసిలు,గోదావరి 2985 టిఎంసిలు వృధా అయ్యాయి. 2004లో కృ

ష్ణా నీరు 16 టిఎంసిలు, గోదావరి 1674 టిఎంసిలు వృధాగా పోయాయి. 2005లో కృష్ణా 124.5 టిఎంసిలు, గోదావరి 3400 టిఎంసిలు వృధా అయ్యాయి.

గతంలో సాగునీటి పథకాలు, జలాశయాలు నిర్మించి వుంటే ఈ నీరు వృధా అయి వుండేది కాదు గదా అధ్యక్షా. ఆంధ్ర రాష్ట్రంలోని కరువుకు ప్రకృతి ఒక్కటే కారణం కాదు అధ్యక్షా. It is purely a man made calamity అధ్యక్షా. అంటే పాలకుల నిర్లక్ష్యమే కారణం. అందుకే రైతాంగం కోలుకోలేని దెబ్బ తింది.

అధ్యక్షా, ప్రజాస్వామ్యం నుండి ఒకనాటి రాజుల కాలాన్ని గుర్తుకు తెచ్చుకుంటే ఎంతో మంది రాజులు, రారాజులు, చక్రవర్తులు మన దేశాన్ని పరిపాలించారు. ప్రజాబంధువులుగా కొంతమంది చరిత్రలో మిగిలిపోతే, ప్రజారాబందులుగా కొంతమంది హీన చరితులయ్యారు. వేళ్ల మీద లెక్కించగలిగిన కొంతమంది పాలకులే దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారు. శతాబ్దాల కిందటే చెట్లను నాటించి రహదారులను నిర్మించి, చెరువులను తవ్వించి, సామాజిక స్పృహనే హృదయంగా మలచుకున్న అశోక చక్రవర్తి అందుకే ఆదర్శంగా నిలిచిపోయారు. ప్రజా సంక్షేమానికి పట్టాభిషేకం చేసిన రాజులు కొందరైతే సింహాసనం కోసం కాట్లాడుకున్న రాజులు ఉన్నారు. కానీ ఆ కాలంలో రాజుకు పట్టాభిషేకం చేసే ముందు ప్రజల విభిన్న సంస్కృతులు, స్థితిగతులు అవసరాలు, మానవ విలువలు తెలుసుకోమని రాజ్య పర్యటనకు పంపేవారు. అవగాహన కలిగిన వారే మంచి పాలకులవుతారని నమ్మకం. ఎప్పటికప్పుడు వేగుల ద్వారా ప్రజల కష్ట సుఖాలు తెలుసుకొని పాలన సరిదిద్దుకునేవారు. ప్రజల మధ్యకు మారు వేషాలలో వెళ్లి, సమా జ గమనాన్ని పరిశీలించి, ప్రణాళికలు రూపొందించేవారు.

1400 కిలోమీటర్లు పాద యాత్ర చేసి, కరువును వర్ణించడం కాదు, కరువు గురించి ఉపన్యాసాలు ఇవ్వడం కాదు, కరువును కళ్లారా చూడాలి. గ్రామీణ సమస్యల మీద కన్నీరు కార్చడం కాదు, కన్నీరు తుడవాలని కంకణం కట్టుకున్న మన ముఖ్యమంత్రి శ్రీ వై.ఎస్. రాజశేఖర రెడ్డి గారు మనిషి కనీస అవసరాలయిన, కూడు, గుడ్డ, నీరు ప్రతి మనిషికి అందించాలని, జన జీవన ప్రమాణాలు పెంచాలని, చివరి నిరుపేద మొహంలో సైతం చిరునవ్వు చూడాలని, భూమయినా, భూమి మీద మనిషి అయినా నీరు అందకపోతే నిరర్థకమన్న నగ్న సత్యాన్ని తెలుసుకుని, వ్యవసాయ సంక్షోభం నుంచి దేశానికి వెన్నెముక అయిన రైతును రక్షించడానికి నదుల నీరు వృధా కాకుండా సముద్రం పాలు కాకుండా బీడు భూములకు మళ్లించి, సిరులు పండేలా కృషి చేసే అభయ హస్తంగా, ప్రాజెక్టుల నిర్మాణమే యజ్ఞంగా, జలయజ్ఞంగా దీక్ష బూని, సత్ఫలితాలను సాధిస్తూ భగీరథులయినారు మన ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖర రెడ్డి గారు. అందులో భాగమే అధ్యక్షా, అనితరసాధ్యంగా ఎన్నికల మేనిఫెస్టో లో పొందుపరచిన విధంగా 26 మేజర్ ఇరిగేషన్ ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసి, ఈ సంవత్సరం 10 వేల కోట్ల రూపాయలు బడ్జెటులో కేటాయించి, 5 ఏళ్లలో పూర్తి చెయ్యాలని లక్ష్యంగా ఉంచుకోవడం ఆయన రైతు భక్తికి నిదర్శనం.

(శ్రీ యు. పురుషోత్తమ రెడ్డి అధ్యక్షస్థానంలో ఉన్నారు)

ఉ.11 . 50

ఈ ప్రాజెక్టులు పూర్తయితే ముఖ్యమంత్రి రాజశేఖర రెడ్డిగారు చరితార్థులుగా నిలిచిపోతారనేది నిజం . భావి తరాలకు ఆదర్శప్రాయులుగా నిలిచిపోవడం ఖాయం . గొప్పలు చెపుకున్న దేశం

సాగునీటికోసం 10 సంవత్సరాలలో ఖర్చుచేసింది కాంగ్రెస్ రెండు సంవత్సరాలలో ఖర్చుచేసింది . పదేళ్లలో రు . 10,348 కోట్లు దేశం ఖర్చుచేస్తే, రాజశేఖర రెడ్డిగారు రెండు సంవత్సరాలు నిండడానికి ఇంకా రెండు నెలలు వుండగానే రు 10,033 కోట్లు ఖర్చుపెట్టారు . దేశం మొత్తం మీద పరిశీలించితే 2005, 2006 లో సాగునీటి పారుదల రంగానికి అన్ని రాష్ట్రాలు కలిసి వ్యయంచేసిన మొత్తంలో 49 శాతం మన ఒక్క రాష్ట్రమే చేసింది . ఇదంతా రైతుబిడ్డగా రైతుల కష్టసుఖాలు తెలిసిన వ్యక్తిగా ప్రాధాన్యతను గుర్తించగలిగన శక్తిగా రాజశేఖర రెడ్డిగారు ఎదిగినందుకే ఇది సాధ్యమయింది . స్వాతంత్ర్యం వచ్చినప్పటినుండి ఇప్పటివరకు భారీ, మధ్య తరహా, సాగునీటి పారుదల రంగాల క్రింద మన ప్రభుత్వాలన్నీ కలిపి రు . 69 .38 లక్షల ఎకరాలకు నీటివసతి కల్పిస్తే, రాజశేఖర రెడ్డిగారి కాలంలో 2004 నుండి 2009 కు కేవలం ఐదు సంవత్సరాల కాలంలో 71 లక్షల ఆయకట్టును అదనంగా తీసుకువచ్చి నీటివసతి కల్పిస్తున్నారు . ఆరోపణలకు సమాధానంగా బహిరంగ చర్చావేదికలు పెట్టిన ఘనత మా ప్రభుత్వానికి మాత్రమే దక్కింది . అవినీతి, అక్రమం అంటూ ఆక్రోశించారు . ప్రాజెక్టులు పూర్తయితే పుట్ట గతులుండవని అరుస్తున్నారు . అభాండాలేస్తున్నారు . కానీ అభాసుపాలవుతున్నారు . అంతే కాదు ముఖ్యమంత్రి చిత్తశుద్ధితో ఆలోచిస్తున్న హరితాంధ్రప్రదేశ్‌ను ఎవ్వరూ ఆపలేరు . ఆపడం ఎవరికీ సాధ్యం కాదు .

రాయలసీమలో చిత్తూరు, కడప, కర్నూలు జిల్లాలకు చెందిన గాలేరు నగరి సుజల స్రవంతి ప్రాజెక్టు 3 . 25 లక్షల ఎకరాలకు సాగునీరుల అందించగలదు . కానీ దీని ప్రారంభ అంచనా రు . 1400 కోట్లయితే, తెలుగుదేశం ప్రభుత్వ హయాములో నిర్లక్ష్యానికి గురై, నేటి అంచనా రు . 4000 కోట్లకు చేరింది . చిత్తూరు, కడప, కర్నూలు, అనంతపురం జిల్లాల్లో 6 లక్షల హెక్టార్ల సాగునీరు అందించగలిగిన హంద్రీ నీవా ప్రాజెక్టు ప్రారంభ అంచనా రు 1479 కోట్లయితే, నేటి అంచనా మరో రు . 4000 కోట్లకు చేరింది . తెలుగుదేశం పార్టీ తమ కీర్తి పతాకంలో కలికితురాయి అని చెప్పుకునే తెలుగుగంగ కూడా రాజశేఖర రెడ్డిగారి చేతులమీదుగానే పూర్తవుతుంది .

ఎన్ని కష్టాలు ఎదురయినా , హంద్రీ నీవా, గాలేరు నగరి ప్రాజెక్టులను ఐదేండ్లకాలంలో పూర్తిచేయాలని మన ముఖ్యమంత్రిగారు దృఢసంకల్పంతో ఉన్నారు . అయితే, రాయలసీమలో ప్రత్యేకించి చిత్తూరు జిల్లా విషయానికి వస్తే సాగునీటికి సంబంధించి భిన్న పరిస్థితులు వునానయి . కోస్తా జిల్లాల్లో ప్రాజెక్టులు నిర్మించకముందు రైతులు చిత్తురు జిల్లాకు వచ్చి స్థిరపడేవారు . అంటే అప్పట్లో ఇక్కడ వ్యవసాయానికి అనుకూలమైన పరిస్థితులు ఉండేవి . ఇప్పుడు ఆ పరిస్థితి లేదు . కారణం, సాగునీటి వసతులైన చెరువులు, కుంటలు, వంకలు, వాగులు నిర్వహణకు నోచుకోలేదు . ఈ విషయంలో గత పదేండ్లుగా పాలకులు తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరించారు . ఈ జిల్లాలో మేజర్ ప్రాజెక్టులు గానీ, జీవనదులు గానీ లేవిషయం తెలిసిందే . వ్యవసాయం రంగం పూర్తిగా చెరువులు, కుంటలు పైన ఆధారపడి వుంది . ఈ సంత్సరం తెలుగుగంగకు రు . 500 కోట్లు, గాలేరునగరికి రు . 350 కోట్లు, హంద్రీ నీవాకు రు . 275 కోట్లు విడుదల చేయడం ఎంతైనా హర్షించదగిన విషయం .

అలాగే మా నియోజకవర్గంలో స్వర్ణముఖి, బీమ, కల్యాణి నదులు ఉన్నాయి . ఇటీవల కురిసిన వర్షాల వలన కల్యాణి డ్యాం నిండి స్వర్ణముఖిలో కలిసి వెళ్లిపోయింది . కల్యాణి డ్యాం సర్‌ప్లస్ నీటిని నాగపట్ల చెరువు, కొట్టాల చెరువులకు మళ్లించడానికి అంచనాలు తయారుచేయాలి . అలాగే బీమా నదిలో 6

చెక్‌డ్యాంలు ఉన్నాయి . ఇంకా 3 కట్టవలసిన అవసరం ఉంది . అలాగే స్వర్ణముఖి నది పాకాల, చంద్రగిరి, తిరుపతి రూరల్ మీదుగా ఈ నియోజవర్గంలో సుమారు 50 కిలోమీటర్ల పొడవున ప్రవహిస్తున్నది . ఈ నదిలో 30 చెక్‌డ్యాంలు కట్టేందుకు ప్రతిపాదన చేశాము . చంద్రగిరి మండలంలో 10 ఇరిగేషన్ చెరువుల క్రింద 2396 ఎకరాలు, పి . ఆర్ శాఖ పరిధిలో 7 చెరువుల క్రింద 168 ఎకరాలు ఆయకట్టు ఉంది . ఈ మండలంలో 12 పి . టిల నిర్మాణానికి ప్రతిపాదన చేశాము . పాకాల మండలంలో గత 30 ఏండ్లుగా అపరిష్కృతంగా ఉన్న రెండు కీలకమైన ప్రాజెక్టులకు నిధులు విడుదల చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది . వీటిలో ఒకటయిన దామలచెరువు, పాకాల సప్లయి ఛానెల్‌ను 1978 లో ప్రారంభించారు . అయితే ఈ కాలువలో గత ఏడాది వరకు నీరు పారలేదు . ఇటీవల కురిసిన వర్షాలకు నీరు వృధా అవుతున్నదని రైతులు నా దృష్టికి తీసుకువస్తే ఫ్లడ్‌డామేజ్ ఫండ్ క్రింద రు 5 లక్షలు శాంక్షను చేయించి ఈ పనులు పూర్తిచేయించి, 30 ఏండ్ల విరామానికి స్వస్తి పలికించాము . ఈ ఛానెల్ ద్వారా 6 చెరువులు నిండాయి . ఫలితంగా ప్రత్యక్షంగా , పరోక్షంగా వెయ్యి ఎకరాల భూమి సాగులోకి వచ్చింది . దీనిని స్ట్రెంగ్తెన్ చేయడానికి సర్మినెంట్‌గా సరిచేయడానికి అంచనాలు తయారుచేశారు . తప్పకుండా నదులు ఇవ్వాలని కోరుతున్నాను . అలాగే చింతలకోన వంక రిజర్వాయరుకు డబ్బు మంజూరు అయింది . పనులు వెంటనే ప్రారంభం చేయాలని కోరుతున్నాను . అలాగే మద్దినాయిని పల్లె నుండి పాకాల చెరువు వరకు ఉన్న వంకను అభివృద్ధి చేయాలి . దీని నుండి ఫీడర్‌ఛానెల్‌ను కూడా అభివృద్ధి చేయాలి . దామలచెరువు పెద్దవంకపై మరో 30 చెక్‌డ్యాంలు నిర్మించాలి . పాకాల పెద్దవంకపై 12 చెక్‌డ్యాంలు నిర్మించాలి . గత 10 సంవత్సరాలుగా ఈ పథకాలకు ఒక్క రూపాయి కూడా ఖర్చుచేయలేదు . అప్పుడే నీటిమీద దృష్టిసారించి ఉంటే ఇటీవల కురిసిన వానలకు అన్ని చెరువులు నిండి వుండేవి . కరువు మండలంగా పేరుగాంచిన పులిచెర్ల మండలంపై ప్రత్యేకదృష్టి సారించాలి . ఈ మండలంలో 40 చెక్‌డ్యాంలు నిర్మించాలని ప్రతిపాదించాము . అలాగే 20 పెర్కొలేషన్ ట్యాంకులు ప్రతిపాదించాము . వీటి నిర్మాణానికి నిధులు విడుదల చేయాలి . అలాగే కానుగల వంక పథకానికి నిధులు కేటాయించవలసిన అవసరం ఉంది . ఐరాల మండలంలోని 14 ఇరిగేషన్ చెరువులను బలోపేతం చేయాలి . నీటిలో పూడికను తొలగించడంతో పాటు లీకేజీను అరికట్టాలి . ఈ పనులను చేపట్టడానికి వెంటదే తగుచర్యలు తీసుకోవాలని కోరుతున్నాను . తిరుపతి రూరల్ మండలం పేరూరు వద్ద 388 ఎకరాల విస్తీర్ణం కలిగిన చెరువు వున్నది . దీనిక్రింద దాదాపు వేయి ఎకరాలకు ఆయకట్టుదారులు ఉన్నారు . దానికి సంబంధించి ఇటీవల ఆయకట్టుదారులకు అనుకూలంగా కోర్టు ఆ చెరువు చెరువుగానే ఉండాలని తీర్పు ఇవ్వడం జరిగింది . ఈ చెరువును అభివృద్ధి చేస్తే ఇటు రైతులకే కాక తిరుపతి అటు గాజుల మండ్యం వరకు సర్కులేట్ అవుతుంది . దీనివలన భూగర్భజలాలు పెరిగి బోర్ల ద్వారా కూడా నీటి వసతి పెరుగుతుంది కాబట్టి దీనికి సంబంధించిన పనులు చేపట్టాలని కోరుతున్నాను . మా నియోజకవర్గంలోనె కాదు చిత్తూరు జిల్లాలో మేజర్ ఇరిగేషన్ చాలా తక్కువ . అందునా మా నియోజకవర్గంలో జీవనదులు గానీ, పెద్ద ప్రాజెక్టులు గానీ లేవు . అంతా మైనర్ ఇరిగేషనకు సంబంధించినది . వీటన్నింటికీ కనీసం రు . 30 కోట్లు ఇస్తే కుంటలు, చెరువులు, కాల్వలు, చెక్‌డ్యాంలు అన్నీ బాగుచేసుకుని వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేయవచ్చు . రైతులందరూ సుఖసంతోషాలతో వర్థిల్లుతారు . 9 సంవత్సరాలు పరిపాలించిన గత ముఖ్యమంత్రి స్వంత జిల్లాకు, స్వంత నియోజవర్గానికి ఒరగబెట్టింది ఏమీ లేదు . సాగునీరు కాదుగదా, త్రాగునీరు కూడా దొరకని వస్తువయింది . కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత నీటిని ట్రాన్స్‌పోర్ట్ చేయడానికే నెలకు రు . 1,10,00,000 లు ఖర్చు అయింది . ప్రజల సమస్యలు చర్చించే అతి ఉత్తమ

వేదిక ఈ అసెంబ్లీ. మహిళలు, కొత్త ఎం.ఎల్.ఏలు, పెద్దవారు ఉదయం వచ్చి కూర్చుంటే, ఇక్కడ చేసే అల్లరిలో ఎడ్జర్న్ అవుతున్నది, అందరం ఇంటికి పోతున్నాము అధ్యక్షా.
మ.12.00

ప్రజా సమస్యలను చర్చించి ఒక పరిష్కారాన్ని కనుగొనే వేదిక మన అసెంబ్లీ అని అందరికీ తెలుసు. ఇక్కడ రభస తప్ప, సభ సజావుగా ఎక్కడ జరుగుతోంది ? ప్రతిపక్షమంటే ప్రతి విషయాన్ని పక్షపాతంగా మాట్లాడడమేనా ? ఆనాడు గోరంత చేసి కొండంత చెప్పుకున్నారు. పరుగెత్తే నీటికి నడక నేర్పాలి, నడిచే నీటిని ఆపాలి, ఆగిన నీటిని భూమిలో ఇంకేలా చూడాలని వినసొంపైన మాయ మాటలు చెప్పి, ప్రజా ధనాన్ని వారి పార్టీ కార్యకర్తల ఇళ్లల్లో ఇంకిపోయేలా చేసారు. పులిని చూసి నక్క వాతలు పెట్టుకున్నట్లుగా విదేశాలకు వెళ్లినపుడు ఆ దేశాలలాగ మన ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాన్ని తయారు చేస్తామని చెప్పేవారు.

ప్రతిపక్షాలు ఏ విషయాన్నైనా అడిగితే నిరసనలు వద్దు, ఎలక్షన్ల టైమ్‌లో తప్ప రాజకీయాలు వద్దు, కూర్చుని మాట్లాడుకుందాము, సమస్యను పరిష్కరించుకుందామని నటించేవారు. ఇప్పుడు కూడా కూర్చుని మాట్లాడుకోవచ్చు కదా ? మరి అసెంబ్లీని ప్రతిరోజూ స్టాల్ చేయడం ఎందుకు ? అసెంబ్లీని ఈ విధంగా స్పాయిల్ చేయడమెందుకు ? మనం అందరికీ ఆదర్శంగా వుండాలి, అనవసరమైన రభస చేయవద్దు, ప్రజలు చూస్తున్నారని చెప్పి 9 సంవత్సరాలూ గడిపేసారు. అసెంబ్లీలో ఇప్పుడు వారు చేస్తున్న వికృత చేష్టలను ప్రజలు చూడడం లేదా ? ప్రజలు 9 సంవత్సరాల పాటు చూసి చూసి విసిగిపోయారు కాబట్టే మిమ్మల్ని తప్పించారు. తప్పు తెలుసుకోని మీ వింత ప్రవర్తన చూసి వారు ఆశ్చర్యపోతున్నారు.

అసెంబ్లీని నడపాలంటే గంటకు ఇంత ఖర్చవుతుంది, నిమిషానికి ఇంత ఖర్చవుతుందని మీరు చెప్పిన లెక్కలని వారు ఇప్పుడు నెమరు వేసుకుంటున్నారు. పెద్దలు ఒక మాట అన్నారు. నీకు చేతనైతే కలసి రా, లేకపోతే వెనక్కి వెళ్లిపో అన్నారు. అంతే కాని మంచి పనులను చేస్తుంటే వాటిని ఆపడానికి ప్రయత్నించవద్దని అన్నారు. వారు చేయలేని మంచి పనులను మన ముఖ్యమంత్రి డా. వై.ఎస్.రాజశేఖర రెడ్డి గారు చేస్తూ వుంటే, మరి ఓర్వలేని తనమెందుకు ? ప్రాజక్టులు కట్టకుండా ఆనాడు తప్పు చేసారు. ఇప్పుడు ప్రభుత్వం కడుతున్న ప్రాజక్టులను ఆపి మరొక తప్పు చేస్తున్నారు. పంచభూతాలలో ఒకటైన నీటి మీద రాజకీయం మానుకోవాలని చెబుతున్నాను.

అనవసరమైన రాద్ధాంతాలను ఆపాలి. నేను చెప్పేది, ప్రార్థించేది ఒక్కటే. ఆ గంగమ్మ తల్లి ప్రతిపక్షాన్ని ఆవహించి వారి దృక్పథాన్ని మార్చాలని ప్రార్థిస్తున్నాను. ఆకాశ గంగను భూమి మీదకు తీసుకొచ్చేటపుడు భగీరథుడు కూడా ఎన్నో కష్టాలను ఎదుర్కొన్నాడని పురాణాలు చెబుతున్నాయి. ముఖ్యమంత్రి గారికి ఎన్నో సమస్యలు ఎదురవుతున్నాయి. అయినా పట్టు వీడని కార్యశీలతకు ప్రతీకగా నిలిచిన వారికి ఈ జలయజ్ఞంలో గంగమ్మ తల్లి తప్పకుండా వారి వెంటనే వుంటుందని, విజయం చేకూరుస్తుందని నమ్ముతున్నాము.

తరువాత ఈ చెరువు కట్టల వద్ద సాంకేతికమైన విధానాలు పాటించి లీకేజీలను అరికట్టాలని కోరుతున్నాను. పంట కాలవల సప్లయ్ ఛానెల్స్‌ను క్రమబద్ధీకరించాలని, విరివిగా చెక్ డ్యామ్స్‌ను, ఊట చెరువులను నిర్మించాలని, సహజంగా ఏర్పడ్డ ప్రతి ఒక్క వాగు, వంకలను సర్వే చేయించి, వాటిలోని ఆక్రమణలను తొలగించాలని, పూడికలు తీయించాలని, వీటి నుంచి చెరువులకు నీటిని సరఫరా చేసే ఫీడర్

ఛానెల్స్‌ను అభివృద్ధి చేయాలని, చెరువులను అనుసంధానం చేయాలని, ఇటువంటి చర్యలు చేపట్టినందువల్ల నీరు వృధా అవదని మనవి చేసుకుంటున్నాను.

ఇక ఎలక్ట్రిసిటీ విషయానికి వస్తే, అందరికీ తెలిసిన విషయమే, రోజూ చెబుతున్నామని అనుకుంటారేమో కాని, కాంగ్రెస్ పార్టీ విజయం సాధించి, డా. వై.ఎస్.రాజశేఖర రెడ్డి గారు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత రైతులకు అనుకూలంగా ఉచిత విద్యుత్‌పై తొలి సంతకం చేయడం జరిగింది. అట్లాగే చిత్తూరు జిల్లాలో 1,88,060 అగ్రికల్చర్ సర్వీసులకు గాను, రు.170.08 కోట్లను మాఫీ చేయడం జరిగింది. అట్లాగే, చిత్తూరు జిల్లాలో 1.93 లక్షల అగ్రికల్చర్ సర్వీసులకు గాను 1.79 లక్షల సర్వీసులకు ఉచిత విద్యుత్‌ను ఇవ్వడం జరిగింది.

చిత్తూరు జిల్లాలో రాజీవ్ గాంధీ గ్రామీణ పథకం ద్వారా ఇంటింటికీ విద్యుత్ పథకం క్రింద రు.36.53 కోట్లు మంజూరైంది. నా నియోజక వర్గంలో 10,980 అగ్రికల్చర్ సర్వీసులకు గాను రు.14.72 కోట్లు మాఫీ అయింది. 10,827 అగ్రికల్చర్ సర్వీసులకు ఉచితంగా సేవలను అందించడం జరుగుతోంది. రాజీవ్ గాంధీ గ్రామీణ పథకం ద్వారా నియోజక వర్గానికి రు.3.80 కోట్లు మంజూరైంది. గత 2 సంవత్సరాలలో 1200 ఎలక్ట్రిక్ పోల్స్‌ను మార్చడం జరిగింది. 3 ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్లు 50 ఇవ్వడం జరిగింది, సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్లు 170 మంజూరు చేయడం జరిగింది.

నేను చెప్పేది ఒక్కటే. ముఖ్యమంత్రి గారు 1600 కిలో మీటర్ల పాదయాత్ర ఏప్రిల్, మే నెలల్లో చేసారు. వేసవి కాలంలో ప్రజల స్థితిగతులు, కష్టాలు తెలుసుకున్నారు కాబట్టి శాసన సభ్యులందరికి కూడా అదే కార్యక్రమం ఇచ్చారు, ఆ ప్రకారంగా శాసన సభ్యులు ఏప్రిల్, మే నెలల్లో నియోజక వర్గాలు తిరగడం జరిగింది. జన్మభూమికీ, ప్రజాపథానికీ ఒకటే తేడా. జన్మభూమి కార్యక్రమం చేసేటపుడు ప్రతి మండలంలోనూ, ప్రతిరోజూ కార్యక్రమాలు వుండేవి. శాసన సభ్యులు వెళ్లి చూడాలంటే, ఒక మండలానికి వెళితే మరొక మండలానికి వెళ్లలేకపోయేవారు. కాని ప్రజాపథం కార్యక్రమంలో ఒక నెల మాకు టైమ్ ఇచ్చి, శాసన సభ్యులు వున్నపుడే ప్రోగ్రామ్స్ పెట్టుకుని అన్ని మండలాలకూ ఆ శాసన సభ్యులను తీసుకుని వెళ్లి కార్యక్రమాలను చేపట్టడం జరిగింది. వాటర్, ఎలక్ట్రిసిటీ, ఈ రెండు సబ్జెక్ట్‌లూ మాకు ఇచ్చారు. అందువల్ల ఆ రెండింటిలో ప్రత్యేక శ్రద్ధ కనబరచి, వాటిలో వున్న లోపాలను సవరించి, అభివృద్ధి చేయడం జరిగింది.

ప్రతి చోటా, ఎప్పుడో దశాబ్దాల క్రితం వేసిన ఇనప పోల్స్ నేలకు ఒరిగిపోతే, వైర్లు తెగిపోయి, ఇళ్ల మీదకు వైర్లు వచ్చేస్తే, ఆ తుప్పు పట్టిన ఇనప పోల్స్‌ను మార్చడం జరిగింది. మా నియోజక వర్గంలోని ఐరాల మండలంలో 250 పోల్స్‌ను మార్చడం జరిగింది. చంద్రగిరి పట్టణంలో 250 పోల్స్‌ను మార్చాము. ఎన్నో ట్రాన్స్‌ఫార్మర్లు ఇవ్వడం జరిగింది. మీకు తెలుసు, ఇంతకు ముందు తెలుగుదేశం ప్రభుత్వంలో మూరెడు వైరు, ఒక పోల్ కావాలంటే, రైతులు వెళ్లి, డబ్బులు ఇవ్వాల్సి వచ్చేది. వారు డబ్బులు ఇవ్వకపోతే, ఆ పనులు జరిగేవి కాదు. అసలే కరువు కాటకాలతో కృంగిపోయి వున్న ప్రజానీకం పన్నులు కట్టలేని పరిస్థితులలో ఒక మూరెడు వైరు, ఒక చిన్న పోల్‌కు డబ్బులు కట్టే పరిస్థితి వుంటే, దానిని తొలగించి, ప్రస్తుతం అడిగిన చోటల్లా వందల, వేల పోల్స్ మార్చడం జరిగింది. ఇళ్లపై తీగలు పడి వుంటే వాటిని సవరించడం జరిగింది.

నా నియోజక వర్గంలో ముంగిలిపట్టు గ్రామంలో వైర్లు తెగి ఆడవారు ఇద్దరు, కొన్ని జంతువులు చనిపోవడం జరిగింది. ఈ పార్టీ, ఆ పార్టీ అని లేకుండా అన్ని గ్రామాలలో ప్రజలకు అన్ని వసతులనూ కల్పించిన ఘనత మా కాంగ్రెస్ పార్టీకే దక్కింది. ముఖ్యమంత్రి గారిని మా జిల్లా వాసుల తరపున ఒకటే విషయం అడగదలచుకున్నాను.

( ప్రతిపక్ష సభ్యుల నుంచి తీవ్ర అంతరాయం )

సర్, వారందరూ మాట్లాడుతుంటే, రోజూ మేము బొమ్మల్లా కూర్చుంటున్నాము. మా కష్టాలు చెప్పుకోవాలనుకుంటే ఇట్లా అల్లరి చేయడం వారికి న్యాయమా ? మా చిత్తూరు జిల్లా శాసన సభ్యులందరినీ ప్రజలు ముఖ్యమంత్రి గారి దృష్టికి ఒక విషయాన్ని తీసుకురమ్మని చెప్పమన్నారు. ప్రతి రోజూ ఉదయం 2.00 గంటలకు మాకు కరెంట్ సరఫరా చేస్తున్నారు. మాకు చెరకు క్రషింగ్ వుంది కాబట్టి 2.00 గంటలకు బదులుగా 4.00 గంటలకు ఇచ్చినట్లయితే, క్రషింగ్‌కు బాగుంటుంది. అంతే కాక ఇద్దరు రైతులు అర్ధ రాత్రి పొలానికి వెళ్లి పాము కాటుకు గురై చనిపోయారు. అట్లాగే మహిళలు రాత్రిపూట పొలాలకు వెళ్లడం వల్ల అక్కడ మర్డర్లు కూడా జరుగుతున్నాయి.

( ప్రతిపక్ష సభ్యులచే తీవ్ర అంతరాయం )

మ.12.10

( అంతరాయం )

చిత్తూరు జిల్లాల్లో ముఖ్యమంత్రిగారు ప్రత్యేక దృష్టి పెట్టి ఈ కరెంటు రెండు గంటలకు ఇవ్వవలసినది రెండు గంటలు ముందుకు చేసి 4 గంటలూ ఇవ్వాలని రైతులందరి తరఫున కోరుతున్నాను. నాలుగు నుండి ఎనిమిది గంటలు ఇవ్వాలి. ఇచ్చే అన్ని గంటలూ ఒక్కసారి విద్యుత్ ఇచ్చేటట్లు చూడాలని ముఖ్యమంత్రిగారిని కోరుతూ, నాకు మాట్లాడడానికి అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలుపుతూ సెలవు తీసుకుంటున్నాను.

( అంతరాయం )

ఛైర్మన్ః ఎక్కడ ఎవరు మాట్లాడాలనేది నిర్ణయించేది నేను. దయచేసి అందరూ కూర్చోవాలి.

శ్రీమతి బి. శారారాణి (పరకాల )ః నిన్నటి రోజున 304 ః జాతీయ గ్రామీణ ఉపాధి పథకం గురించి నేను మాట్లాడడం జరిగింది. నేను మాట్లాడుతూ ఉంటే మా పార్టీలో ఉన్న నగేష్‌గారూ, రాజేందర్‌గారూ అవమానకరంగా, ఒక దళితఅని చూడకుండా, ఒక స్త్రీఅని నన్ను చూడకుండా, ప్రతీ మాటకూ అడ్డుతగిలారు. బయట మాట్లాడాలంటే మా అధ్యక్షులు మా దిష్టి బొమ్మలను తగులపెట్టండని, గ్రామ బహిష్కరణ చేయండనీ, రాళ్లతో కొట్టండని చెబుతున్నారు. మేము బయట, ఇక్కడ మాట్లాడరాదు. తమరు నిన్న ఛాన్స్ ఇస్తే మాట్లాడాము. ఇక్కడ మాట్లాడడానికి తమరు ఛాన్స్ ఇవ్వరు. నిన్న సభలో మాట్లాడడానికి అవకాశం అడిగాను. నిన్న నన్ను మాట్లాడనివ్వకుండా మా పార్టీ వారు చేసినందుకు నిరసిస్తూ, ఈ సభ నుండి వాకౌట్ చేస్తున్నాను. నాతో సహకరించే మా ఎం.ఎల్.ఏలను కూడా వాకౌట్ చేయాలని కోరుతున్నాను.

( సభ నుండి శ్రీమతి బి. శారారాణి, శ్రీ జి. ముకుందరెడ్డి, శ్రీ టి. జయ ప్రకాష్ రెడ్డి, శ్రీ డి. శ్రీనివాసరావు వాకౌట్ చేశారు. )

డా. కె. నగేష్ (ఆలేరు)ః వ్యక్తిగతంగా దళితఅనో, మహిళఅనో ఎటువంటి అభిప్రాయం లేదు. ఎం.ఎల్.ఏకి ఎవరికి ఉండే హక్కులు, ప్రివిలేజెస్ వారికి ఉంటాయి, కానీ మేము పార్టీ పరంగా నిర్ణయం తీసుకున్నది తప్పు పట్టినందుకు ఒక పార్టీలో ఉంటూ ఆ పార్టీని, వ్యతిరేకించడం సభా సాంప్రదాయం కాదు. కాంగ్రెస్, టి.డి.పి., కమ్యూనిస్ట్ పార్టీలోఅయినా ఎవ్వరూ చేయరు. పార్టీలో ఉంటూ పార్టీ నాయకత్వం తీసుకున్న నిర్ణయాన్ని అసెంబ్లీలో తప్పు పట్టనద్దని చెప్పాము. నాకు మాట్లాడడానికి అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలియచేస్తున్నాను.

శ్రీ ఇ. రాజేందర్ (కమలాపూర్)ః ఈ సభ అంటే నాకు ఎనలేని గౌరవం ఉంది. ఎవరినీ కించపరచాలనే ఉద్ధేశ్యం ఉన్నవారం కాదు. ఏ పార్టీ జండా మీద గెలిచారో, ఏ సిద్ధాంతాలతో గెలిచారో దానిని గౌరవించవలసిన బాధ్యత ఉంది. ఒక పార్టీఅని కాదు. అన్ని పార్టీలకు అదే ఉంటుంది. చరిత్రలు ఎన్నో జరిగాయి. ఇకముందు జరుగుతాయి కాబట్టి భూతద్దాలతో చూసి నవ్వుకోవడం సమంజసం కాదు. ప్రభుత్వం గత చాలా సంవత్సరాలుగా ఇరిగేషన్ రంగంలో చాలా వెనకబడి ఉంది. కాబట్టి గ్రామీణ ప్రాంతాలలో ఉన్న ఆర్థిక వ్యవస్థ వ్యవసాయం మీద ఆధారపడి ఉంది నూటికి 72 శాతం దీని మీద ఆధారపడి ఉన్నారు. కాబట్టి ఆ పంట పొలాలకు నీరిచ్చి రైతాంగాన్ని ఆదుకోవాలనే ప్రయత్నం చేస్తోంది . దానిని తప్పకుండా మనసారా ఆహ్వానించాము. గతంలో ముఖ్యమంత్రి గారు ఎప్పుడో ఈ ప్రాంతీయ అసమానతలకు ఒక పార్టీ కారణమని చెప్పారు. గత 20 సంవత్సరాలుగా ఈప్రాంతానికి తీరని అన్యాయం జరిగిన మాట వాస్తవం. దానికి ప్రతిఫలంగా ప్రతి రోజూ అసెంబ్లీ వేదికగా అన్ని రాజకీయ పార్టీలు ముక్త కంఠంతో , ఏకాభిప్రాయంతో తెలంగాణా ప్రాంతానికి నిధులు, జలాలు మొదలైన వాటిలో ఎందుకు ఇలా అన్ని రంగాలలో అన్యాయం జరుగుతోందని అందరం ఒప్పుకున్నాము. ఆ సంగతిలో ఎవరికీ పేచీ లేదు. ప్రభుత్వానికి గతంలోచెప్పాము. ప్రభుత్వానికి డబ్బులు కేటాయించిన తరువాత ప్రియారిటి మీద కొట్లాడాము. ఎవరికి ముందు ఇవ్వాలి, ఎవరికి తరువాత ఇవ్వాలనేది పేచీ. అందరం అంగీకరించిన తరువాత రు.10,000 కోట్లు కేటయించిన తరువాత, ప్రభుత్వ లెక్కల ప్రకారం రు.3,500 కోట్లని లెక్కలు చెప్పారు. మాట చెప్పినప్పుడు 51 శాతమని చెబుతున్నారు. అంకెల్లో రు.3,500 కోట్లు కేటాయించినట్లు చెబుతున్నారు. మా సంతోష్ రెడ్డిగారు బడ్జట్ గురించి మాట్లాడుతూ, ఎన్నో చెప్పారు. అలొకేషన్ మాత్రం తెలంగాణా ప్రాంతానికి పెడుతున్నారు. అసలు ఖర్చు పెట్టేది తేడా స్పష్టంగా కనబడుతోంది. అలొకేటెడ్ వేరు. ఖర్చు పెట్టేది వేరు. తెలంగాణాకి అలొకేటెడ్లో దాదాపు 70 శాతం కూడా ఖర్చు పెట్టలేని మాట వాస్తవం. ఈ రోజు గోదావరి నది మీద కడుతున్న తెలంగాణా మొత్తం ప్రాజెక్ట్కి కేటాయించిన నిధులు కేవలం రు.1,220 కోట్లు. పోలవరం ప్రాజెక్ట్కి కేటాయించిన నిధులు రు.1,730 కోట్లు. గోదావరీ పరీహాహక ప్రాంతం ఈనాడు తెలంగాణా ప్రాంతంలో దాదాపు 70 శాతం పైన ఉంది. గతంలో ఈ తెలంగాణా ప్రాంతం రాష్ట్రంలో విలీనం కాకముందు పోచంపాడు మీద 400 టియంసికి సంభంధించి ఒక బృహత్ ప్రాజెక్ట్ కట్టాలని ఆ రోజు నిర్ణయించారు. 40 లక్షల ఎకరాలకు నీరు ఇవ్వకుంటే విద్యుత్ ఉత్పాదనకు ప్లాన్ చేయడం జరిగింది. కృష్ణా నది మీద ఇప్పుడున్న ఆల్మట్టి అప్పర్ కృష్ణా, జూరాల, నందికొండ ఈ మూడు ప్రాజెక్టులకు స్వాతంత్ర్యంకన్నా ముందే అలొకేషన్ జరిగిన మాట సత్యం. బాధాకరం ఏమంటే, ఈ రోజు తెలంగాణా ప్రాంతం, ఆంధ్రలో విలీనం అయిన తరువాత అభివృద్ధి కోసం ఏదైతే ప్రణాళిక రచించారో అవన్నీ ఎక్కడా భంగం కాకూడదుఅనే విషయాన్ని మనం నిర్ధేశించుకున్నాము. ఒకవేళ మా ప్రాంతం వేరే రాష్ట్రానికి వెళ్లినా, అప్పటికి డిజైన్ చేసి ఉన్నాయో, పర్మిషన్ వచ్చి ఉన్నాయో, ఆ ప్రాజెక్టులన్నీ తప్పకుండా నిర్మాణం చేయాలని, ఆ ప్రాంతానికి నీరు ఇవ్వాలని వ్రాసుకున్న తరువాత కూడా ఆ రోజు నీలం

సంజీవరెడ్డిగారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు దానిని తుంగలో తొక్కి మొత్తం మహబూబ్‌నగర్ ప్రాంతానికి 174 టియంసి నీరు తెచ్చి శస్యశ్యామలం చేయాలని నిర్ధేశించుకున్నామో, దానికి భిన్నంగా మొత్తం జిల్లాని నట్టేట్లో ముంచి పంట పొలాల్లో జిల్లేడు, తంగేడులు మొలిచేవిగా ఉండినాయి. ఆ 14 లక్షల జనాభా వలస పోవడానికి కారణం అయింది. మా బాధ తెలంగాణా గురించి మాట్లాడినప్పుడు మమ్ములను సెపరేటిస్ట్‌లని ముద్ర వేయడానికి ప్రయత్నం చేస్తున్నారు. ఈ రోజు తెలంగాణా ప్రాంతంలో మా పరీవాహక ప్రాంతంలో 70 శాతం పైన ఉంటే మాకు ఇచ్చినది ఒకే ఒక ప్రాజెక్ట్, అది కూడా 400 టియంసికి తగ్గించి 159 టియంసికి పోచంపాడు ఇచ్చారు. ఈ రోజు లెక్క చూస్తే 120 టియంసి లేదు. ఈ రోజు పూర్తిగా ఇసుకతో నిండిపోయి 90 టియంసి ఉంది. 1963లో ప్లాన్ చేస్తే ఇప్పటికి మొదటి ఫేజ్ అయింది. రెండవ ఫేజ్ నోచుకోలేదు. 10 లక్షల ఎకరాలలో కూడా నీరు ఇవ్వలేని పరిస్థితి ఉంది ఇచ్చంపల్లి, దేవాదుల, ఎల్లంపల్లి విషయాలలో 160 టియంసి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ వారు ఒక మంచి సమగ్రమైన రిపోర్ట్‌ను అందించారు. అందులో దేవాదులు, దుమ్ముగూడెం ఇవన్నీ కలిపి 1,480 టియంసి మొత్తం గోదావరిలో ప్రవహిస్తే అందులో మా వాటా 1,033 టియంసి రావాలి. కానీ బచావత్ అవార్డ్ ప్రకారంగా 758 టియంసి మాత్రం కేటాయింపు జరిగింది. కానీ ఈ రోజు వాడుకోవలసిన నీరు 250 టియంసి, 300 టియంసి కూడా రాని మాట వాస్తవం. పోలవరం విషయం గతంలో చాలాసార్లు మాట్లాడాము. ఇచ్చంపల్లి, దేవాదుల, ఎస్ఆర్ఎస్‌పి స్టేజ్ 2 కానీ, ఫ్లడ్ ఫ్లో మాకు అలొకేట్ చేసిన నీరు ఈ రోజు తెలంగాణా ప్రాంతానికి అంతా దుర్భిక్షంగా ఉండి రైతాంగం ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి ఉంది. మాకు మొదటగా ఆ నీరు ఇచ్చి ఆదుకోవలసిన ధర్మం ప్రభుత్వం మీద ఉందని చెబుతున్నాను. ఈ రోజు కృష్ణా బేసిన్‌లో ఉన్న డెల్టా కోసం వారికి నీరు గ్యారెంటీ చేయడం కోసం కృష్ణాలో నీరు తగ్గుతోంది కాబట్టి ముందు కరువుని ఫేస్ చేసిన అనుభవం లేదు, కరువులో పోలేరు, కరువును భరించలేరని కరువును అనుభవించేవారు తెలంగాణావారే కాబట్టి తెలంగాణాని పూర్తిగా విస్మరించారు. 10, 15 సంవత్సరాలకు కరువు వచ్చే కోస్తా ప్రాంతానికి నీటిని గ్యారెంటి చేయడం కోసం పోలవరం ప్రాజెక్ట్ కడుతున్నారు.

మ.12.20

ఈరోజు గోదావరి పరీవాహక ప్రాంతంలో కనీసం 30% ఆయకట్టు కూడా లేదు. న్యాయ సూత్రాల ఆధారంగా 60% భూములను సస్యశ్యామలం చేయకుండా ఏ నదినుండి కూడా ఇంకొక నదికి నీటిని డైవర్ట్ చేయటానికి ఆస్కారం లేదు. జాతీయ న్యాయసూత్రాలుగాని, అంతర్జాతీయ న్యాయ సూత్రాలుగాని తుంగలోతొక్కి ఈరోజు ఇక్కడ ఉన్నటువంటి గోదావరి నీటిని అంతా కృష్ణా బేసిన్‌కు తరలించే చర్యను తప్పకుండా మేము వ్యతిరేకిస్తున్నాము. అంతేకాకుండా కేంద్రాన్ని మేము అడుగుతున్నాము, అంతకు ముందు కూడా మేము అడిగాము. మా ఎల్లంపల్లి లింక్‌కు ఇప్పటికి కూడా ఆదేశాలు ఇవ్వలేదు, ఇన్‌వెస్టిగేషన్ చేయలేదు. దేవాదుల విషయం మాకు అర్ధంకాకుండా ఉన్నది. 55 టి.ఎం.సి.లా లేక 12 టి.ఎం.సి.లా అనేది అర్ధంకాకుండా ఉన్నది. దుమ్ముగూడెం ఎప్పుడు తెస్తారు, ఎట్లా తెస్తారు అనే విషయం కూడా అర్ధంకాకుండా ఉన్నది. ఈనాడు మీరు చెప్పిన ప్రకారంగానే ఎన్ని వేల కోట్ల రూపాయలు అయితే తెలంగాణా ప్రాజెక్ట్‌లకు కావాలని మీరు చెప్పారో అంత మొత్తం కేటాయిస్తున్నారా? మీరు అత్యధికంగా బడ్జెట్ కేటాయించిన సంవత్సరం ప్రకారం చూసినా ఆ ప్రకారం కేటాయిస్తూ పోతుంటే కనీసం 15, 20 సంవత్సరాలకు కూడా ఈ ప్రాజెక్ట్‌లద్వారా తెలంగాణా ప్రాంతానికి నీరు వచ్చే ఆస్కారమే లేదు. 40, 50 సంవత్సరాలనుండి వెనుకబడి ఉండి అన్నమో రామచంద్రా అనేటువంటి ఈ ప్రాంతానికి ఈరోజు నీరు ఇవ్వాలా లేక ఇప్పటికే అన్ని విధాలుగా అభివృద్ధి చెందినవారికి నీరు

ఇవ్వాలా అనేది తేల్చుకోవలసిన అవసరం ఈరోజు ప్రభుత్వానికి ఉన్నది. ఈరోజు కృష్ణానదిమీద నందికొండ ప్రాజెక్ట్ నిర్మించుకున్నాము, నాగార్జునసాగర్ నిర్మించుకున్నాము. మీకు తెలియనిది కాదు. నాగార్జునసాగర్ ఎడమగట్టు కాలువచూస్తే ఎంతో బాధాకరం. ముందు 162 టి.ఎం.సి. అన్నారు, తరువాత 132 టి.ఎం.సి. అన్నారు. మొత్తానికి చూస్తే ఈనాడు 85 టి.ఎం.సి.లు కూడా రావటంలేదు. కె.వి. రావుగారు ఉన్నప్పుడు డిజైన్ మార్చి నూజివీడుదాకా ఎడిషనల్‌గా 2 లక్షల ఎకరాలకు నీరు తీసుకెళ్లారు. అక్కడికి నీరు తీసుకెళ్లేందుకై 22 టి.ఎం.సి.ల నీరు ఇస్తామని చెప్పి చివరకు 1 టి.ఎం.సి. నీరు కూడా ఇవ్వని మాట సత్యం. ఇప్పటికే ఎంత వివక్షత కొనసాగుతుందో మీకు తెలుసు. ఆనాడు నాగార్జునసాగర్ నిర్మించినప్పుడు అక్కడ ఉన్న లక్ష ఎకరాలకు ఈ ప్రభుత్వ ఖర్చుతో లిఫ్ట్ ఇరిగేషన్ పెడతామని చెప్పారు. ఈరోజు ఏమి మాట్లాడుతున్నారు? రైట్ కెనాల్‌కు ఒక పద్ధతి, లెఫ్ట్ కెనాల్‌కు ఒక పద్ధతి పెట్టటంవలన మొత్తం సర్వనాశనం అయిపోయింది. ఈనాడు కృష్ణా డెల్టాకు 190 టి.ఎం.సి.ల నీరు కేటాయించబడింది. నాగార్జునసాగర్ బహుళార్థసాధక ప్రాజెక్ట్ కాబట్టి కరెంట్ ఉత్పత్తి పేరిట ఆంధ్ర ప్రాంతానికి ఈనాడు ఎడిషనల్‌గా 343 టి.ఎం.సి.ల నుండి 350 టి.ఎం.సి.ల నీటిని వారు రిలీజ్‌చేస్తున్నారు. వారికి కేటాయించింది 190 టి.ఎం.సి.లు మాత్రమే. ఈవిధంగా చేస్తూ ఎక్కడకు పోతున్నాము? చిన్నచిన్న నదులనుండి లోకల్ వాటర్ మాత్రమే ఉపయోగించుకోమని చెప్పారు. లోకల్ వాటర్ కాకుండా ప్రాజెక్ట్‌లో నిల్వచేసుకున్న వాటర్‌ను కూడా ఆవిధంగా విద్యుత్ ఉత్పాదన పేరిట తరలించుకుపోతున్న మాట సత్యం కాదా? 50 సంవత్సరాలు అయినప్పటికీ టెయిల్‌పాండ్ నిర్మించుకుని రివర్సిబుల్ టర్బైన్స్‌ద్వారా నీరును మరలా సాగర్‌లోకి వేసుకుని తెలంగాణా ప్రాంతంలోని భూములకు నీరు ఇవ్వాలని ఏదైతే అనుకున్నామో అది ఇప్పటికి కూడా ఎందుకు నోచుకోలేదని మీద్వారా ప్రభుత్వాన్ని అడుగుతున్నాను.

శ్రీశైలం ఎడమగట్టు కాలువ విషయం కూడా పరిశీలించాలి. ఈరోజు ఎడమగట్టు కాలువ విషయం మీకు తెలియనది కాదు. హైదరాబాద్ నీటి అవసరాల కోసం 40 టి.ఎం.సి.ల నీరు ఈనాడు హైదరాబాద్‌కు వస్తే ఏమౌతుందో మీకు తెలుసు. గతంలో సింగూరు ప్రాజెక్ట్‌నుండి 4 టి.ఎం.సి.లు, 5 టి.ఎం.సి.లు అనుకుని హైదరాబాద్‌కు నీరు తీసుకుని మెతుకులేని మెదక్ జిల్లాకు ఒక్క చుక్క నీరు కూడా ఇవ్వకుండా నిర్వీర్యంచేసే పరిస్థితి ఉన్నది. ఈనాడు ఎస్.ఎల్.బి.సి. ఏదైతే ఉన్నదో అది కూడా నిర్వీర్యం అయిపోయే పరిస్థితి ఉందని తమరిద్వారా సభ్యులకు తెలియచేస్తున్నాను. హైదరాబాద్‌కు నీరు ఇవ్వాలనే విషయంలో మాకు ఎటువంటి అభ్యంతరం లేదు. కాని మేము అడుగుతున్నాము, అక్కంపల్లి రిజర్వాయర్ ఏ నల్గొండ ప్రజానీకం కోసమైతే చేపట్టబడిందో దానిని తప్పకుండా అమలుచేయాలి. ఒకవేళ హైదరాబాద్‌కు నీరు కావాలనుకున్నప్పుడు తప్పకుండా శ్రీశైలంనుండి తీసుకురావాలి తప్ప ఈ అక్కంపల్లి రిజర్వాయర్‌నుండి కాదు. అది నల్గొండకు కేటాయించబడింది. ఈనాడు వరంగల్ పరిస్థితిగాని, నల్గొండ పరిస్థితిగాని ఎట్లా ఉందో మీకు తెలుసు. ప్రతి ఇంటికి 20 లీటర్ల నీటిని రోజుకు రూ.10 చొప్పున కొనుక్కుంటున్నారంటే ఈ బ్రతుకులేని బడుగుజీవులు నీటి కోసం ఎన్ని కోట్ల రూపాయలు ఖర్చుపెడుతున్నారో ఒక్కసారి ఆలోచించాలి. మా బాధల్లా, మా తపనల్లా మాకు కృష్ణా, గోదావరి నదులపై ఈనాటికి 69.1% రైపేరియన్ రైట్స్ ఉన్నప్పటికీ ఈనాటికీ మా ప్రాంతానికి సాగునీరే కాదు త్రాగునీరు కూడా లేక అల్లాడుతున్నాము. లక్షలమంది నల్గొండ ప్రజానీకం ఫ్లోరైడ్‌బారినపడి ఎముకలు వంగి, నడుములు వంగి ఏ రకమైన బాధలు అనుభవిస్తున్నారో మనం ఒక్కసారి పరిశీలిస్తే అర్థమౌతుంది.

తెలంగాణా ప్రాంతం ఆంధ్రరాష్ట్రంలో కలవకముందు మాకు మైనర్ ఇరిగేషన్ క్రింద 36% పారుదల ఉండేది. మా పల్లెల్లో ఎక్కడకుపోయినా కన్పించే మైనర్ ఇరిగేషన్ రంగం చిన్నది కాదు. ఈనాడు మంత్రిగారు సమాధానం చెబుతూ 100% ఎక్కువ పెట్టామని చెప్పారు. అంటే గతంలో ఒక్క రూపాయి కూడా పెట్టలేదని అర్థం. అక్కడ ఉన్న చెరువులన్నింటిలోనూ జిల్లేడలు, తంగెడలు, తుమ్మలు మొలిశాయి. చెరువు ఎక్కడ ఉందో కూడా తెలియని పరిస్థితి ఉన్నది. కట్టలు, స్లూయిజ్‌లు మొత్తం కొట్టుకుపోయాయి. తెలంగాణా ప్రాంతంలోని మైనర్ ఇరిగేషన్ రంగం క్రింద ఉన్నటువంటి చెరువులు, కుంటలు కేవలం వ్యవసాయం కోసమే కాదు అక్కడి ప్రజానీకం అవసరాలు కూడా తీర్చాయి. ఆ చెరువులు, కుంటలు నీరులేక ఎండిపోయిన వైనాన్ని మనం ఈనాడు చూస్తున్నాము. అవి చిన్నచిన్న అడవులుగా మారాయి. గౌడ కులస్తులు ఆధారపడే తాడి చెట్లన్నీ ఎండిపోయిన కారణంగా అన్నమో రామచంద్రా అంటూ బజారునపడ్డారు. ఈనాడు గొర్రెల కాపరులుగాని, పశుసంపద కాపాడుకునే రైతాంగంగాని, భూములపైన మరియు బావులపైన ఆధారపడిన రైతాంగంగాని డ్రింకింగ్ వాటర్ కూడా దొరకని దుర్భర పరిస్థితుల్లో ఉన్నారు. భూగర్భ జలాలన్నీ నాశనం అయిపోయి తెలంగాణా పల్లెల్లో ఆత్మహత్యలు జరుగుతున్నాయి. జయతీఘోష్ కమిటి చెప్పిన దాని ప్రకారం తెలంగాణా ప్రజానీకం నీటికోసం పడుతున్న కష్టాలవలన, బోర్లు వేసివేసి, బావులు త్రవ్వి,త్రవ్వి వారి బొక్కలు తెల్లబడి మొత్తం సర్వనాశనం అయిపోయి ఆత్మహత్యలు చేసుకుంటున్నారని చెప్పటం జరిగింది. అంత ఇంపార్టెంట్ అయిన ఆ ప్రాంతానికి ఈరోజు నీటి కేటాయింపులలోనే కాకుండా వివిధ కేటాయింపులలో కూడా తక్కువ చూపు చూస్తున్నారని మీకు మనవిచేస్తున్నాను. ఈరోజు ప్రొద్దున మంత్రిగారు మాట్లాడుతూ రూ.450 కోట్లు కేటాయించామని చెప్పారు. ఈనాడు లక్షల, కోట్ల రూపాయలు కావాలి. నిజంగా ఆ చెరువులు, కుంటలు త్రవ్వాలంటే లక్షల, కోట్ల రూపాయలు ఖర్చుచేయవలసిన అవసరం ఉటుంది. ఈరోజు ఇమ్మీడియెట్‌గా వెయ్యికోట్లు, రెండువేల కోట్లు అయినా కావాలి. రూ.46,000 కోట్లు అని అన్నారు, అది రూ.96,000 కోట్లకు పోవచ్చుగాక. ఈనాడు మైనర్ ఇరిగేషన్ రంగం రెడీగా ఉన్నది.

ఈరోజు ఫీడర్ ఛానల్స్ అన్నీ ధ్వంసం అయిపోయాయి. ఈనాడు రూ.450 కోట్లు కాదు, ముందు మీరు ఆ డిపార్ట్‌మెంట్‌ను స్ట్రెంగ్దెన్ చేయండి. ఎందుకంటే గతంలో ఆ డిపార్ట్‌మెంట్‌లో పనిలేనందువల్ల సిబ్బందిని వేరే డిపార్ట్‌మెంట్‌లకు తరలించారు. ఆ డిపార్ట్‌మెంట్ అంతా దుమ్ముకొట్టుకుపోయింది, నిర్వీర్యం అయిపోయింది. కాబట్టి ఇప్పుడు ఉన్న పరిస్థితులలో ఈ కేటాయించబడిన నిధులు కూడా ఖర్చు కావాలంటే దాని దుమ్ముదులపవలసిన అవసరం ఉంది. ప్రొద్దున చెప్పినట్లుగా ఇప్పుడు ఉన్న స్టాఫ్ సరిపోరు. తప్పకుండా స్టాఫ్‌ను అధికంగా రిక్రూట్ చేసుకోవలసిన అవసరం ఉందని తమరిద్వారా విన్నవిస్తున్నాను.

ఈరోజు కరెంట్ విషయం చూస్తే కోస్తా ప్రాంతంలో ఒక్క రూపాయి కూడా ఖర్చుపెట్టుకోకుండా వారికి నీరు ఇస్తున్నాము. వారు పండించిన పంటకు తక్కువ ధర వస్తోందా? ఈనాడు తెలంగాణా పంట పొలాలు బోర్లతోగాని, బావితోగాని ఒక్క ఎకరంపైన రూ.50,000 అదనంగా ఖర్చుపెట్టుకున్నప్పటికీ రేపు పంట పండని పరిస్థితి ఉన్నది. ఈనాడు తెలంగాణా ప్రాంతంలో ఒక్క బోరు సక్సెస్ కావాలంటే 10 బోర్లు వేసినప్పటికీ నల్గొండవంటి ప్రాంతంలో సక్సెస్ కావటంలేదు. 300 ఫీట్స్, 400 ఫీట్స్‌కు వెళ్లినప్పటికీ సక్సెస్ కావటంలేదు. 3 హెచ్.పి., 5 హెచ్.పి. మోటార్స్ పెట్టినప్పటికీ, ఎంత పవర్ కన్‌జ్యూమ్ చేసినప్పటికీ ఒక్క ఇంచ్ వాటర్ రావటం కూడా కష్టమౌతుంది. 7 గంటల కరెంట్ ఇచ్చినప్పటికీ అది సరిపోదు. తడచినచోట తడుస్తుంది, పారినచోటే పారుతుంది తప్ప ఒక్క ఎకరం ఎక్కువ భూమికి కూడా పారటం లేదు. అందుకనే మేము చెప్పాము. ఒక్క ఎకరం భూమి మీద ఈరోజు రైతాంగం పెట్టే ఖర్చు భూమి ఖర్చు కాదు, రూ.50,000 ఈనాడు తెలంగాణా

రైతులు అదనంగా ఖర్చుచేస్తున్నారు. ప్రభుత్వం బ్యాంకులద్వారా డబ్బు ఇప్పించలేని పరిస్థితిలో ఉన్నది. రైతు తన సొంత పెట్టుబడి పెట్టే పరిస్థితి మనం చూస్తున్నాము. దాదాపు రూ.50,000 కోస్తా ప్రాంతంకంటే ఎడిషనల్‌గా ఖర్చుపెట్టే పరిస్థితి మనం చూస్తున్నాము. ఒక్కటే అడుగుతున్నాము. ఆ ప్రాంతానికి ప్రభుత్వపరంగా ఇచ్చినప్పుడు ఈ ప్రాంత రైతాంగానికి నిర్విరామంగా, నిరంతరాయంగా పవర్‌ఇచ్చి పంట పొలాలు ఎండిపోకుండా కాపాడవలసిన ధర్మం ప్రభుత్వంమీద లేదా అని ప్రభుత్వాన్ని అడుగుతున్నాను. అందుకనే ఈనాడు పవర్ విషయంలో 15 లక్షలో లేక 16 లక్షలో ఉన్న కనెక్షన్స్‌కు ప్రభుత్వం ఉచిత విద్యుత్‌ను సంపూర్తిగా అమలుచేయాలి. 7 గంటలనుండి 9 గంటలకు పెంచాలి. ఒక్క ఎకరం పంట పొలం కూడా ఎండిపోకుండా చూడవలసిన బాధ్యత మాపైన ఉన్నదని అన్నారు. ఈరోజు తప్పకుండా పంట పొలాలు ఎండిపోతున్నాయి, ఒక్కసారి చూడండి. కావాలంటే మీకు ఫోటోస్, ఇన్ఫర్మేషన్ ఇస్తాము. అధికారులనుండి మీరు సమాచారం తెప్పించుకోండి. ఈనాడు లేకలేక పంటలు పండాయి. పోతిరెడ్డిపాడు విషయం మీకు తెలుసు. వ్యవసాయదారుడు ఎప్పుడూ కూడా బిజినెస్ చేయడు. ఈరోజు తన రెక్కలు ముక్కలు చేసుకుని రాష్ట్ర ఉత్పత్తిని పెంచటానికి వారు ప్రయత్నిస్తున్నారు తప్ప వారి సొంతానికి కాదు. ఈనాడు నిజంగానే వారు వ్యాపారంచేసేవారు అయితే ఈరోజు రైతాంగం పరిస్థితి ఈవిధంగా ఉండేది కాదు. స్వతంత్ర్య భారతదేశంలో వారి బ్రతుకులన్నీ ఛిద్రమైపోయాయి. వారి పిల్లలను చదివించుకోలేని పరిస్థితిలో ఉన్నారు. వారి పిల్లల పెళ్లిల్లు చేయలేని పరిస్థితిలో ఉన్నారు. వారి పిల్లలకు పట్టెడు అన్నం కూడా పెట్టలేని దౌర్భాగ్య పరిస్థితిలో ఉన్న మాట సత్యం కాదా? కరెంట్ విషయంలో ఫుట్‌వాల్వ్‌లు, కెపాసిటర్స్ ప్రభుత్వంపైనే వదిలిపెట్టాలి. ఫస్ట్ టైమ్ ఎక్కువ లాభాలు వచ్చాయని ప్రభుత్వం చెబుతోంది. ఆ లాభాలను కన్‌జ్యూమర్స్‌కు పాసాన్ చేయాలి. రైతాంగానికి మనం ఇవ్వటమంటే మనకు మనం ఇచ్చుకున్నట్లే కాబట్టి తప్పకుండా రైతాంగం కోసం ఫుట్‌వాల్వ్‌లు, కెపాసిటర్స్ అన్నీ ప్రభుత్వపరంగానే భరాయించాలని కోరుతున్నాను.

మ.12.30

ఆ లాభాలు కన్‌జ్యూమర్‌కు, రాష్ట్ర రైతాంగానికి పాస్‌ఆన్ చేయకుండా, రైతాంగానికి ఇవ్వడం అంటే మనకు మనమే ఇచ్చుకొనేటటువంటి కాబట్టి తప్పకుండా ఆ రైతాంగం కోసం ఫుట్‌వాల్వ్స్ కాని లేకపోతే కెపాసిటర్సు ఇవి అన్ని ప్రభుత్వ పరంగా భరించాలని చెప్పి తమరి ద్వారా మనవిచేస్తున్నాను. అంతేకాదు ఇవాళ లోఓల్టేజ్ పేరిట బోలెడన్ని మోటార్సు కాలిపోతున్నాయి. మీకు తెలుసు లూజ్‌లైన్‌వల్ల ప్రమాదాలు ఎట్లా జరుగుతున్నాయో, అందుకని ప్రమాదాలు నివారించడం కోసం విద్యుచ్ఛక్తి డిపార్టుమెంటులో చాలా స్టాఫ్ లేదు. ఫీజ్‌వైర్లు పెట్టుకోవాలన్నా, కరెంటు వైర్లు పెట్టుకోవాలన్నా రైతాంగం చేసుకుంటారే తప్పా ఎక్కడ కూడా విద్యుచ్ఛక్తి అధికారులు పని చేసే పరిస్థితి లేదు. ఈ పనుల నుండి, వారిని బయట పడేయాలని మీ ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను. ఇవాళ ఇరిగేషన్‌పైన ప్రధానమైన పాత్ర పోషించినప్పటికి కూడా ఇవాళ చాలా వర్షాలు పడ్డాయి చాలా రోడ్లు ప్రమాదంలో ఉన్నటువంటి మాట వాస్తవం . మొదటిసారి ముఖ్యమంత్రిగారు వారి మాటల్లో చెబుతున్నారు. ఎట్టి పరిస్థితులలో రోడ్లు ఖరాబు అయినా తరువాత చూస్తాము అని, కనీసం రోడ్లు మరమత్తులకైనా మనం ఎక్కువ నిధులు కేటాయించకపోతే ఆ రోడ్లు శిధిలావస్తలో పడిపోయే ఆస్కారం వున్నది. ఇవాళ చూస్తున్నాము కాలం చాలా స్పీడ్‌గా వున్నది. దానికి అనుగుణంగా వ్యవస్థలో మార్పు రావాలి. కొద్దోగొప్పో రోడ్లను కూడా బాగు చేసుకోవలసిన అవసరం వున్నది. కాబట్టి యాలకేషన్ బిల్లు కాస్తాకూస్తో పెంచాలని చెప్పి మా తెలంగాణా ప్రాంతానికి ఎక్కువ నిధులు కేటాయించమని చెప్పి తమరి ద్వారా డిమాండ్ చేస్తున్నాను. మీరు గతాన్ని వాళ్లతో పోల్చాల్సిన అవసరం లేదు. గత ప్రభుత్వం ఇంత యాలకేషన్ చేసిందని చెప్పడం కాదు. అది సైంటిఫిక్ బేసా? వాళ్లది, ఒక పద్ధతి లేదు, వ్యవసాయ రంగాన్ని పూర్తిగా నాశనం

చేశారు. కాబట్టి వాళ్లందర్నీ అందర్ని చిత్తు చిత్తుగా ఓడించి మనల్ని ఎన్నుకున్నారు. మాట మాటకి వాళ్ల బడ్జెటు యాలకేషన్ కాని వాళ్ల ప్రయారిటీస్ కాని వారు అనుసరించే ప్రయారిటీస్ ప్రజల కోసం కాదు కాబట్టి తప్పకుండా వాళ్లతో మనం పోల్చుకోకుండా మనకు ఏదైతే అవసరం వున్నదో ఆ అవసరాల కోసం చిత్తశుద్ధిగా పనిచేయాలని చెప్పి తద్వారా మాత్రమే ఈ ప్రజల విశ్వాసం పొందగలమని చెప్పి తద్వారా మాత్రమే ఈ గ్రామీణప్రాంతాల్లో చిన్నాభిన్నమైనా ఆర్థిక వ్యవస్థను పరిపుష్టం చేయడం ద్వారా మన గ్రోత్ రేటు పెరుగుతుంది, మనం ముందుకుపోవడం తప్ప లేకపోతే వేరే మార్గంలేదు. ఆ దిశగా ఈ ప్రభుత్వం ఆలోచన చేయాలని చెప్పి మీ ద్వారా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తూ, విన్నవిస్తూ ఈ అవకాశం ఇచ్చినందుకు మీకు నమస్కారాలు తెలియచేసుకుంటున్నాను.

శ్రీ టి.జీవన్‌రెడ్డి (జగిత్యాల ):అధ్యక్షా, రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నీటిపారుదల శాఖ క్రింద డిమాండ్స్‌ను నేను పూర్తిగా సమర్ధిస్తున్నాను. మిత్రులు టిఆర్ఎస్ పార్టీకి చెందిన రాజేందర్‌గారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గత దశాబ్దాల కాలం నుంచి నిర్లక్ష్యం కావింపబడ్డ తెలంగాణా ప్రాంతానికి చెందిన నీటిపారుదల రంగానికి ఇస్తున్న ప్రాధాన్యతల పట్ల హర్షం వ్యక్తంచేస్తూ అభినందిస్తారని నేను భావించాను. వారు మాట్లాడిన మాటలు చూస్తూవుంటే, మా తెలంగాణాలో ఒక శాస్త్రం వున్నది. '' పెట్టని తల్లి పెట్టకపోయే కాని ఈపెట్టే ముండకు ఏమైంది'' అన్నట్లు వున్నది. రామారావుగారు ముఖ్యమంత్రిగా పరిపాలించిన 8 సంవత్సరాలు కానియండీ, తదుపరి అధికారానికి వచ్చిన చంద్రబాబునాయుడు 9 సంవత్సరాలు కానీయండీ, తెలంగాణా ప్రాంతానికి ఒకవైపు గోదావరి ఇంకోవైపు కృష్ణా నదులు ప్రవహించడంతోటి పుష్కలంగా సాగునీరు పొందే అవకాశం వున్నది. గోదావరి నదికి సంబంధించి ఆ నాడు పండిట్ జవహర్‌లాల్‌నెహ్రూగారు శంఖుస్థాపన చేసినటువంటి ఈ నాడు శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్టు, పోచంపాడు ప్రాజెక్టు మినహా అదనంగా ఒక్క క్యూసెక్కు వాటర్ నిల్వ చేసుకొనేటటువంటి సామర్ధ్యాన్ని కూడా గత ప్రభుత్వం కల్పించలేకపోయింది. ఇవాళ రాష్ట్రంలో కాంగ్రేస్ పార్టీ అధికారంలోకి రావడంతోనే గౌరవ ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డిగారి ఆధ్వర్యంలోపల గతంలో నిర్లక్ష్యం కావింపబడ్డటువంటి ఈ తెలంగాణా ప్రాంత సాగునీటి సౌకర్యాలు కల్పించే అవకాశం ఉన్నటువంటి గోదావరి నదీ జలాలను పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలనే భావనతోనే ఇవాళ వరదనీటి కాలువ, ఎల్లంపల్లి ప్రాజెక్టు, దేవాదుల ప్రాజెక్టు, దుమ్ముగూడెం ప్రాజెక్టు, ఎల్లంపల్లితో అనుసంధానం చేయాలని తలంచి ప్రాణాహిత , ఇతర ప్రాజెక్టుల గురించి ఆలోచన చేసి ఒక కార్యరూపం ఇచ్చే విధంగా నిధులు కేటాయింపు చేశారు. ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయాలని సంకల్పిస్తే, ప్రతిపక్షాల వాళ్లు ముఖ్యంగా తెలుగుదేశం పార్టీ గత రెండు దశాబ్దముల కాలంలో వాళ్లు ఏమి చేయలేకున్నా ఈ సాగు నీటి రంగానికి కాంగ్రేస్ పార్టీ అధికమొత్తంలో నిధులు కేటాయింపులు చేసి ప్రాజెక్టులు ఒక నిర్ణీత కాలవ్యవధిలో ప్రాజెక్టులు పూర్తి చేయాలని చెప్పి సంకల్పించారు. మరి ప్రాజెక్టుల నిర్మాణం చేపడుతుంటే, కేవలం వాటిని అడ్డుకోవడానికి, వాళ్లు న్యాయస్థానాన్ని ఆశ్రయించినా న్యాయస్థానంలోపల వాళ్లకి చుక్క ఎదురైపోయింది. ఈ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన టెండర్సు ప్రక్రియ పారదర్శకంగా వుందనిచెప్పి తీర్పు ఇచ్చారు. ప్రాజెక్టులు అడ్డుకోవడానికి రాజకీయ పార్టీలకు అవకాశాలు కల్పించకుండా తదుపరి గత శాసనసభ సమావేశాల సందర్బంగా మళ్లీ ఆరోపణలు లేవనెత్తినా గౌరవ ముఖ్యమంత్రిగారు హైకోర్టు తీర్పు ఇచ్చినా అటువంటి భావనకు సరిపెట్టుకోకుండా బహిరంగ చర్చకు ఏ ప్రాజెక్టు అయినా కాని '' మీరు బహిరంగ చర్చకు ఉపక్రమించండి, మేము సవివరాలతో మీ ముందుకు వస్తామని'' చెప్పారు. ఒక్క తెలంగాణా ప్రాంతమే కాకుండా ఆంధ్ర రాష్ట్రంలో చేపట్టిన ప్రాజెక్టుల అన్నిటిపైన కూడా బహిరంగ చర్చ చేపట్టడం జరిగింది. గత 5 రోజుల నుంచి మీరు అబ్జర్వు చేస్తున్నారు, శ్రీపాదసాగర్ ప్రాజెక్టు ఫేజ్ 2కి సంబంధించిన టెండర్ ప్రక్రియ,

నవంబరు, 2005 రామగుండంలోబహిరంగ చర్చ చేపట్టారు. ఆ నాడు తెలుగుదేశం పార్టీకి చెందిన శాసన సభ్యులు టెక్నికల్‌గా అనుభవం వున్న వారు రిటైర్డు ఛీఫ్‌ఇంజనీరు మారుతి, చర్చలో పాల్గొని చర్చలో ఏ అంశాన్ని కూడా నిరూపించలేకపోయి సమస్యను వదిలివేశారు. ఇవాళ శాసన సభా సమయం అంతా వృధా చేసే విధంగా ప్రజానీకానికి ఈసమస్య సాగుతుంటే ఇందులో ఏదో ఉన్నది అనే అభిప్రాయాన్ని కొంతమేరకన్నా కల్పించలేకపోతామా అనే భావంతో ఉన్నారు. ఇవాళ సూపరింటెండెంటింగ్ ఇంజనీరు టెక్నికల్‌గా కంప్యూటర్ ఫీడింగ్ చేయడంలో పొరపాటు జరిగిందని దానిని సరిచేసుకున్న తరువాత, ఇవాళ వాళ్లు బహిరంగం చేసిన డాక్యుమెంటు ఏమిటి? మీరు కంప్యూటర్‌లో ఫీడ్ చేసినవి తీసుకొచ్చి మేము చూపెడుతున్నాము అనడం ఏమిటి? కంప్యూటర్‌లో ఓపెనింగ్ ఫీడ్ చేసిన డాక్యుమెంటులో వాటిని మార్పు చేసిన డాక్యుమెంటు మీరు పట్టుకొచ్చి మేము చూపెడుతున్నాము అని చెప్పి అంటే ఏ విధంగా వుంటుంది.
మ.12.40

ఈనాడు వాస్తవంగా శ్రీపాదసాగర్ స్టేజ్-2కు సంబంధించి ముందుగా 1,36,000 ఎకరాలకు మాత్రమే నీరందించేవిధంగా టెండర్ ప్రక్రియ చేపట్టాలని ప్రభుత్వం తలంచిన విషయం మీకు తెలుసు. లైన్ ఎస్టిమేట్, డీటెయిల్డ్ ఎస్టిమేట్‌లు రూపొందించారు. గౌరవ మంత్రివర్యులు సభలో చెప్పారు. వారికి ఏదైనా దాచిపెట్టాలనే ఆలోచన ఉంటే సభలో చెప్పి ఉండేవారు కాదు కదా? 1,36,000 ఎకరాలకు సంబంధించి ఏ లైన్ ఎస్టిమేట్ అయితే సబ్‌మిట్‌చేయటం జరిగిందో, రూ.935 కోట్లతో లైన్ ఎస్టిమేట్, డీటెయిల్డ్ ఎస్టిమేట్ సబ్‌మిట్ చేయాలని శాఖను ఆదేశించిన తరువాత జనవరి 19 నాటికి 1,36,000 ఎకరాలకు నోటిఫికేషన్ జారీచేయటం జరిగింది. కరీంనగర్‌కు సంబంధించిన శాసనసభ్యులు గౌరవ ముఖ్యమంత్రిగారిని కలసి మా ప్రాంతానికి సాగునీరు అందించే అవకాశం ఉన్నటువంటి ఎల్లంపల్లి ప్రాజెక్ట్‌ద్వారా ఫేజ్-1, స్టేజ్-2 ద్వారా మాకు కూడా నీరు ఇస్తే తొందరగా నీరు వస్తుందనే భావనతో ముఖ్యమంత్రిగారి దృష్టికి తీసుకువెళ్లినప్పుడు 1,36,000 ఎకరాలను 2 లక్షల ఎకరాలకు మార్పుచేయాలని వారు ఆదేశించారు. సంబంధిత శాఖ ఎస్.ఇ. ఆ 1,36,000 ఎకరాలనే మదిలో మెదలటం జరగగా దీనికి సంబంధించిన ఎస్టిమేట్‌ను రూ.1,344 కోట్లుగా ముందుగా ఫీడ్‌చేయటం, అంతకంటే ముందుగానే సి.ఇ.గారికి, ప్రభుత్వానికి వారు నివేదించిన ఎస్టిమేట్‌ను ఇగ్నోర్‌చేసి వారు ఫీడ్‌చేయటం జరిగింది. జరిగిన తప్పును వారు గ్రహించి సంబంధిత శాఖ అధికారులతో దానిని రూ.1,700 కోట్లుగా వారు ఫీడ్‌చేయటం జరిగింది. దాంట్లో పార్టిసిపేట్ చేసినవారు ఎవరు? వర్క్‌పొందినవారు Sew Constructions, Navayuga. జాయింట్ వెంచర్ వారెవరైనా కానీయండి, the other participants are internationally reputed companies. ఎల్ అండ్ టి కానీయండి, హిందుస్తాన్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ కానీయండి these are the internationally reputed companies. ఇందులో ఏమాత్రం అవకతవకలు చోటుచేసుకున్నా nobody will keep quite, especially bidders will never keep quite. కాంపిటీటివ్ బిడ్డర్స్ ఎవరూ ఊరుకోరు. ఉదాహరణకు గత ప్రభుత్వకాలంలో 2003-04కు సంబంధించి దేవాదుల టెండర్ ప్రక్రియ ఏదైతే చేపట్టబడిందో ఆనాడు ఎస్.ఎస్.ఆర్ రేట్లు ఒక టి.ఎం.సి. వాటర్ లిఫ్ట్‌చేయటానికి రూ.172 కోట్లు తీసుకున్నారు. అది శ్రీపాదసాగర్ ప్రాజెక్ట్‌కంటే తక్కువ హైట్. ఈనాడు ఎల్లంపల్లి శ్రీపాదసాగర్ ప్రాజెక్ట్‌లో కేవలం రూ.154 కోట్లతో అంతకంటే ఎక్కువ ఎత్తులో లిఫ్ట్‌చేసేవిధంగా ఆమోదించి పనులు ప్రారంభించటం జరిగింది.

మిత్రులు దేవేందర్‌గౌడ్‌గారు పాదయాత్ర చేశారు. రాజకీయపార్టీ ప్రతినిధులు ఎవరైనప్పటికీ పాదయాత్రలు చేయటం తప్పుకాదు. మేము పాదయాత్రలను వ్యతిరేకించటంలేదు. కాని ఆయనగారు

చంద్రబాబునాయుడుగారు ముఖ్యమంత్రిగా ఉన్నటువంటి 9 సంవత్సరాల కాలంలో చక్రం తిప్పినటువంటివారు. ఆ 9 సంవత్సరాల కాలంలో తెలంగాణా ప్రాంతం తెలంగాణా ప్రాంతం నిర్లక్ష్యానికి గురైనా, గోదావరి నదీజలాలు వినియోగంలోకి రాకపోయినా, తాను ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తున్నప్పటికీ ఒక్క మాటైనా ఏ సందర్భంగానైనా మాట్లాడి ఉంటే మేము హర్షంవ్యక్తంచేసేవారము. నువ్వు అధికారంలో ఉండి, చేయగలిగే స్థానంలో ఉండి ఎన్నడూ కూడా ఒక్కనాడు ఒక్క పల్లెత్తు మాట మాట్లాడనివాడివి. ఈనాడు ఆశ్చర్యం ఏమంటే ప్రాణహితను ఎల్లంపల్లితో అనుసంధానించాలి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ రిపోర్ట్ ఇచ్చి దానిని స్పీకర్‌గారిద్వారా ప్రభుత్వానికి ఇస్తే ప్రభుత్వంద్వారా చేపడుతుండటం మీకు తెలుసు.

మీరు గోదావరి యుటిలైజేషన్ అథారిటి అని ఎక్స్‌పర్ట్స్‌తో ఒక కమిటి కాన్‌స్టిట్యూట్ చేశారు. గోదావరి యుటిలైజేషన్ అథారిటి కాన్‌స్టిట్యూట్ చేసిన 5 సంవత్సరాలలో వారు ఆ బాధ్యతను సక్రమంగా నిర్వర్తించారా? ఒక్కనాడైనా ప్రాణహితను ఎల్లంపల్లితో అనుసంధానం చేయటానికి అవకాశం ఉన్నదని చెప్పారా? ఈనాడు ఇచ్చంపల్లి ప్రాజెక్ట్ నిర్మాణంలో జరుగుతున్న జాప్యం దృష్టిలో పెట్టుకుని అందులో ఇమిడి ఉన్న అంతర్రాష్ట్ర వివాదాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రాణహిత-ఎల్లంపల్లిలను అనుసంధానిస్తే దాదాపు 165 టి.ఎం.సి.ల నీటిని ఎల్లంపల్లిలో లిఫ్ట్‌చేసి అక్కడనుండి నేరుగా మెదక్, రంగారెడ్డి జిల్లాలో ఉన్న 12 లక్షల ఎకరాలను సాగులోకి తీసుకువచ్చే అవకాశం ఉన్నది. పనులు చేపట్టాలన్న విషయం ప్రక్కనపెట్టండి, కనీసం మీరు ఆలోచన చేశారా? మీరు నిర్లక్ష్యం వహించి చేయని పనులను ఈనాడు ఈ ప్రభుత్వం చేస్తూ ఉంటే ప్రజలలో కనుమరుగై పోతామనే భావనతో గోదావరిపైన ప్రాజెక్ట్‌లను త్వరితగతిన చేపట్టాలని అనటం చాలా ఆశ్చర్యంగా ఉన్నది. ఇక్కడ ఆలస్యం జరుగుతుందని, పనులు త్వరితగతిన చేపట్టాలని వారు అంటారు. మీకు ఫ్యాక్ట్స్ అండ్ ఫిగర్స్ ఇస్తాను. ఫ్లడ్ ఫ్లో కెనాల్‌కు సంబంధించి వారు అధికారంలో ఉన్నటువంటి 9 సంవత్సరాల కాలంలో వెచ్చించింది కేవలం రూ.40 కోట్లు మాత్రమే, not even Rs.40 crores, it is only Rs.38.77 crores. వారు అధికారంలో ఉన్న 9 సంవత్సరాల కాలంలో ఫ్లడ్ ఫ్లో కెనాల్ మీద వెచ్చించిన మొత్తం కంటే ఎక్కువగా ఈనాడు 20 సంవత్సరాల కాలంలో ఫ్లడ్ ఫ్లో కెనాల్‌మీద రూ.661 కోట్లు పనులను ఎగ్జిక్యూట్ చేయటం జరిగింది. దయచేసి ఈ ప్రభుత్వంయొక్క చిత్తశుద్ధిని చూడండి.

ఫ్లడ్ ఫ్లో కెనాల్ మాత్రమే కాదు దేవాదుల ప్రాజెక్ట్ విషయం కూడా ఉన్నది. ప్రాజెక్ట్ నిర్మాణం చేపట్టాలనే ఆలోచన వస్తే దానికి ప్రాజెక్ట్ రిపోర్ట్, అది ఏవిధంగా చేపట్టాలనే ఆలోచన ఉంటుంది. ఆనాడు మన కాంగ్రెస్‌పార్టీ శాసనసభ్యులందరూ మిత్రులు శ్రీధర్‌బాబు నియోజకవర్గంలోని చారిత్రాత్మకమైన ఇచ్చంపల్లి ప్రాజెక్ట్ ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకుని దానిని చేపట్టాలని కోరుతూ అక్కడకు యాత్రగా వెళ్లాము. వారు హెలికాప్టర్‌లో ఒక శిలాఫలకం పెట్టుకుని వచ్చారు. ముందు ఇచ్చంపల్లి వస్తామని ప్రతిపాదన చేశారు. హెలికాప్టర్‌లో ఇచ్చంపల్లి వెళతామని బయలుదేరినవారు కాంగ్రెస్‌పార్టీ శాసనసభ్యులు అక్కడకు యాత్ర చేపట్టారు కాబట్టి ఇచ్చంపల్లి ప్రాజెక్ట్ చేపడితే కాంగ్రెస్‌పార్టీకి ఎక్కడ పేరొస్తుందేమోనని హెలికాప్టర్ ఇటు మలిపి దేవాదులలో శంకుస్థాపన చేశారు. లక్ష్మయ్యగారూ, ఇది నిజమా, అబద్ధమా, మీరు చెప్పండి. మీరు ఆనాడు కూడా సభలో ఉన్నారు. ఆల్‌రైట్, అక్కడో, ఇక్కడో, ఎక్కడో ఒకచోట చేపట్టారు. సంవత్సరం తిరగకముందే దేవాదుల ప్రాజెక్ట్ నిర్మాణం చేపట్టి నీరిస్తామని అన్నారు. లోకల్ బాడీస్ ఎలక్షన్స్, శాసనసభ ఎలక్షన్స్ లోపు కూడా నిర్మాణం పనులు మీరు పూర్తిచేయలేకపోయారు. మీరు తెలంగాణా ప్రాంతంపట్ల చూపిన వివక్షతను గుర్తించిన ప్రజలు మీకు ప్రతిపక్ష స్థానం చూపించారు. మీరు అధికారంలో ఉండి శంకుస్థాపన చేసిన 4 సంవత్సరాల

కాలంలో కేవలం మొబిలైజేషన్ అడ్వాన్సెస్ పేరిట రూ.45 కోట్లు మినహా ఒక్క రూపాయి కూడా ఖర్చుకాకపోతే ఈ 20 మాసాలలో రూ.989 కోట్లు, it may cross even Rs.1000 crores, నేను జనవరివరకు ఉన్న లెక్కలు మాత్రమే చెబుతున్నాను. రూ.989 కోట్లు ఖర్చుపెట్టి రేపు ఖరీఫ్‌కు దేవాదుల ఫేజ్-1 ద్వారా నీరు ఇవ్వబోతున్నాము. ఇది ప్రభుత్వంయొక్క చిత్తశుద్ధిని నేను మనవిచేస్తున్నాను. ఈరోజు ఫ్లడ్ ఫ్లో కెనాల్ కానీయండి, దేవాదుల ప్రాజెక్ట్ కానీయండి, ఎల్లంపల్లిలలో జరుగుతున్న పనుల వేగంచూస్తే తప్పకుండా మరలా రెండు సంవత్సరాల కాలం లోపల ఎల్లంపల్లి ప్రాజెక్ట్ నిర్మాణం పూర్తిచేసుకుని కనీసం కరీంనగర్ జిల్లాకు అయినా నీరందుతుందనే విశ్వాసం మాకు ఉన్నది.

మిడ్‌మానేరుగురించి మీకు తెలుసు. మిడ్‌మానేరు జలాశయాన్ని ఏర్పాటుచేసి మిడ్‌మానేరునుండి ఇందుర్తి ప్రాంతం, మా భారీనీటిపారుదలశాఖామాత్యుల లక్ష్మయ్యగారి జనగాం ప్రాంతం, ఇతరత్రా ప్రాంతాలకు నీరు అందించటానికి అవకాశం ఉన్న దీనిని పూర్తిగా మాయంచేశారు. ఈ ప్రభుత్వం మిడ్‌మానేరుయొక్క ఆవశ్యకతనుగుర్తించి టెండర్ ప్రక్రియను పూర్తిచేసి పనులు ప్రారంభించబోతున్నారు.
మ.12.50

ఆ విధంగా ఫ్లడ్ ఫ్లో కెనాల్ కానివ్వండి, దేవాదుల కానివ్వండి, ఎల్లంపల్లి కానివ్వండి, మిడ్ మానేరు కానివ్వండి........ అన్ని కూడా ఈ ప్రభుత్వం ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేస్తుంది. ఎల్లంపల్లికి సంబంధించి NTPC వారికి ఉపయోగించుకోవడానికి దాదాపు 6.5 టి ఎం సి లు రెగ్యులర్‌గా అవసరం. ఆనాడు కేవలం పది సంవత్సరాల అగ్రిమెంటుతో SRSP నీరు ఇవ్వడానికి ముందుకొస్తే వాళ్లు నీటి జలాశయం ఏర్పాటు చేసుకోకపోవడం వల్ల ఈ రోజున ఇప్పటికీ ఈ 6.5 టి ఎం సి లపై మనకు హక్కు వున్నా వారు వినియోగించుకుంటున్నారు. ఆ 6.5 టి ఎం సి లకు సంబంధించి ఎక్స్‌పెండిచర్‌ను భరించడానికివారు నాటి నుండి సిద్ధమైనప్పటికీ గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా ఈ రోజున క్రింద వున్న ప్రాంతాలైన పెద్దపల్లి, మంథని కొంతవరకు మేడారం నియోజకవర్గాలు నష్టపోవడం జరుగుతున్నది. దీనికి బాధ్యత కేవలం గత దశాబ్ద కాలంలో అధికారంలో వున్న తెలుగుదేశం ప్రభుత్వమే వహించాలని నేను తెలియజేస్తున్నాను. ఎల్లంపల్లి దేవాదులనే కాదు దమ్ముగూడెం ప్రాజెక్టు ఏదైతే వుందో వెనుకబడిన ఖమ్మం జిల్లాకు కావలసిన నీరు అందించడానికి లిఫ్ట్ ప్రతిపాదన చేసి టెండర్స్ కూడా పిలవడం జరిగింది. ఈ రోజు నిధుల ఎక్స్‌పెండిచర్ గురించి పాయింటవుట్‌చేయడం జరిగింది అధ్యక్షా. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఈ 20మాసాల కాలంలో తెలంగాణా, ఆంధ్ర, రాయలసీమ ఏ ప్రాంతంలో ఏ మేరకు నిధులు వెచ్చించారన్న విషయాలకు సంబంధించి చెప్పాల్సివస్తే తెలంగాణా ప్రాంతానికి సంబంధించిన ప్రాజెక్టుల విషయంలో అవి మేజర్ కానివ్వండి, మీడియం కానివ్వండి రు. 3400 కోట్లు బై ది ఎండ్ ఆఫ్ జనవరి, 2006 ఖర్చు చేస్తే బోత్ ఆంధ్ర, రాయలసీమ పుట్ టుగెదర్ రు. 2700 కోట్లు అంటే ఆంధ్ర ప్రాంతంలో రు. 1800 కోట్లు, రాయలసీమ ప్రాంతంలో రు. 893 కోట్లు...... అంటే రు. 900 కోట్లు అనుకోండి...... ఈ విధంగా మొత్తం రు. 2700 కోట్లు బోత్ ఆంధ్ర అండ్ రాయలసీమ పుట్ టుగెదర్ ఖర్చు చేయడం జరిగింది. గత ప్రభుత్వం కారణంగా తెలంగాణా ప్రాంతం వెనుకబడిందని, వేర్పాటువాదం ఇక్కడ బలపడడం జరిగిందని, దానిని దృష్టిలో పెట్టుకొని ఈ ప్రజానీకానికి న్యాయం చేయాలన్న ఒక భావనతో ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత 40 శాతం విస్తీర్ణతతో వున్న తెలంగాణా ప్రాంతంలో 60 శాతం నిధులు ఖర్చు చేసి, 60 శాతం విస్తీర్ణతతో వున్న ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాలలో 40 శాతం నిధులు ఖర్చు చేసిన ఈ ప్రభుత్వాన్ని, ఈ ప్రభుత్వ విధానాన్ని మీరు హర్షించవలసింది పోయి తప్పు పట్టడం ఇది మీకు సమంజసమా, మీకు న్యాయమా అని నేను మిమ్మల్ని అడుగుతున్నాను.

ఆల్‌రైట్.......... పోలవరం గురించి మీరు మాట్లాడుతున్నారు. పోలవరం గురించి మీకు తెలుసు. గోదావరి నది చివరి ఒడ్డున దీనిని చేపడుతున్నారు. గోదావరి నీరు వృధాగా సముద్రంలో కలవబోతున్న నీటితో ప్రాజెక్టు నిర్మాణం చేసి వైజాగ్‌లో ఇండస్ట్రియల్ పర్పస్ కోసం కానివ్వండి, త్రాగు నీటి కొరకు కానివ్వండి, అదేవిధంగా తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాలలోని అప్‌ల్యాండ్ ఏరియాస్‌కు కాని నీరిస్తే తప్పేంటి? ఈ నీటిని వారు వాడుకోవడాన్ని తప్పుపడతారా? పైన అప్పర్ రీచ్‌లో మనకు కావలసిన ప్రాజెక్టులను చేపట్టి వృధాగా సముద్రంలో కలవబోతున్న నీటిపై ప్రాజెక్టుల నిర్మాణం చేసి ఈ రాష్ట్రంలోని అప్‌ల్యాండ్ ఏరియాస్‌లో వున్న వెనుకబడిన ప్రాంతానికి నీరందించడానికి సంకల్పిస్తే దానిని అభ్యంతర పెట్టడం ఏమైనా సమంజసమా అధ్యక్షా? మీరే చెప్పండి. ఈ రోజు ట్రైబల్స్ నిరాశ్రయులవుతున్నారన్న ఒక వాదన వుంది. ఏ ప్రాజెక్టు నిర్మాణం చేయాలన్నా ఆ ప్రాజెక్టు నిర్మాణ పరిసరాల్లో క్యాచ్‌మెంట్ ఏరియాలో వున్న వారు నిరాశ్రయులవడం సహజం. కాని ఒకటి...... నిరాశ్రయులు కాబోతున్నది గిరిజనులు కానివ్వండి, మరెవరైనా కానివ్వండి...... ఆర్ ఆర్ యాక్ట్ ఏదైతే వుందో...... గత ప్రభుత్వం కానివ్వండి...... ఈ రోజు యావద్భారతదేశంలో నిర్వాసితులకు పునరావాసం కల్పించే ప్రక్రియలో భాగంగా ఏ రాష్ట్రం చేపట్టనంత పెద్దయెత్తున ల్యాండ్ టు ల్యాండ్...... హౌస్ టు హౌస్...... వారు కోల్పోయిన భూములకు మానిటరింగ్ కాంపెన్జేషన్ అన్నివిధాలుగా వారికి కల్పించి, వారికి పునరావాసం ఏర్పాటు చేసి ప్రాజెక్టుల నిర్మాణం చేయడానికి

ఈ ప్రభుత్వం ఉపక్రమిస్తే....... మరి నాకు ఆశ్చర్యం.... అధ్యక్షా...... నేను ఒకటే అడుగుతున్నాను. గిరిజనులు అడవితల్లి బిడ్డలని మా మిత్రులు చెబుతున్నారు. ఆల్‌రైట్ ...... అడవితల్లి బిడ్డలంటే ఎప్పుడూ అడవుల్లోనే వుండాలా? అడవి తల్లి బిడ్డలంటే ఈ వెలుగును చూసే భాగ్యం వారికి లేదా అధ్యక్షా? ఈ రోజున అడవుల్లో వారికి కావలసిన వృత్తి లేదు, ఉపాధి లేదు. ఈ రోజున వారు పట్టణాలకు వచ్చి రిక్షాలు తొక్కుతున్నారు. ఈ రోజు హైదరాబాదు నగరంలో కూలీ చేసే కార్మికుల్లో 50 శాతం గిరిజనులనే చూస్తారు. గిరిజనులు కాబట్టి అడవి తల్లి బిడ్డలుగా శాశ్వతంగా అడవిలోనే వుండాలంటే ఇది ఎక్కడి న్యాయం అధ్యక్షా? అడవితల్లి బిడ్డలకు వెలుగు చూపాల్సిన అవసరం లేదా? వారికి కూడా సిటిజెన్‌షిప్ కల్పించాల్సిన అవసరం లేదా? వారికి కూడా పట్టణాలలో మనం చేపడుతున్న కార్యక్రమాలను పొందడానికి హక్కు వుంది. దయచేసి మీరు ఏ ప్రాజెక్టు కానివ్వండి, పోలవరం కానివ్వండి మరేదైనా ప్రాజెక్టు కానివ్వండి తెలంగాణా ప్రాంతానికి తప్పకుండా ప్రాధాన్యత ఇవ్వండి. అలాగే ఆంధ్ర ప్రాంతానికి ప్రాధాన్యత ఇవ్వండి ఉత్తరాంధ్ర కానివ్వండి, అదే విధంగా రాయలసీమ ప్రాంతం కానివ్వండి. ఎగువ ప్రాంతం కానివ్వండి అన్ని ప్రాంతాలకు ప్రాధాన్యత ఇవ్వాలి. ఆ విధంగా మనలో ఈర్ష్యా భావం అనేది రాకూడదు. ఈ రోజున పోలవరం కానివ్వండి, పులిచింతల కానివ్వండి ఏదైనా సరే మనలో ఈ ర్ష్యాభావం లేకుండా వుండాలి. ఈ రోజున మహబూబ్‌నగర్ జిల్లాలో అధ్యక్షా ....... గడచిన ప్రభుత్వ అధినేత చంద్రబాబు నాయుడు గారు మహబూబ్‌నగర్ జిల్లాను అడాప్ట్ చేసుకున్నామన్నారు. మరి అడాప్షన్ అంటే ఏమిటో నాకు అర్థం కాలేదు. నీవు అడాప్ట్ చేసుకున్న మహబూబ్‌నగర్ జిల్లాకు సాగునీరు కల్పించడానికి నీవు చేసిన చర్యలేమిటని నేను అడుగుతున్నాను. ఈరోజు క్రిష్ణా నదికి సబంధించి ఆల్‌మట్టి డ్యాం ఏదైతే వుందో కర్నాటక ప్రభుత్వం ఎత్తు పెంచుతూ వుంటే నీకు కనీసం కానరాలేదే? ఆల్‌మట్టి డ్యాం ఎత్తు పెంచడం వల్ల క్రింద నున్న మన ప్రాంతానికి వచ్చే నీరు రాకుండా పోతుందన్న ఆలోచన నీకు రాలేదే? బచావత్ ట్రిబ్యునల్ అవార్డు ప్రకారం మిగులు జలాలను వినియోగించుకునే హక్కు మనకుంది. మిగులు జలాలే కానివ్వండి, అస్యూర్డ్ వాటరే కానివ్వండి వాటిని వినియోగించుకోవడానికి నీవు చేపట్టిన చర్యలేమిటని నేను అడుగుతున్నాను. ఈ రోజు మహబూబ్‌నగర్ జిల్లాకు సంబంధించి భీమా లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు వల్ల దాదాపు రెండు లక్షల ఎకరాలు సాగులోకి తెచ్చే అవకాశమున్న ప్రాజెక్టు నీవు అధికారంలో వున్న తొమ్మిది సంవత్సరాల

కాలంలో కేవలం రు. 33 కోట్లే ఖర్చు పెడితే ఈ ప్రభుత్వం వచ్చిన ఈ 20 మాసాల కాలంలో రు. 140 కోట్లు ఖర్చు పెట్టి ప్రాజెక్టు పూర్తి చేసుకుంటున్నాము. ఈ సంవత్సరంలో రు. 200 కోట్లు అలొకేట్ చేయడం జరిగింది. అట్లాగే కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును తొమ్మిది సంవత్సరాల మీ కాలంలో మర్చేపోయారు. మీ కాలంలో కేవలం రు. 12 కోట్లే కేటాయించారు. ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత గడచిన 20 మాసాల కాలంలో రు. 331 కోట్లు ఖర్చు పెట్టడమే కాక 2006-07లో రు. 240 కోట్లు కేటాయింపులు చేస్తే......... హర్షించవలసింది పోయి ఈ విధంగా మాట్లాడతారా? మీ నిర్లక్ష్యం గురించి నాకు తెలియడం లేదు అధ్యక్షా...... ఆ రోజున నెట్టెంపాడు ప్రాజెక్టును మీరు అసలు ఉపక్రమించనే లేదు. దానికి అసలు అరంభమే చేయలేదు. ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత 20 మాసాల కాలంలో రు. 112 కోట్లు ఖర్చు చేసి ఈ సంవత్సరం బడ్జెట్‌లోవంద కోట్ల రూపాయలు కేటాయించడం జరిగింది. కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా ఈ మూడు ప్రాజెక్టులపై ఈ 2006-07 సంవత్సరంలో రు. 540 కోట్లు కేటాయింపులు చేసి నిర్ణీత కాలవ్యవధిలో ఈ ప్రాజెక్టులను పూర్తి చేసి ఏడు లక్షల 40 వేల ఎకరాలకు సాగునీరు అందించడం ద్వారా వెనుకబడ్డ మహబూబ్‌నగర్ జిల్లా రైతాంగాన్ని ఆదుకోవాలన్న ప్రభుత్వ సంకల్పం అనేది ఏదైతే వుందో దాని వల్ల మొత్తం భారత దేశంలోనే ఆంధ్ర రాష్ట్రం అభినందింపబడుతున్నది. ఈ రోజు మన ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ గారు మన గౌరవ ముఖ్యమంత్రి గారిని అభినందించారు.

మ. 1.00

జాతీయ స్థాయిలో సాగునీటి సౌకర్యాలు ఏ విధంగా పూర్తి చేస్తారనే సమయంలో మన ముఖ్యమంత్రి గారు ముందుకు వచ్చారు. తెలంగాణా ప్రాంతం అభివృద్ధి గురించి మాత్రమే మాట్లాడితే తప్పు, రాయలసీమ ప్రాంతం కూడా వెనకబడి ఉంది. ఆ ప్రాంతానికి కూడా సౌకర్యాలు కల్పించవలసిన బాధ్యత ఈ ప్రభుత్వం పైన ఉంది. పోతిరెడ్డి పాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా వరద సమయంలో, వృధాగా పోయే నీటిని మళ్లింపు చేసుకొని రాయలసీమ ప్రాంతానికి సాగునీటి సౌకర్యం అందించే ప్రయత్నంలో భాగంగా నీళ్లు కల్పిస్తే తప్పు ఏమిటి? సముద్రంలో వృధాగా పోయినా వారికి అభ్యంతరం లేదు. ఈ రాష్ట్రంలో వెనుకబడిన ప్రాంతాలకు సాగు నీరు అందించడమే ఈ ప్రభుత్వ లక్ష్యం. ఇవ్వాళ మనకు రావలసిన నీరు, అషూర్డ్ వాటర్ , నాగార్జున సాగర్ కమాండ్ ఏరియా అయితేనేమి, ఎస్.ఎల్.బి.సి, ఎస్.ఆర్.బి.సి నుండి మనకు రావలసిన అషూర్డ్ వాటర్ పోతే తప్పు. గోదావరి నుండి సముద్రంలోకి చాలా నీరు వృధాగా పోయిందని మన సోదరి ఇప్పుడే అన్నారు. అటువంటి నీటిని వాడుకోవాలి. పోలవరం అయితేనేమి, పోతిరెడ్డి పాడు అయితేనేమి, మన ప్రాంతానికి రావలసిన సాగునీరు మనకు అందిస్తే అది అందరూ హర్షించాలి. గౌరవ ముఖ్యమంత్రి గారు సంకల్పించిన జలయజ్ఞం పూర్తి స్థాయిలో కార్యరూపం దాలిస్తే కేవలం అయిదు సంవత్సరాల కాలంలో అధనంగా ఇంకో డబ్బై లక్షల ఎకరాలకు సాగునీరు అందించే అవకాశం ఉంటుంది. అది అందరూ ఆలోచించాలి. వాళ్లకు ఆ అవకాశం ఇచ్చాడు ఆ భగవంతుడు. ఆనాడు ఎన్.టి. రామారావు గారు చెయ్యలేకపోతున్నాడని ఆయనను దించేసారు. మాకు అభ్యంతరం లేదు. అది వాళ్ల పార్టీ, వాళ్ల ముఖ్యమంత్రి ఎవరో వాళ్లు డిసైడ్ చేసుకోవచ్చు. మళ్లీ వచ్చాడు, ఏదైనా మంచిపని చేసాడా అంటే లేదు.

అధ్యక్షా, గుత్తా, అలీ సాగర్ మన గౌరవ స్పీకర్ గారి జిల్లాకు సంబంధించినది. వాళ్లు పూర్తిగా నిర్లక్ష్యం చేసారు. గుత్తా అలీ సాగర్‌కు సంబంధించి ఇరవై సంవత్సరాల లోపల గుత్తా పై 94 కోట్ల రూపాయలు అలీసాగర్ పై 112 కోట్ల రూపాయలు కేటాయించారు. ఈ సంవత్సరం అలీ సాగర్‌కు, 71 కోట్ల రూపాయలు అదే విధంగా గుత్తాకు యాభై కోట్ల రూపాయలు కేటాయించారు. మొన్న గౌరవ ముఖ్యమంత్రి గారు ప్రాజెక్టు

పై రెవ్యూ చేయడం జరిగింది. నిర్ణీత కాలవ్యవధిలో ప్రాజెక్టులు చేపట్టాలని సంకల్పించింది. అవి ఏదశలో ఉన్నాయి, ఏ విధంగా పనులు జరుగుతున్నాయని మొన్న రెవ్యూ చేసారు. నీల్వాయి, గొల్లవాయి, పెద్దవాగు ఏదైనా కానివ్వండి. అదిలాబాద్ జిల్లాలోని గిరిజన ప్రాంతానికి చెందిన ప్రాజెక్టు ఒకటి ఉంది. గడచిన ఇరవై మాసాలలో 93 కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి, ఈ బడ్జెట్‌లో 126 కోట్ల రూపాయలు కేటాయించడం జరిగింది. భారీ నీటిపారుదల రంగమే కాదు మీడియం ఇరిగేషన్‌కు, మైనర్ ఇరిగేషన్‌కు కూడా ప్రాధాన్యత ఇచ్చారు. తెలంగాణాలో మేజర్ ఇరిగేషన్‌కు ఇరవై ఆరు వందల అరవై ఆరు కోట్ల రూపాయలు కేటాయించడం జరిగింది. ఆంధ్ర ప్రాంతానికి 253 కోట్ల రూపాయలు, రాయలసీమ ప్రాంతానికి 1330 కోట్ల రూపాయలు కేటాయించడం జరిగింది. We are getting 45 percent. నలభై అయిదు శాతం మేజర్ ఇరిగేషన్‌లో నిధులు కేటాయించారు. నిధులు కేటాయించబడడం ఒక ప్రక్రియ. Budget Estimation is like a Line Estimation. ఏ ప్రాజెక్టు నిర్మాణం త్వరితగతిన చేపట్టడం జరుగుతుందో దానికి అనుగుణంగా నిర్మాణ వ్యయాన్ని కూడా మళ్లింపు చేసుకునే అవకాశం ఉంటుంది. ఇది గత సంవత్సరం జరిగింది. మీడియం ఇరిగేషన్‌లో అరవై అయిదు శాతం తెలంగాణా ప్రాంతానికి కేటాయించడం జరిగింది. తెలంగాణా ప్రాంతానికి సంబంధించి మీడియం ఇరిగేషన్ ప్రాజెక్టులకు 592 కోట్ల రూపాయలు కేటాయిస్తే, ఆంధ్ర ప్రాంతానికి 311 కోట్ల రూపాయలు, రాయలసీమ ప్రాంతానికి 55 కోట్ల రూపాయలు కేటాయించారు. ఆంధ్రా,రాయలసీమకు ముప్పై అయిదు శాతం అయితే, తెలంగాణా ప్రాంతానికి అరవై అయిదు శాతం నిధులు కేటాయించారు. చిన్న నీటివనరులు తెలంగాణా ప్రాంతంలో అవసరం. సౌకర్యాలు ఎగ్జాస్ట్ అయ్యాయి. తెలంగాణా ప్రాంతం దశాబ్దాల తరబడి నిర్లక్ష్యానికి గురైనది కాబట్టి ఇప్పుడు ఇక్కడ ప్రాధాన్యత ఇవ్వవలసి వస్తుంది. మైనర్ ఇరిగేషన్‌కు సంబంధించి 550 కోట్ల రూపాయలు కేటాయిస్తే నాలుగు వందల కోట్ల రూపాయలు తెలంగాణాలో ఖర్చు చేసే అవకాశం ఉంది. ఇది అందరూ హర్షించాలి. ప్రాంతీయ బేధాలకు తావు లేదు. పోలవరం ప్రాజెక్టు కోస్తా ఆంధ్రా ప్రాంతాలకు సౌకర్యం కల్పించే ప్రాజెక్టు. పోతిరెడ్డిపాడు రాయలసీమ ప్రాంతానికి సౌకర్యం కల్పించే ప్రాజెక్టు. వాటిని చేపట్టండి. ఈ రాష్ట్రానికి సాగునీరు అందించగలిగే ఏ ప్రాజెక్టును మేము వ్యతిరేకించే అవకాశం లేదని మనవిచేసన్నాను.

ప్రాణహిత ప్రాజెక్టు ఉంది. ఎల్లంపల్లి, ప్రాణహిత అనుసంధానం ఏదైతే ఉందో అది గౌరవ ముఖ్యమంత్రి గారి మదిలో ఉన్న ఆలోచన అని ఈ సందర్భంగా మనవిచేస్తున్నాను. ఇచ్చంపల్లి ప్రాజెక్టు నిర్మాణంలో జరుగుతున్న జాపాన్ని అంతర్ రాష్ట్ర నదీ జలాల వివాదాలను దృష్టిలో పెట్టుకొని ఆల్టర్నేట్‌గా తెలంగాణా ప్రాంతాన్ని ఏ విధంగా ఆదుకోవాలనే ఆలోచనతో ప్రాణహితను డైవర్ట్ చేసి, లిఫ్ట్ చేసి, ఎల్లంపల్లిలో కలిపినట్లయితే, కరీంనగర్ మిడ్‌మానేరు నుండి మెదక్, రంగారెడ్డి జిల్లాలకు నీరు అందించడం అవుతుందని ఆరోజు చెప్పారు. ఇ.పి.సి విధానంతో తెలంగాణా ప్రాంత వాసుల యొక్క దాహార్తిని తీర్చాలని ఈ సందర్భంగా మనవి చేస్తున్నాను. పోలవరం ప్రాజెక్టుకు చారిత్రాత్మకమైన గుర్తింపు ఉంది. అదే విధంగా ఇచ్చంపల్లి నిర్మాణం చేపట్టడానికి ప్రభుత్వానికి ఏ విధమైన సంకోచం లేదు. అంతర్ రాష్ట్ర వివాదాన్ని దృష్టిలో పెట్టుకొని, తెలంగాణా ప్రాంతానికి సంబంధించిన ఇచ్చంపల్లి ప్రాజెక్టు వెనువెంటనే చేపట్టి, తెలంగాణా ప్రాంత ప్రజల చిరకాల వాంఛ తీర్చాలని కోరుతున్నాను. దీనితోబాటు ఎలక్ట్రిసిటీ అధ్యక్షా.

మ.1.10

విద్యుత్‌కు సంబంధించి ఆనాడు రాష్ట్రంలో కాంగ్రెసు పార్టీ అధికారంలోకి వస్తే రైతాంగాన్ని ఆదుకోవాలని, వారి సంక్షేమం కోసం ఉచిత విద్యుత్ అందిస్తామని అంటే వారు అపహాస్యం చేశారు. కాంగ్రెసు పార్టీ ఉచిత కరెంటు ఇస్తే ఆ తీగలమీద బట్టలు ఆరవేసుకోవచ్చని అన్నారు. కాని వారే ఇప్పుడు మేము కూడా ఇచ్చేవారమని అంటున్నారు. 24 లక్షల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్సు వల్ల ప్రభుత్వం ఏ మేరకు భారం మోస్తుందని కాదు. ఈ ప్రభుత్వం రైతుకు ప్రాధాన్యత ఇస్తుందనే భావన కలిగించడానికి, వారికి ఆత్మస్థైర్యాన్ని కలిగించడానికి ఉచిత విద్యుత్ రు.300 కోట్లు ప్రభుత్వంపై భారం పడుతుంది. అది భారమని కాదు. రైతుకు అండగా నిలబడుతుందనే భావన కలిగించడానికి వారికి ఆత్మవిశ్వాసాన్ని కలిగించడానికి ఉచిత విద్యుత్ ఇవ్వడమే కాక ఏడు గంటల విద్యుత్ సరఫరా చేయడం జరిగింది. దక్షిణాది గ్రిడ్ కర్నాటక, తమిళనాడు, కేరళ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలకు సంబంధించింది. మిగిలిన రాష్ట్రాల వారు వాడుకోవలసిన దాని కంటే ఎక్కువ విద్యుత్ వాడుకుంటున్నామని అంటున్నారు. 10వేల మిలియన్ యూనిట్సు వాడుకుంటే రు.5 కోట్లు పన్నులు చెల్లించాలి. ఎక్కువ విద్యుత్ వాడుకోవడం వల్ల ఈ రాష్ట్రంపై ప్రతి నిత్యం రు.5 కోట్లు అదనపు భారం పడుతుందని తెలియచేస్తున్నాను. ఈ విధంగా రైతాంగానికి 7గంటలు కరెంటు ఇస్తూ సేవలందిస్తుంటే తొమ్మిది గంటలు ఇవ్వండని అంటున్నారు. రాష్ట్రంలో 130 మిలియన్ యూనిట్సు నుండి 140 మిలియన్ యూనిట్సు విద్యుత్ వినియోగం అయిన నాడు విద్యుత్ సరఫరా చేయలేక 9 నుండి 7 గంటలకు తగ్గించారు. అంటే ఇప్పుడు మనం 170 మిలియన్ యూనిట్సు వినియోగించుకుంటున్నాము. అది ఆ గ్రిడ్‌కు సాధ్యమా? ఎక్కడా ఒక్క సెంటు భూమి తడి ఆరిపోతే ఆ ప్రాంత విద్యుత్ అధికారులు దాని భాధ్యత చేపట్టాలని అన్నారు. దేవుని దయ వల్ల పంటలు కాపాడబడ్డాయి. పదిహేను రోజులలో ఐడి క్రాప్ మొక్కజొన్న చేతికి వస్తుంది. మిగిలిన వరి కూడా చేతికి వస్తుంది. విద్యార్థులకు ఇది ఎగ్జామ్స్ పీరియడ్. ఏ పరిస్థితులలో కరెంట్ లేక అసౌకర్యానికి గురి కాకూడదని చూస్తున్నాము. వారు తొమ్మిది సంవత్సరాలు అధికారంలో ఉంటే ఏడు సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచారు. మన కాంగ్రెసు పార్టీ అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలైంది, అయినా విద్యుత్ ఛార్జీలు పెంచలేదు సరికదా, వారిపై భారాన్ని ఎలా తగ్గించాలా అని మా ప్రభుత్వం చూస్తున్నది. పారిశ్రామిక రంగానికి టారిఫ్ తగ్గింపు చేయడం ఈ భారతదేశ చరిత్రలోనే జరగ లేదు. ఆ ఘనత ఆంధ్ర రాష్ట్రానికే దక్కుతుంది. డొమెస్టిక్ రంగానికి వస్తే విద్యుత్ బకాయిలు ఉన్న వారికి సర్‌ఛార్జి మినహాయింపు ఇచ్చి, వారు చెల్లించవలసిన గృహ వినియోగం బకాయిలను మూడు నెలల వాయిదలలో చెల్లించే అవకాశాన్ని కల్పించడం జరిగింది. గత ప్రభుత్వ కాలంలో ఎస్‌సి, ఎస్‌టి లకు సంబంధించి విద్యుత్ బకాయిలను రద్దు చేసినట్లయితే ఆ ఉత్తరువులను సభలో పెట్టండి. ఇప్పుడు మీరువచ్చి వసూలు చేస్తున్నారని అంటున్నారు. ఎందుకు అబద్దాలు ఆడుతారు? ఎన్నికలు దగ్గరకు వస్తున్నాయని ఓటర్లను ఆకర్షించడానికి విద్యుత్ బకాయిలు రద్దు చేశామని చెప్పడం సమంజసమా? ఎస్‌సి, ఎస్‌టిలను ఆదుకోవాలని వారి సర్‌ఛార్జ్ రద్దు చేయడమేకాదు. చెల్లింపు విషయంలో బకాయిలను వాయిదాల పద్దతిలో నెలకు వంద రూపాయల చొప్పున కట్టే విధంగాఅవకాశం కల్పించి ఈ ప్రభుత్వం తోడ్పడింది. పారిశ్రామిక వేత్తలు, వ్యవసాయ రంగం, వినియోగదారులు, గృహ అవసరాల, దళితులు , ఎస్‌టిలు కాని విద్యుత్‌లో ...........

( మైక్ కట్ చేయబడింది.)

దేశంలోనే క్రిసిల్ రేటు పొందడానికి ఏ హెచ్ స్టార్టెడ్ దట్ –3 పర్సెంట్. ఉచిత విద్యుత్ అందించడం వల్ల విద్యుత్ శాఖపై పడుతున్న ఆర్థిక భారాన్ని –3తో ఉపక్రమించి దేశంలోనే ప్రథమ స్థానాన్ని పొందిన ఘనత ఈ రాష్ట్రానికి దక్కుతుంది. ఇంతగా పని చేస్తుంటే విమర్శించడానికి వారికి నోరెలా వస్తుంది అధ్యక్షా? ఇంతవరకు 11 వేల మెగావాట్లు మన ఉత్పత్తి ప్రతి సంవత్సరం అవుతుంటే రాబోయే ఐదు సంవత్సరాల కాలంలో అడిషన్ 5445 మెగావాట్లు ఉత్పత్తి దీనికి జోడించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపడుతుంది. జనరేషన్‌కు గతంలోలాగా ప్రయివేటు కంపెనీలకు ఇచ్చి వినియోగదారులపై భారం పడేలా కాకుండా పవర్ ఫైనాన్స్ కార్పోరేషన్, రూరల్ ఎలక్ట్రిఫికేషన్‌ద్వారా ఆర్థిక సహాయం పొంది జెన్‌కో, ధర్మల్ ప్రాజెక్ట్సు ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేసి విద్యుత్ వినియోగదారులకు అండగా నిలబడాలని రాజకీయాలకు అతీతంగా ఈ ప్రభుత్వం సంకల్పించడం జరిగింది. మనందరం సంతోషించదగ్గ విషయం .

రోడ్లు, కమ్యూనికేషన్ రంగంలో డెవలప్‌మెంట్ ప్రధానమైంది. కమ్యూనికేషన్ రంగంలో ప్రభుత్వం ఎన్ని చర్యలు చేపడుతున్నా ఇంకా అభివృద్ధి చెందలేదు. కరీంనగర్‌కు సంబంధించి జక్కంపూడి రామ మోహన్ రావుగారు ఇన్‌ఛార్జి మంత్రిగారు . తెలంగాణా ప్రాంతం మెదక్, కరీంనగర్, ఆదిలాబాద్ మూడు జిల్లాలకు సంబంధించి ఒకటే రోడ్డు ఉంది. అది రాజీవ్ రహదారి . మాకు రైలు సౌకర్యం లేదు. సిద్ధిపేట , కరీంనగర్, ఆదిలాబాద్ లక్షంపేట కాని, ఆదిలాబాద్‌కు కాని రైలు సౌకర్యం లేదు.
మ. 1.20

ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆర్థిక సహాయంతో నిర్మాణం చేపట్టాలని అన్నారు, ఇంత వరకూ దాని రిపేర్‌కు చర్యలు చేపట్టలేదు. షామీర్‌పేట్‌లో టోల్ గేట్ పెట్టారు. టోల్ ట్యాక్స్‌ను ప్రభుత్వం రద్దు చేసింది. టోల్ ట్యాక్స్ షామీర్‌పేట దగ్గర ఎందుకు వసూలు చేస్తున్నారంటే, మార్చి 31 వరకు ఉంది అని అన్నారు. టోల్ ట్యాక్స్ వసూలు చేస్తే చెయ్యండి కాని దానిని నేషనల్ హైవేగా మార్చి ఫోర్ లైన్ రోడ్డుగా డెవలప్ చేస్తే, మూడు జిల్లాలకు సంబంధించి ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం దొరుకుతుంది. సికిందరాబాద్ పెరేడ్ గ్రౌండ్స్ నుండి అల్వాల్‌కి ఒక ఫ్లై ఓవర్ వెయ్యాలని మనవిచేస్తున్నాను. ఎందుకంటే, ముఖ్యమంత్రి గారు ఫ్లైఓవర్స్‌కు ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. అందరూ కూడా కరీంనగర్ రావడానికి ఉపయోగపడుతుంది. ప్రభుత్వానికి నిధులు కేటాయించాలంటే ఇబ్బంది కావొచ్చు. పరేడ్ గ్రౌండ్స్ నుండి ఆల్వాల్‌కు 5 కి.మి ఉంటుంది. ఇక్కడి నుండి అక్కడికి బి.ఒ.టి వేస్తే వాడే టాక్స్ కలెక్ట్ చేసుకుంటాడు. దయచేసి ఈ చిన్న కోరికను మన్నించాలని మనవిచేస్తున్నాను. సాగునీటికి సంబంధించి ప్రభుత్వం చాలా ప్రాధాన్యత ఇస్తుంది. ఎవరైనా మంచిపని చేస్తే విమర్శలు సహజమే. ఏమి చెయ్యని వాడిని ఎవరూ తప్పు పట్టరు, ఏదైనా చేస్తే మాత్రం తప్పుపడతారు. విమర్శలు చేసే వారి గురించి ఆలోచించకుండా, జలయజ్ఞం కార్యక్రమాన్ని నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేసి, ఈ రాష్ట్రాన్ని హరితాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దాలని మనవిచేస్తూ సెలవుతీసుకుంటున్నాను.

శ్రీ పి. శశిధర్ రెడ్డి (మెదక్): అధ్యక్షా, ఆంధ్రరాష్ట్రం ఏర్పడినప్పటినుండి, స్వర్గీయ భారత మొదటి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ తరువాత ఇరిగేషన్‌కు మన రాష్ట్రంలో ఇంత పెద్ద ఎత్తున జలయజ్ఞం అనే పేరిట ఒక కార్యక్రమాన్ని ప్రారంభించడం, ఇది పూర్తిగా మండుటెండలో దాదాపు పదహారు వందల కి.మి పాదయాత్ర చేసి, రైతు సమస్యలు ప్రత్యక్షంగా తన కళ్లతో చూసినందుకే ఈ జలయజ్ఞాన్ని ప్రారంభించిన ముఖ్యమంత్రి గారికి తెలంగాణా తరపున సదాసదా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. బడ్జెట్‌లో ఈ తెలంగాణా ప్రాంతానికి సింహ భాగం వేసారు. 43.16 శాతం ఈ బడ్జెట్‌లో కేటాయించడం, మరీ ముఖ్యంగా ఈ

ప్రభుత్వం ఏర్పడిన పది నెలలలోనే నాలుగు వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసిన ఘనత ఈ ప్రభుత్వానికి దక్కుతుంది. 2400 కోట్ల రూపాయలు కేవలం ఒక్క తెలంగాణాలో ఖర్చు చెసిన విషయం గుర్తు చేస్తున్నాను. 9 సంవత్సరాల తెలుగుదేశం ప్రభుత్వ పాలనలో కేవలం 734 కోట్ల రూపాయలు ఖర్చు చేశారని తెలియజేస్తున్నాను. రైతు లేనిదే రాజ్యం లేదు. రైతు కన్నీర జేస్తే రాజ్యాలకు రాజ్యాలు పడిపోతాయని తెలియజేస్తున్నాను. 2004లో ఈ రాష్ట్రంలో ఉన్నటువంటి రైతులందరూ నిరూపించిన విషయం గుర్తు చేస్తున్నాను. 9 సంవత్సరాల తెలుగుదేశం ప్రభుత్వ పాలనలో రైతుల కళ్ల నుండి రక్తం కారింది. మెదక్‌లో సింగూరు ప్రాజెక్టు ఉంది. 1905 వ సంవత్సరంలో అప్పటి నిజాం సర్కారు కట్టిన సింగూరు ప్రాజెక్టు క్రింద ఉన్న ఘన్‌పూర్ ఆనకట్ట ద్వారా 48 వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. అప్పటి ప్రభుత్వాన్ని మేము వెళ్లి అడిగితే ఒక్క చుక్క నీరు కూడా ఇవ్వము, రక్తం బొట్టు ఇస్తామని అన్నారు. వంద సంవత్సరాలు కావొస్తుంది ఘన్‌పూర్ ఆనకట్ట కట్టి, 12 మంది శాసనసభ్యులు తరువాత నేను 13 శాసనసభ్యుడిని, పది కోట్ల రూపాయలు ఫతేనగర్ కాలువల యొక్క మరమ్మత్తుల గురించి కేటాయించిన దాఖలాలు ఎప్పుడూ లేవు. మొట్టమొదటిసారి మా ప్రాంత రైతుల యొక్క కన్నీళ్లను తుడిచి, వెలుగు నింపాలనే ప్రధాన ఉద్దేశ్యంతో పది కోట్ల రూపాయలు ఇచ్చినందుకు ముఖ్యమంత్రి గారికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. మెదక్ జిల్లా తెలంగాణాలోనిది కాదా అని నేను ప్రశ్నిస్తున్నాను.

అధ్యక్షా, రాజనరసింహ అనే మాజి మంత్రి గారి కుమారుడు దామోదర్ గారు 102 రోజులు నిర్విరామంగా ధర్నా చేసి, ఒక హంగర్ స్ట్రైక్ చేస్తే, అప్పుడున్నటువంటి లీడర్ అఫ్ ది అపోజిషన్ గారు ఆ ప్రాంతానికి వచ్చి, ఈ ప్రాంతంలో సింగూరు ప్రాజెక్టు నుండి నలభై వేల ఎకరాలకు నీళ్లు ఇస్తామని అన్నారు. దానికి 90 కోట్ల రూపాయలు, ఇచ్చారు. మెదక్ జిల్లాలో దాదాపు 125 కోట్ల రూపాయలు, 22 నెలల్లో మా జిల్లాకు అందించిందని మరొకసారి గుర్తుచేస్తున్నాను. ఈ జలయజ్ఞం ద్వారా దాదాపు 46 వేల కోట్ల రూపాయలతో, నూతన ప్రాజెక్టులు నిర్మించి, నీటి సరఫరా చేయడం ఈ ప్రభుత్వం యొక్క ముఖ్య ఉద్దేశ్యం. దిక్కుతోచని స్థితిలో ఉన్న రైతులకు సహాయం అందించడం ఈ ప్రభుత్వ లక్ష్యం. ఈ ప్రభుత్వానికి మేము పూర్తిగా సహాయసహకారాలు అందజేస్తాము. ఈ ప్రభుత్వం కొంచెం మైనర్ ఇరిగేషన్ పైన కూడ దృష్టి సారించాలి. తెలంగాణా ప్రాంతంలో 13,657 చెరువులు, కుంటలు ఉన్నాయి. వీటిని అనుసంధానం చేస్తూ, వాటి మరమ్మత్తులకు పది లక్షలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాను. అదే విధంగా తెలంగాణా ట్యాంక్స్ డెవలప్‌మెంట్ బోర్డును ఏర్పాటు చేయవలసిందిగా ముఖ్యమంత్రి గారిని కోరుతున్నాను. చాలా సంవత్సరాల తరువాత ఒక రైతు రాజ్యం ఏర్పడింది. ఈ ప్రాజెక్టులను అడ్డుకోవద్దని ప్రతిపక్షనాయకులందరినీ కోరుతున్నాను. వ్యవసాయ రంగాన్ని పూర్తిగా గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని గుర్తించి ఈ ప్రభుత్వం మేజర్ ఇరిగేషన్‌కు, మైనర్ ఇరిగేషన్‌కు, మీడియం ఇరిగేషన్‌కు పెద్ద ఎత్తున నిధులు కేటాయించడం సర్వత్రా హర్షనీయం. తెలంగాణాలో పూర్తిగా ....

శ్రీ ఎస్. విజయరామరాజు: అధ్యక్షా, గౌరవసభ్యులు పది కోట్లకు బదులు పది లక్షలు అన్నారు. ఆ జిల్లాకు పదిహేను కోట్లు కేటాయించడం జరిగింది.

మ. 1.30

శ్రీ పి. శశిధర్‌రెడ్డి: అధ్యక్షా, మెదక్ జిల్లాలో ఉన్నటువంటి మా ఘనపూర్ ఆనకట్ట మోడ్రనైజేషన్ గురించి పదికోట్లు కేటాయించమని అన్నాను. మైనర్ ఇరిగేషన్‌కు పదిహేను కోట్ల రూపాయలు కేటాయించారు, చాలా సంతోషం. ఆ జి.ఒలు తీసుకొని మా ప్రాంత రైతులకు యూజ్ చేసుకుంటాము. తెలంగాణాలో అతి పెద్ద కరువు జిల్లా మహబూబ్‌నగర్. ముఖ్యమంత్రి గారు అధికారంలోకి వచ్చిన తరువాత నాలుగు ప్రాధాన ప్రాజెక్టులు ఈ జిల్లాకు కేటాయించారు. దాదాపు ఆరు వేల కోట్ల రూపాయలు కేటాయించారు.

ఛైర్మన్: సభను రేపు ఉదయం 8.30 గంటల వరకు వాయిదా వేస్తున్నాను.

(సభ మ. 1.31 గంటలకు వాయిదా పడింది.)